మూసీ బ్యూటిఫికేషన్ రెండేండ్ల తర్వాతే!

- కూల్చివేతల వరకు ఆగాల్సిందే
- భూముల స్వాధీనమే సవాలు
- భూమి లెక్క తోనే మాస్టర్‌ప్లాన్
- స్పష్టం చేసిన ఎంఆర్‌డీసీఎల్

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 6(నమస్తే తెలంగాణ): మూసీ సుందరీకరణ కోసం అక్రమనిర్మాణాల పేరిట పేదలను కాంగ్రెస్ ప్రభుత్వం నిరాశ్రయులుగా మారుస్తుంటే.. ఆ భూములను స్వాధీనం చేసుకునే వరకు పనులు మొదలుపెట్టకూడదనే యోచనలో అధికారులు ఉన్నారు. భూముల స్వాధీనం చేసుకున్న తర్వాతే పనులు మొదలవుతాయని, అప్పటివరకు కనీసం కాగితాలపై కూడా ప్రణాళికలు రూపొందించే ఆలోచనేలేదని తెలిసింది. దీనిని బట్టి మూసీ సుందరీకరణ మొదలు కావాలంటే మరో రెండేండ్లు ఆగాల్సిందే.

స్వాధీనమే అసలు సమస్య

మూసీ ప్రక్షాళన పర్వంలో 45 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న రెసిడెన్షియల్, ఇండస్ట్రియల్, మతపరమైన స్థలాలను స్వాధీనం చేసుకోవడమే పెద్ద సవాలుగా మారనున్నది. ఇప్పటికే రివర్ బెడ్‌లో ఉన్న నిర్మాణాల గుర్తింపుతో హైదరాబాద్ అల్లకల్లోలమైంది. ప్రాథమికంగా 16వేల నిర్మాణాలు అని చెప్పినా... మార్కింగ్ తర్వాత ఆ సంఖ్య 40వేలకు పైనే ఉందని అంచనాకు వచ్చారు. ఎఫ్‌ఆర్‌ఎల్ పేరిట గీసిన గీతలతో మూసీలో కొట్టుకుపోయే నిర్మాణాలు లక్షన్నరపైనే ఉంటుందనే వెల్లడైంది. ఇక బఫర్ జోన్ పరిధి కూడా నిర్ధారణ జరిగితే ఈ సంఖ్య మరో రెండు లక్షలు దాటే అవకాశం ఉందని మూసీ వర్గాల్లో చర్చ నడుస్తున్నది. ఈ లెక్కన ప్రభుత్వ భూముల్లో నివాసితులుగా ఉన్న వారి తరలింపు సులభంగానే జరిగింది.కానీ పట్టా భూములు, అన్ని అనుమతులతో చేపట్టిన లే అవుట్లలో ప్లాట్లను కొనుగోలు చేసుకుని, అధికారిక అపార్టుమెంట్లలో ఉంటున్న వారిని ఆస్తుల స్వాధీనం సాధ్యమయ్యే పని కాదు. ఇప్పటికే జనాలు తమ నివాసాలను కాపాడుకునేందుకు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో మూసీ ప్రక్షాళన మరింత జాప్యం కానున్నది. అయినా భూములు స్వాధీనం తర్వాతే మూసీ బ్యూటీఫికేషన్ పనులు చేపట్టాలని ఎంఆర్‌డీసీఎల్ అధికారులు భావిస్తున్నారు.

ఎవ్వరడ్డుపడినా 'మూసీ' ఆగదు

- పేదలకు ప్రత్యామ్నాయం ఏం చేద్దామో చెప్పండి
- నిర్వాసితులకు ఇండ్లు కట్టి అందిస్తాం: సీఎం రేవంత్
- శిల్పకళా వేదికలో ఉద్యోగ నియామక పత్రాల పంపిణీ

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): మూసీ మురికిని ప్రక్షాళన చేయాలని నిర్ణయించుకున్నామని,ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ఆగబోదని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్టుల్లో భూసేకరణ తప్పనిసరి అని, ప్రతిపక్షాలు రాజకీయం చేయకుండా నిర్వాసితులకు ఏం చేయాలో సలహాలివ్వాలని అన్నారు. ఆదివారం హైదరాబాద్ శిల్పకళా వేదికలో వివిధ శాఖల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్, అగ్రికల్చర్ ఆఫీసర్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్, లైబ్రేరియన్స్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ ఉద్యోగాలకు ఎంపికైన 1,635 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి సీఎం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఉద్యోగ నియామక పత్రాలు అందించటం సంతోషంగా ఉన్నదని, ఏండ్లుగా నిరీక్షించిన అభ్యర్థుల కలసాకారమవుతున్నదని తెలిపారు. మోక్ష గుండం విశ్వేశ్వరయ్య లాంటి అద్భుత కట్టడాలను కట్టిన ఇంజినీర్లను ఆదర్శంగా తీసుకోవాలని, ఉద్యోగంలో చేరింది మొదలు విరమణ వరకు ఒకేవిధంగా వ్యవహరించాలని సూచించారు. అక్టోబర్ 9న 11,063 మందికి ఉపాధ్యాయ నియామక పత్రాలు అందించబోతున్నామని సీఎం వెల్లడించారు.

మూసీ ప్రక్షాళన ఆగబోదు

మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలు మూసీ కంపులోనే బతకాలా? అని సీఎం ప్రశ్నించారు. మూసీ పరివాహక ప్రజలకు ఇండ్లు కట్టించి వారికి మంచి భవిష్యత్తును అందిద్దామని తెలిపారు. ప్రతిదానికి అడ్డుపడకుండా, మూసీ బాధితులను ఎలా ఆదుకోవాలనే అంశంపై సలహాలివ్వాలని ప్రతిపక్ష నేతలను కోరారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, కే కేశవరావు, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, సీఎస్ శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అబద్ధాల రంగనాథ్..!

మొదటిపేజీ తరువాయి...

వివరణ ఇవ్వలేదు. అప్పటినుంచి ఇప్పటి వరకు ఆయన ప్రకటనలు, వైఖరి విచిత్రంగా ఉన్నాయి.

పరిధి దాటి అడుగులు

రేవంత్ సర్కారు హైడ్రా ఏర్పాటు చేసి, దాని పరిధిని నిర్ణయిస్తూ ఆగస్టు 19న జీవో 99 జారీచేసింది. కానీ దానికి ఒకరోజు ముందుగానే హైడ్రా నార్సింగి మున్సిపాలిటీ తోపాటు అవుటర్ రింగురోడ్డు దాటి గండిపేట ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయంటూ పలు నిర్మాణాలను కూల్చివేసింది. ఇందులో ఓఆర్ఆర్ అవతలి ఖానాపూర్ గ్రామం కూడా ఉంది. అయితే ఈ గ్రామం ఓఆర్ఆర్ లోపల ఉన్న నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోకి వస్తుంది కాబట్టి దానిపై తమ అధికారం చెల్లుతుందని రంగనాథ్ వివరణ ఇచ్చారు. కానీ అదేరోజు ఓఆర్ఆర్ లోపల ఉన్న ఏ మున్సిపాలిటీ తోనూ సంబంధంలేని గ్రామపంచాయతీలు హిమాయత్‌నగర్, దాని పరిధిలోని అప్పోజీగూడ, చిలుకూరు గ్రామపంచాయతీ పరిధుల్లోని కూడా పలు నిర్మాణాలను కూల్చివేశారు. ఈ గ్రామాలలోకి హైడ్రా ఎందుకు వెళ్లిందనే దానిపై ఇప్పటివరకు కమిషనర్ వివరణ ఇవ్వలేదు. కేవలం ఒక పారిశ్రామికవేత్త నిర్మాణాలను కూల్చివేసేందుకే హైడ్రా ఆ గ్రామాలలోకి వెళ్లిందనేది బహిరంగ రహస్యం.

జన్వాడపై జీవోకు విరుద్ధంగా వ్యాఖ్యలు

జీవో 99 ప్రకారం హైడ్రా పరిధి 2053.44 చదరపు కిలోమీటర్లు. ఇందులో జీహెచ్‌ఎంసీతోపాటు ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఏరియా, టీఎస్ఐఐసీ, ఐలాతో సహా 61 పారిశ్రామిక

ప్రాంతాలు, 20 మున్సిపాలిటీలు, 33 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామ పంచాయతీల్లో జన్వాడ (నంబర్ 32) కూడా ఉంది. కానీ హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాత్రం జన్వాడ తన పరిధిలోకి రాదంటారు. ఇదేమంటే.. అది 111 జీవో పరిధిలో ఉన్నందున, హైడ్రాకు సంబంధం లేదంటారు. మరి 111 జీవో పరిధిలో ఉన్న ఖానాపూర్ గ్రామంలో హైడ్రా ఆగస్టు 18న ఎందుకు కూల్చివేతలు చేపట్టింది? చిలుకూరు, హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీ, దాని పరిధిలోని అప్పోజీగూడలో కూడా అదే రోజు కూల్చివేతలు జరిగాయి. మరి ఇక్కడ 99 జీవో ప్రామాణికమా? 111 జీవో ప్రామాణికమా? రంగనాథ్ సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ఉంది.

111 జీవోపై మారిన హైడ్రా వైఖరి

వాస్తవానికి హైడ్రా తొలుత 111 జీవో పరిధిని పట్టించుకోలేదు. అందుకే ఖానాపూర్, అప్పోజీగూడల్లో కూల్చివేతలు చేపట్టింది. కారణం దాని లక్ష్యం జన్వాడ. ఈ క్రమంలోనే జన్వాడలోని ఫాంహౌజ్ ముందు రెండు, మూడు రోజులపాటు హైడ్రామా నడిచింది.

పూటకో లాజిక్

> ప్రజలు నివాసమున్న నిర్మాణాల జోలికి వెళ్లబోమని సాక్షాత్తు హైడ్రా కమిషనర్ రంగనాథ్ సెలవిచ్చారు. కానీ మాదాపూర్ పరిధిలోని సున్నంచెరువు, మల్లంపేట పరిధిలోని కత్వా చెరువు పరిధిలో జనం నివాసమున్న నిర్మాణాలను కూల్చివేశారు. ఇదేమంటే.. సున్నం చెరువు పరిధిలోని వారు వ్యాపారం చేస్తున్నారని, కత్వా చెరువు పరిధిలో రాత్రికి రాత్రి గృహ ప్రవేశాలు జరిగాయని సెలవిచ్చారు. వాస్తవానికి సున్నంచెరువు పరిధిలో నిరుపేదలు నివసిస్తున్న ఇండ్లు ఉన్నాయి. సంగారెడ్డి పరిధిలోని అమీన్‌పూర్, కిష్టారెడ్డిపేటల్లో కూడా కొన్నేండ్ల నుంచి నివాసం ఉంటున్న వారి ఇండ్లు కూల్చేశారు.

మూసీతో ఎందుకు సంబంధం ఉండదు?

ఓఆర్ఆర్‌కు ఈవల ఉన్నదంతా హైడ్రా పరిధియేనని జీవో 99లో పేర్కొన్నారు. కానీ హైదరాబాద్ నగరం నడిబొడ్డున ప్రవహిస్తుతన్న మూసీ నది పరిసరాలు తన పరిధిలోకి రావని హైడ్రా కమిషనర్ చెప్తున్నారు. దాని ప్రత్యేకంగా ఎంఆర్‌డీసీఎల్ (మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) ఉంది అని అంటున్నారు. ఔటర్ వరకు ఉన్న నీటి వనరులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణే హైడ్రా ధ్యేయమైనప్పుడు మూసీ హైడ్రా పరిధిలోకి ఎందుకు రాదు? నగరంలోని చెరువులకు ప్రత్యేకంగా జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ ఉన్నాయి. గండిపేటకు సంబంధించి ప్రత్యేకంగా జలమండలి, నీటిపారుదల శాఖ ఉన్నాయి. ఈ శాఖలు, విభాగాలన్నింటి అధికారాలు హైడ్రాకు బదిలీ అయినపుడు ఎంఆర్‌డీసీఎల్‌కు ప్రత్యేకంగా అధికారాలు మిగిలి ఉన్నాయా? ఉంటే ఆ విషయాన్ని జీవో 99లో ప్రభుత్వం పేర్కొనాలి కదా? మూసీ పరిధిలో కూల్చివేతలన్నీ రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలోనే కొనసాగుతున్నాయి. హైడ్రా కూడా రెవెన్యూ శాఖ నోటీసులిచ్చిన ప్రాంతాల్లోనే కూల్చివేతలు చేపడుతున్నది. మూసీ విషయంలో మాత్రం హైడ్రా ఎందుకు తప్పించుకుంటుంది? ఆస్తుల పరిరక్షణకే హైడ్రా ఉన్నపుడు మూసీ ఎందుకు మినహాయింపు? దీని వెనక మతలబు ఏంది?

నీటిపారుదల శాఖ అధికారులు ఫాంహౌజ్ ముందున్న బుల్వాపూర్ నాలాను సర్వే చేశారు. ప్రహరీగోడ మినహా మిగిలిన నిర్మాణం అంతా నిబంధనల మేరకే ఉందని తేలింది. ఆ సమయంలో చేవెళ్లలో ఒక కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. 'హైడ్రా 111 జీవో పరిధిలో ఉన్న ఒక్క నిర్మాణం జోలికి కూడా రాదు.. ఇది నా హామీ' అని చెప్పారు. దీంతో జన్వాడ ఎపిసోడ్ పక్కకు పోయింది. అప్పటినుంచి 111 జీవో తమ పరిధిలోకి రాదంటూ హైడ్రా కమిషనర్ ప్రకటించడం మొదలుపెట్టారు. గతంలో 111 జీవో పరిధిలో నిర్మాణాలు కూల్చివేసిన హైడ్రా ఆ తర్వాత వైఖరి ఎందుకు మార్చుకుంది?

అన్నకు అన్నిరకాల అండా..దండ

మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్‌కు నీటిపారుదల శాఖ నోటీసులు ఇవ్వగా.. హైడ్రా కూల్చేసింది. దుర్గంచెరువు, సున్నంచెరువు పరిధిలో రెవెన్యూశాఖ నోటీసులు ఇచ్చింది. హస్మత్‌పేట పరిధిలో నీటిపారుదలశాఖ నోటీసులు ఇచ్చింది. కూకట్‌పల్లి నల్లచెరువు పరిధిలో జీహెచ్‌ఎంసీ ఇచ్చింది. వీటిల్లో సున్నం చెరువు, నల్లచెరువు పరిధిల్లో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. కానీ దుర్గంచెరువు పరిధిలో నెల రోజుల గడువు ఇచ్చి.. నెలన్నర గడిచినా అటువైపు రెవెన్యూశాఖ, హైడ్రా కన్నెత్తి చూడలేదు. దుర్గంచెరువులో సీఎం రేవంత్‌రెడ్డి అన్న తిరుపతిరెడ్డి నివాసం కూడా ఉంది. అందుకే హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకునే దాకా అందరూ మౌనం వహించారు. మరి ఇదేం ద్వంద్వ వైఖరి?

ఒవైపే వంత రాగానే నాలుక మడత...

ఓ రాజకీయ లక్ష్యంతో ఆదిలో దూకుడు ప్రదర్శించిన హైడ్రా.. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన విద్యా సంస్థలపైనా గురి పెట్టింది. ఈ మేరకు పలు శాఖల నుంచి వాటికి నోటీసులు కూడా అందాయి. ఇక రేపో మాపో బుల్డోజర్లు దించుతారని అనుకుంటుండగా.. అనూహ్యంగా తెరపైకి ఒవైసీలకు చెందిన ఫాతిమా కాలేజీ వచ్చింది. సల్కం చెరువు ఎఫ్‌టీఎల్‌లో యథేచ్ఛగా కాలేజీ నిర్మించిన చిత్రాలు జనబాహుళ్యంలో వైరల్ అయ్యాయి. ఆ కాలేజీని కూల్చే దమ్ముందా? అన్న సవాళ్లు పెరిగాయి. ఎక్కడ ఇరుకున పడతామోనని భావించిన సీఎం రేవంత్‌రెడ్డి మీడియా చిట్‌చాట్‌లో విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా విద్యా సంస్థలకు సమయం ఇస్తామని ప్రకటించారు. దానిని అందిపుచ్చుకున్న రంగనాథ్ కూడా విద్యా సంస్థల జోలికి ఇప్పుడే వెళ్లమని చెప్పారు. మల్లారెడ్డి, పల్లా కాలేజీల విషయంలో గుర్తుకురాని విద్యార్థుల భవిష్యత్తు ఒవైసీ కాలేజీ విషయంలోనే ఎందుకు గుర్తొచ్చింది?

జీవో వేరు.. మ్యాపు వేరా?

గత కొన్నిరోజుల నుంచి హైడ్రా కమిషనర్ తమ పరిధిపై మళ్లీ తడబాటు ప్రదర్శిస్తున్నారు. ఈ క్రమంలో అలవోకగా అబద్ధాలతో కూడిన లాజిక్‌లు వల్లిస్తున్నారు. ఇటీవల ఇబ్రహీంపట్నం చెరువు ప్రస్తావన వచ్చినపుడు.. అసలు హైడ్రా అక్కడికి వెళ్లలేదన్నారు. కానీ చెరువును పరిశీలించిన వారిలో హైడ్రా అధికారులు కూడా ఉన్నారు. హెచ్‌ఎండీఏలో శంషాబాద్ జోన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా ఉండి, హైడ్రాకు బదిలీ అయిన రాంరెడ్డి, హైడ్రాలో పని చేస్తున్న ఆర్ఎఫ్ఓ పాపయ్య అక్కడికి వెళ్లారు. మరోసారి ఇబ్రహీంపట్నంపై ఇంకో లాజిక్ వినిపించారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ అనేది మ్యాపు ప్రకారం హైడ్రా పరిధిలోకి వస్తుందన్నారు. అంటే 99 జీవోలో స్పష్టంగా హైడ్రా పరిధి పేర్కొన్నారు. దీని ప్రకారం ఇబ్రహీంపట్నం చెరువు అవుటర్ అవతల 7-8 కిలోమీటర్ల దూరంలో ఉంది. మరి.. కమిషనర్ రంగనాథ్ చెప్పే మ్యాపు ఏమిటో? దానిని అధికారికంగా ఇప్పటివరకు ఎందుకు విడుదల చేయలేదు? జీవో 99కి భిన్నంగా మ్యాపులో హైడ్రా పరిధి ఉందా? వీటన్నింటికీ సమాధానం చెప్పేదెవరు?!

మూసీ నిర్వాసితుల జీవనోపాధికి కమిటీ

హైదరాబాద్, అక్టోబర్ 6(నమస్తే తెలంగాణ): మూసీ నిర్వాసితుల జీవనోపాధికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్‌పర్సన్‌గా సెర్ప్ సీఈవో, వైస్ చైర్‌పర్సన్‌గా జీహెచ్ఎంసీ కమిషనర్, ఎంఆర్‌డీసీఎల్ సంయుక్త మేనేజింగ్ డైరెక్టర్ మెంబర్ కన్వీనర్‌తో కూడిన 14మంది సభ్యులను కమిటీలో నియమించింది. పునరావాస ప్రాంతాలకు వచ్చిన నిర్వాసితులకు ఈ కమిటీ జీవనోపాధి కల్పించనున్నది. అంతేకాకుండా నిర్వాసితులను ఇతర ప్రాంతాలకు తరలించే క్రమంలో వచ్చే సమస్యలు,పరిష్కారాలపై కమిటీ అధ్యయనం చేసి 30రోజుల్లో నివేదిక సమర్పించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొన్నది.

లక్షన్నర కోట్ల మతలబేంటి?

- మూసీ బడ్జెట్‌పై పోరాటం
- సీఎం రేవంత్‌కు బహిరంగ లేఖలో ఎంపీ ఈటల

హైదరాబాద్, అక్టోబర్6 (నమస్తే తెలంగాణ): మూసీ ప్రక్షాళన ప్రాజెక్టుకు లక్షన్నర కోట్ల బడ్జెట్‌లో మతలబేంటో తెలిసేదాకా ప్రతిఘటన తప్పదని, ఇప్పటికైనా అఖిలపక్ష సమావేశం పెట్టాలని, వచ్చేందుకు తాము సిద్ధమని సీఎం రేవంత్‌రెడ్డికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ లేఖరాశారు. హైడ్రా సంస్థకు, మూసీ ప్రక్షాళనకు తాను వ్యతిరేకం కాదని వెల్లడించారు. అయితే హైదరాబాద్‌లోని చెరువుల్లో దుర్గంధాన్ని తొలగించకుండా, 40 ఏండ్ల కింద ప్రభుత్వం ఇచ్చిన పట్టా భూముల్లో, అనుమతించిన లే అవుట్లలో ఇల్లు కట్టుకున్న పేదలను భయభ్రాంతులకు గురిచేస్తూ అడ్డగోలు కూల్చివేతలు చేపట్టడాన్నే వ్యతిరేకిస్తున్నామని వెల్లడించారు. పట్టాభూముల్లో ఇల్లు కట్టుకొని ఉంటున్న వారిని బఫర్‌జోన్ పేరుతో అక్రమంగా కట్టుకొని ఉంటున్నారని చిత్రీకరించడం దుర్మార్గమని పేర్కొన్నారు. బ్యూటిఫికేషన్ పేరిట మాల్స్ కట్టి పెద్దలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తావా ? అంటూ నిలదీశారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ నిర్ధారించకుండా కూల్చివేత లు ఎలా చేస్తారు? అని ప్రశ్నించారు. సర్కార్ తీరుతో హైదరాబాద్ భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతున్నదని విమర్శించారు.

మూసీ సర్వే అంతా మాయ!

- సర్వేలు చేయకుండానే ప్రభుత్వ భూములంటూ రికార్డులు
- ప్రభుత్వ శాఖల ఎన్వోసీలకూ విలువలేదా?
- 1968 నుంచి ఉంటే కబ్జాదారులం అవుతామా?
- సర్వేలు చేయకుండా ఎలా మార్కింగ్ చేస్తారు?
- చైతన్యపురిలోని మారుతీనగర్ వాసుల ఆందోళన

హైదరాబాద్ సిటీబ్యూరో/ఎల్బీనగర్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): 'మా జోలికి వస్తే ఊరుకునేదే లేదు' అని తెగేసి చెప్తున్నారు మూసీ బాధితులు. చైతన్యపురిలోని సత్యనగర్, మారుతీనగర్, వినాయక్‌నగర్, ఫణిగిరి కాలనీ.. ఇలా తొమ్మిది కాలనీల్లో అందరి నోటా ఇదే మాట. తామెవరం కబ్జాదారులం కాదని, తమ ఏరియాను సర్వే చేసిన మ్యాప్స్ ఒక్కో శాఖది ఒక్కో మాదిరి ఉందంటూ మ్యాప్స్ చూపిస్తున్నారు. ముఖ్యంగా ఈ కాలనీలన్నీ మూసీ నుంచి సుమారు 23 నుంచి 25 ఫీట్ల ఎత్తులో ఉన్నాయి. తమకు ల్యాండ్ వచ్చిన లింక్ డాక్యుమెంట్స్, హుడా అప్రూవల్ లెటర్స్, రిజిస్ట్రేషన్ ఆఫీసర్ నుంచి ఇచ్చిన ఈసీ, హుడా రెసిడెన్షియల్ సర్టిఫికెట్, లీగల్ ఒపీనియన్స్.. ఇవన్నీ ఇరవై, ముప్పై ఏండ్ల కిందటివి అని చూపిస్తూ, ఇంతకంటే ఇంకేం కావాలి? అని ప్రశ్నిస్తున్నారు. గూగుల్ మ్యాపులు చూస్తుంటే లంగర్‌హౌజ్ నుంచి నాగోల్ వరకు బఫర్‌జోన్, ఎఫ్టీఎల్, రివర్‌బెడ్ ఎంత తేడాగా కనిపిస్తుందో మాడాలని చెప్తున్నారు. చైతన్యపురి జోన్‌కు వచ్చేసరికి వెడల్పు పెంచారని, మిగతాచోట్ల సన్నగా ఉంచడం ఎంతవరకు కరెక్ట్? అని మూసీ అలైన్‌మెంటే సరిగా లేదని, నదీపారకంపై శాస్త్రీయంగా సర్వే జరగలేదని ఆరోపిస్తున్నారు.

50 ఏండ్ల కిందట మారుతీనగర్ లేఔట్

'చైతన్యపురిలోని మారుతీనగర్ లేఔట్ చేసి 48 ఏండ్లైంది. సర్వే నంబర్ 78/2లో 1.08 గుంటల భూమిలో మారుతీనగర్ పేరుతో కొత్తపేట విలేజ్, నాగోల్ గ్రామపంచాయతీ, హయత్‌నగర్ తాలూక, రంగారెడ్డి జిల్లాలో ఏర్పాటుచేశారు. ఈ లేఔట్ చేయడానికి కావలసిన లింక్ డాక్యుమెంట్స్ కూడా 1968 నుంచి ఉన్నాయి. వీటితో లీగల్ ఒపీనియన్ కూడా తీసుకున్నారు. హుడా ఈ ప్రాంతాన్ని రెసిడెన్షియల్‌గా అప్రూవల్ చేస్తూ సర్టిఫికెట్ ఇచ్చింది. సబ్‌రిజిస్ట్రార్ కూడా దీనికి సంబంధించిన సర్టిఫికెట్ ఇచ్చారు. పహాణీల్లోనూ ఈ ల్యాండ్‌ను డ్రై , పట్టా భూములుగా పేర్కొన్నారు. ఇవన్నీ కొత్తగా తీసుకున్న సర్టిఫికెట్లు కావు. ఈ సర్టిఫికెట్లు అన్నీ అధికారులు ఇచ్చినవేగా!' అని స్థానికులు చెప్తున్నారు.

గతంలో నామమాత్రంగా సర్వే

'కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో ఏప్రిల్ 2013లో రంగారెడ్డి జిల్లా అధికారులు ప్రభుత్వ భూములకు సంబంధించిన రికార్డుల్లో లోపాలు సవరించడానికి సర్వే చేశారు. అయితే ఈ సర్వేను సబ్‌రిజిస్ట్రార్, రెవెన్యూ అధికారులు చేయాలని జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో కమిటీ నియమించారు. సుమారు పది వేల సర్వే నంబర్లలో తేడాలున్నాయని, వీటిని గుర్తించి తప్పులు సరిదిద్దడానికి కమిటీ కార్యాచరణ చేపట్టింది. కానీ అప్పటి పరిస్థితుల కారణంగా సర్వే చేయకుండానే.. తప్పులనే తిరిగి సైట్‌లో నమోదు చేశారు. దీంతో పట్టా భూములేవి? ప్రభుత్వ భూములేవి? అనే విషయంలో సరైన సర్వే జరగకపోవడం వల్ల ఇప్పుడు కొత్త సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికైనా సర్వే చేసి రికార్డుల పరిశీలనతో శాస్త్రీయ విధానంలో తప్పులు సరిదిద్దాలి' అని మారుతీనగర్ వాసులు కోరుతున్నారు.

జీహెచ్ఎంసీ, ధరణి మ్యాపుల్లో తేడాలు

మారుతీనగర్ మ్యాపులు ప్రభుత్వశాఖల్లో ఒక్కోదగ్గర ఒక్కోలా కనిపిస్తున్నదని తెలుస్తున్నది. 78/2 సర్వే నంబర్ మ్యాప్‌ను పరిశీలిస్తే ధరణిలో ఒకలా, జీహెచ్ఎంసీలో మరోలా, హెచ్ఎండీఏలో ఇంకోలా ఉన్నాయి. మారుతీనగర్, సత్యనగర్‌లో ఉన్న కొన్ని ఇండ్లు ఒక మ్యాపులో ఎఫ్‌టీఎల్ బయట, మరోమ్యాపులో ఎఫ్‌టీఎల్ లోపల కనిపిస్తున్నాయి. శాస్త్రీయతే లేకుండా మ్యాపింగ్ చేశారని, ఇప్పటివరకు సరైన మ్యాపులు లేకపోవటం వల్ల చాలా సమస్యలు వస్తున్నాయని అధికారులే అనధికారికంగా చెప్తున్న పరిస్థితి. 'మార్కింగ్ సమయంలో మార్కింగ్ ఎలా చేస్తున్నారని తాము అడిగితే.. తమ వద్ద ఉన్న రికార్డులను బట్టి చేస్తున్నామని అధికారులు తెలిపారు. మరి మా దగ్గర ఉన్న డాక్యుమెంట్స్ పరిస్థితి ఏమిటి? అని అడిగితే మాకేం తెలియదు అని వారు అంటున్నారు. డాక్యుమెంట్లు చూపించేందుకు వెళ్తే పట్టించుకోవటం లేదు. సరైన విధానంలో సర్వే చేసి ప్రజల ముందు పెట్టి ఆ తర్వాత మూసీ రివర్‌బెడ్, ఎఫ్టీఎల్, బఫర్‌జోన్ల హద్దులను నిర్ణయించాలి' అని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రంగనాథ్ వర్సెస్ ఆమ్రపాలి

రిలే దీక్షలు చేస్తున్న గిరిజనేతరులు

ఇండ్ల కూల్చివేతపై ఇంద్రవెల్లిలో నిరసనలు

- గిరిజనేతరుల రిలే దీక్షలు
- స్వచ్ఛందంగా దుకాణాల బంద్

ఇంద్రవెల్లి, అక్టోబర్ 6 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం అమలు కాకముందు నుంచి నివాసం ఉంటున్న గిరిజనేతరులకు రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కల్పించి ఆదుకోవాలని గిరిజనేతరుల సంఘం, గిరిజనేతరుల ఐక్య వేదిక జిల్లా నాయకులు జాడే నాగోరావ్, మారుతి పటేల్ డోంగ్రే డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండల కేంద్రంలో శనివారం అధికారులు ఇండ్లను కూల్చివేయడంపై భగ్గుమన్నారు. ఇందుకు నిరసనగా ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో రిలే దీక్షలు చేపట్టారు. వీరికి సంఘీభావంగా మండల కేంద్రంలోని వ్యాపారులు తమ దుకాణాలను స్వచ్ఛందంగా బంద్ పాటించారు.

పేదలను ఇబ్బంది పెడితే ఊరుకోం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

వనపర్తి, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): మూసీ నది ప్రక్షాళన పేరిట పేదలకు నష్టం కలిగిస్తే చూస్తూ ఊరుకోబోమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హెచ్చరించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సీపీఎం నాయకురాలిగా సేవలందించిన ఎన్ఎస్ లక్ష్మీదేవమ్మ సంస్మరణ సభను ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. నదిని కాలుష్యం చేస్తున్న ఫార్మా కంపెనీలను ముట్టుకునేందుకు ప్రభుత్వానికి ధైర్యం లేక.. 15 వేల పేదల ఇండ్లను తొలగించాలని రేవంత్‌రెడ్డి సర్కార్ చూస్తున్నదని విమర్శించారు. మూసీ ప్రక్షాళన, కాలుష్య నివారణకు తాము వ్యతిరేకం కాదని, ముందుగా పేదలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

జీహెచ్ఎంసీలో హైడ్రా మంట

- కమిషనర్ల మధ్య ఆధిపత్య పోరు
- గ్రేటర్‌పై పెత్తనానికి హైడ్రా ఆరాటం
- బల్దియా ఉద్యోగులు, పాలకుల మండిపాటు
- హైడ్రా నుంచి రాని అధికారులపై గ్రేటర్ కమిషనర్ చర్యలు ?
- జీతాలు ఆపాలని ఫైనాన్స్ విభాగానికి లేఖ

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో తన మార్క్ పాలన కోసం ఓ అధికారి తాపత్రయపడుతుంటే, అదే గ్రేటర్ విషయంలో తన పెత్తనం కోసం మరో అధికారి చూపుతున్న అత్యుత్సాహం ఆ ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య కోల్డ్‌వార్‌కు దారితీసింది. జీహెచ్ఎంసీ కమిషనర్ (ఐఏఎస్), హైడ్రా కమిషనర్ (ఐపీఎస్) మధ్య అంతర్గత వివాదం చెలరేగింది. హైడ్రా ఏర్పాటయ్యాక జీహెచ్ఎంసీ ఉద్యోగులు కార్పొరేషన్ పనులను వదిలేసి హైడ్రా వెంట తిరుగుతుండటంతో గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలి ఇటీవల కన్నెర్రజేశారు. జవాబుదారీతనం లేకుండా వ్యవహరిస్తే సహించేది లేదంటూ హెచ్చరించారు. హైడ్రా నుంచి రిలీవ్ కావాలంటూ ఉత్తర్వులు వచ్చినా విజిలెన్స్ అధికారులు, సిబ్బంది అక్కడినుంచి రాకపోవడంతో వారిపై చర్యలకు సిద్ధమయ్యారు. ఏకంగా వారి జీతాలను ఆపేయాలంటూ ఫైనాన్స్ విభాగానికి లేఖ

మంచి రోజులు మళ్లొస్తయి

- అన్నదాతలు ఆత్మస్థైర్యం కోల్పోవద్దు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): ముంచే రోజులు పోయి మళ్లీ మంచి రోజులు వస్తాయని, అన్నదాతలు ఆత్మస్థైర్యం కోల్పోవద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఒకే రోజు ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకోవడానికి రేవంత్ సర్కారే కారణమని ఆరోపించారు. పొలం ఉన్న రైతులనూ పొట్టనబెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కౌలు తీసుకున్న కర్షకుల నూ కబళిస్తున్నారని ఎక్స్‌వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. సాగునీటి సంక్షోభం, రుణమాఫీ ద్రోహం, రైతుభరోసా మోసం, కౌలు రైతుకు అందని సాయం.. రైతుకు రక్షణ వలయంగా ఉన్న పథకాలను ఒక్కొక్కటిగా ఎగ్గొట్టడంతోనే వ్యవసాయం విషవలయంలో చిక్కుకున్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో వందలాదిమంది రైతులు పిట్టల్లా రాలిపోతున్నా చలనం లేదని, ముఖ్యమంత్రికి సోయిలేదని, ప్రభుత్వానికి బాధ్యత లేదని దుయ్యబట్టారు. దసరా పండుగ వేళ వ్యవసాయాన్ని దండుగలా మార్చిన సీఎం రేవంత్‌కు రైతన్నల చేతిలో దండన తప్పదని హెచ్చరించారు.

నిజామాబాద్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుప్రతిని చూపిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కేటీఆర్‌పై ట్రోల్స్‌ను సహించేది లేదు

- కాంగ్రెస్ పార్టీ నాయకులకు బీఆర్ఎస్ హెచ్చరిక
- రాష్ట్రవ్యాప్తంగా పలు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు చేస్తున్న కాంగ్రెస్‌పై గులాబీ శ్రేణులు మండిపడ్డాయి. అసహ్యకర, అడ్డగోలు, ఫేక్ పోస్టులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా పలు పోలీస్‌స్టేషన్లలో బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదులు చేశారు. హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, సిరిసిల్ల సహా పలు జిల్లాల్లో ఫిర్యాదు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు కేటీఆర్‌పై దుష్ప్రచారాన్ని ఆపకపోతే దీటుగా సమాధానం చెప్తామని హెచ్చరించారు.

మాంగళ్య దసరా కానుక

ప్రతి వినియోగదారుడికి పక్కాగా స్పాట్ గిఫ్ట్

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): దసరా, బతుకమ్మ పండుగ షాపింగ్ చేస్తున్నారా? మీ షాపింగ్ పూర్తయిన వెంటనే అద్భుతమైన కానుకలు అందించేందుకు మాంగళ్య షాపింగ్ మాల్ మీకు సాదర స్వాగతం పలుకుతున్నది. వస్త్ర ప్రపంచంలో సంచలనం సృష్టిస్తూ.. తనదైన ముద్ర వేసిన మాంగళ్యలో చిన్న, పెద్ద తేడాలేకుండా అన్ని వయసుల వారికి అన్ని రకాల వస్త్రాలు అందుబాటులో ఉన్నాయి. చిన్నారులకు వెరైటీ కలెక్షన్స్‌తో పాటు పురుషులు, మహిళలకు ఆకట్టుకునే సంప్రదాయ దుస్తులు అందుబాటు ధరలో ఉన్నాయి. ప్రత్యేకంగా శారీస్, చుడీదార్స్, లెహంగాస్, లెగ్గింగ్స్, పట్టు, ఫ్యాన్సీ, కంచి, ధర్మవరం.. ఒకటేమిటి లేటెస్ట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా అద్భుతమైన కలెక్షన్స్ తెచ్చిపెట్టింది. ఫ్యాషన్ వస్త్రాలతోపాటు సంప్రదాయ దుస్తులను అందుబాటులో ఉంచింది. 1 నుంచి 11వరకు రాష్ట్రంలోని అన్ని మాంగళ్య షాపింగ్ మాల్‌లో వినియోగదారులందరికీ స్పాట్ గిఫ్ట్‌లను అందించి సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తనున్నది.

రుణమాఫీ సగమే!

- స్పష్టం చేసిన ఎస్‌బీఐ గణాంకాలు
- ఆర్టీఐ కింద సమాచారం కోరిన మాజీ మంత్రి హరీశ్‌రావు
- ఎస్‌బీఐ లిఖితపూర్వక జవాబు

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): ఎప్పుడో గత డిసెంబర్ 9నే రుణమాఫీ చేస్తామని బీరాలు పలికి.. ఆ తర్వాత కనిపించిన దేవుళ్లందరి మీదా ఒట్టేసి ఆగస్టు 15 నాటికి రుణమాఫీ చేస్తామని పదేపదే ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటల్లోని డొల్లతనాన్ని స్వయంగా భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) బయటపెట్టింది. రుణమాఫీ పూర్తయిందని రేవంత్ పదేపదే చెప్తూ వచ్చారు. తాము ఒకే విడతలో రుణమాఫీ పూర్తిచేసినట్టు ప్రకటించుకున్నారు. ఎంతమందికి.. ఎన్ని కోట్లు మాఫీ చేశామని మాత్రం వెల్లడించలేదు. రుణమాఫీ కాక మనోవేదనతో కొందరు రైతులు గుండె ఆగి మరణిస్తే, మరికొందరు ఆత్మహత్యలు చేసుకున్నారు. ప్రభుత్వం చెప్తున్న నిబంధనల ప్రకారం తాము అర్హులమే అయినా రుణమాఫీ కాలేదంటూ రాష్ట్రవ్యాప్తంగా రైతులు రోడ్లెక్కి నిరసనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అసలు ఎంతమంది రైతులకు ఎంత మేర రుణమాఫీ అయిందో చెప్పాలంటూ మాజీమంత్రి హరీశ్‌రావు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద ఎస్‌బీఐని సమాచారం కోరారు. దీనికి ఎస్‌బీఐ సమగ్ర సమాధానాలు ఇచ్చింది. ఇప్పటివరకు సగంమందికే రుణమాఫీ అయినట్టు పేర్కొంటూ హరీశ్‌రావుకు పూర్తి వివరాలతో సమాధానం ఇచ్చింది.

హరీశ్‌రావు ఏం కోరారు?

లక్ష కంటే తక్కువ రుణాలు పొందిన రైతులు.. లక్ష, లక్షన్నర మధ్య, లక్షన్నర నుంచి 2 లక్షల మధ్య, 2 లక్షలు, అంతకంటే ఎక్కువ మొత్తంలో రుణాలు పొందిన రైతుల సంఖ్య ఎంత? వారికి అయిన రుణమాఫీ ఎంత? ప్రభుత్వం నిధులు ఎన్ని కేటాయించింది? ఇంకా ఎన్ని నిధులు అవసరం అవుతాయి? వంటి ప్రశ్నలతో దరఖాస్తు చేసుకున్నారు.

హరీశ్‌రావు ప్రశ్న

2024 జూన్ 1 వరకు బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి వ్యవసాయ రుణాలు పొందిన రైతుల మొత్తం సంఖ్యను అందించండి.

ఎ- లక్ష కంటే తక్కువ రుణాలు పొందిన రైతుల సంఖ్య

బి- రూ.1 లక్ష, రూ.1.5 లక్షల మధ్య రుణాలు పొందిన రైతుల సంఖ్య

సి- 1.5 లక్షల నుంచి 2 లక్షల మధ్య రుణాలు పొందిన రైతుల సంఖ్య

డి- 2 లక్షలు అంతకంటే ఎక్కువ రుణాలు పొందిన రైతుల సంఖ్య

ఎస్‌బీఐ సమాధానం

ఎ- లక్ష కంటే తక్కువ రుణాలు పొందిన రైతులు సంఖ్య - 5,74,137

బి- లక్ష, 1.5 లక్షల మధ్య రుణాలు పొందిన రైతుల సంఖ్య - 2,62,341

సి- 1.5 లక్షల, 2 లక్షల మధ్య రుణాలు పొందిన రైతుల సంఖ్య-1,65,607

డి- 2 లక్షలు, అంతకంటే ఎక్కువ రుణాలు పొందిన రైతుల సంఖ్య - 89,373

2వ ప్రశ్న: ఈ ప్రభుత్వంలో వ్యవసాయ రుణమాఫీ పొందిన రైతుల మొత్తం సంఖ్యను అందించండి.

ఎ- లక్ష కంటే తక్కువ రుణాలు పొందిన రైతుల సంఖ్య, మాఫీ అయిన మొత్తం

బి- లక్ష, 1.5 లక్షల మధ్య రుణాలు పొందిన రైతుల సంఖ్య, మాఫీ అయిన మొత్తం

సి- 1.5 లక్షల, 2 లక్షల మధ్య రుణాలు పొందిన రైతుల సంఖ్య, మాఫీ అయిన మొత్తం

డి- 2 లక్షలు, అంతకంటే ఎక్కువ రుణాలు పొందిన రైతుల సంఖ్య, మాఫీ మొత్తం

ఎస్‌బీఐ సమాధానం

ఎ- లక్ష కంటే తక్కువ రుణాలు పొందిన రైతుల సంఖ్య - 2,99,445. మాఫీ మొత్తం: రూ. 1,746,55,15,935

బి- లక్ష, 1.5 లక్షల మధ్య రుణాలు పొందిన రైతుల సంఖ్య -1,30,915. మాఫీ మొత్తం: రూ.1,584,60,10,501

సి- 1.5 లక్షల, 2 లక్షల మధ్య రుణాలు పొందిన రైతుల సంఖ్య-65,321, మాఫీ అయిన మొత్తం రూ. 1,093,95,67,128.

డి- 2 లక్షలు, అంతకంటే ఎక్కువ రుణాలు పొందిన రైతుల సంఖ్య, మాఫీ మొత్తం - ఎలాంటి సమాచారం లేదు.

3 ప్రశ్న: రైతుల వ్యవసాయ రుణమాఫీ కోసం ప్రభుత్వం ఎంత మొత్తం కేటాయించింది?
జవాబు: ఎలాంటి సమాచారం లేదు.

4 ప్రశ్న: ఇప్పటివరకు కేటాయించిన మొత్తం నుంచి ఎంత మొత్తం మాఫీ చేయబడింది?
జవాబు: బ్యాంకు వద్ద సమాచారం లేదు.

5 ప్రశ్న: రుణ మాఫీకి ఇంకా ఎంత మొత్తం కావాలి?
జవాబు: తెలియదు, ఎందుకంటే జీవో నిబంధనల ప్రకారం మొత్తం అర్హుల జాబితా బ్యాంక్‌కు అందించలేదు

దేశాన్నే వంచించి..

> మొదటిపేజీ తరువాయి...

ప్రభుత్వం ఎంతమంది రైతులకు ఎంతెంత రుణమాఫీ చేసింది? చేస్తున్న ప్రచారం ఏమిటి? వంటి విషయాలను లేఖలో ఉదహరించారు. రైతు రుణమాఫీ విషయంలో రేవంత్ సర్కార్ అనుసరిస్తున్న వైఖరిని సమాచార హక్కు చట్టం ద్వారా వెల్లడైన విషయాలను లేఖలో పేర్కొన్నారు.

రేవంత్‌రెడ్డీ.. ఇవిగో సాక్ష్యాలు..

- కాంగ్రెస్ పార్టీ 2023, డిసెంబర్ 9న పంట రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. రాహుల్‌గాంధీ కూడా తెలంగాణ రైతులకు 2023, డిసెంబర్ 9న పంట రుణమాఫీ పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.
- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోయింది. పార్లమెంట్ ఎన్నికల సమయంలో దాని గడువును పొడిగించింది. తెలంగాణ రైతుల నమ్మకం పొందడానికి ముఖ్యమంత్రి దైవసాక్షిగా 2024, ఆగస్టు 15 నాటికి పంట రుణమాఫీ పూర్తి చేస్తానని మరోసారి హామీ ఇచ్చారు.
- రూ.2 లక్షల వరకు రుణమాఫీ పూర్తి చేశామని ముఖ్యమంత్రి చేసిన ప్రకటన పూర్తి అవాస్తవం. 2024, సెప్టెంబర్ 25న నేను దాఖలు చేసిన ఆర్టీఐ ప్రకారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అందించిన సమాచారం ఆధారంగా ఇది స్పష్టంగా తెలుస్తున్నది. లక్షలోపు రుణం ఉన్న రైతుల సంఖ్య 5,74,137 కాగా, 2,99,445 మంది రైతులకే రుణమాఫీ అయింది. లక్ష నుంచి 1.5 లక్షల మధ్య రుణ రైతుల సంఖ్య 2,62,341 కాగా, ఇప్పటివరకు 1,30,915 మందికే మాఫీ అయింది. రూ.1.5 లక్షల నుంచి 2లక్షల మధ్య రుణ రైతుల సంఖ్య 1,65,607 కాగా, ఇప్పటివరకు 65,231 మందికే మాఫీ అయింది. ఎస్‌బీఐ నుంచి అందిన డాటా ప్రకారం, సుమారు 5.5 లక్షల రైతులు అంటే సుమారు 50శాతం రైతుల రుణమాఫీ కాలేదు. ఇతర బ్యాంకులకూ దాదాపు ఇలాంటి పరిస్థితులే.
- రూ.2 లక్షలకు పైన ఉన్న రుణాలను రైతులు చెల్లించిన తర్వాత మాఫీ చేస్తామని ప్రకటించారు. చాలా మంది రైతులు పై మొత్తాన్ని చెల్లించారు. అయినా ఎస్‌బీఐ నివేదిక ప్రకారం రుణమాఫీ కాలేదు. దుర దృష్టవశాత్తు చాలా మంది రైతులు ముఖ్యమంత్రి మాటలను నమ్మి వారి పంట రుణం మాఫీకి అర్హులు కాపడానికి ప్రైవేట్ రుణాలను అధిక వడ్డీకి తెచ్చుకున్నారు.
- మాఫీకి 31 షరతులు పెట్టి చాలా మంది రైతులను అర్హత కోల్పోయేలా చేశారు.
- కేసీఆర్ ఆరేండ్లుగా రూ.72,000 కోట్లను రైతుబంధు ద్వారా రైతులకు అందించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదటి దసరా ఇది. వానకాలం పంటకు పెట్టుబడి సాయం ఇప్పటికీ అందించలేదు. రుణ మాఫీ చేసినట్టు దేశమంతా తప్పుడు ప్రచారం చేసే ముందు, రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని పూర్తి చేయాలి.

2 లక్షల్లోపు మాఫీ అయిపోయింది

> మొదటిపేజీ తరువాయి...

హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చినా రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు' అంటూ ఈనెల 5న మహారాష్ట్రలో నిర్వహించిన ఓ బహిరంగ సభలో మోదీ చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ రేవంత్‌రెడ్డి రాసిన లేఖను ఆదివారం ఎక్స్ వేదికగా విడుదల చేశారు. 'మీరు చేసిన ప్రకటన వాస్తవికతను ప్రతిబింబించనందున నేను బాధపడ్డాను.. ఆశ్చర్యపోయాను' అంటూ లేఖలో వాపోయారు. రుణమాఫీ కోసం బడ్జెట్‌లో రూ. 26 వేల కోట్లు కేటాయించామని పేర్కొన్నారు. అవసరమైతే రూ.31 వేల కోట్ల వరకు వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రస్తావించారు. మొదటి విడుతలో రూ.2 లక్షల వరకు మాఫీ చేశామని, మరో విడుతలో రూ.2 లక్షలకు పైగా లోన్లను మాఫీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీల్లో రుణమాఫీకి అగ్ర ప్రాధాన్యమిచ్చామని, రుణమాఫీ ద్వారా తమ అంకితభావాన్ని చాటుకున్నామని తెలిపారు. 'ప్రధానమంత్రి గారూ తెలంగాణ రైతుల ఆత్మస్థయిర్యాన్ని తగ్గించే బదులు..ఇద్దరం కలిసి పెంపొందించేందుకు ప్రయత్నిద్దాం' అని పేర్కొన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధిలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు మోడల్‌గా నిలుస్తున్నదని, తెలంగాణ అభివృద్ధి, రైతు సంక్షేమానికి సహకారం కావాలని లేఖలో ప్రస్తావించారు.

మాఫీ గోల్‌మాల్.. సీఎం సెల్ఫ్‌గోల్

> మొదటిపేజీ తరువాయి...

కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. ఈ పార్టీలు ఎన్నికల కోసం తప్పుడు హామీలు ఇస్తున్నాయి' అని చేసిన వ్యాఖ్యలకు రేవంత్‌రెడ్డి కౌంటర్ ఇవ్వబోయి అసలు నిజాలు వెల్లడించారు. రుణమాఫీ వివరాలతో ప్రధానికి రాసిన లేఖ ద్వారా ఇప్పుడు సెల్ఫ్‌గోల్‌లో పడ్డారు. 'మేము రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేయాల్సి ఉండగా, బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లు కేటాయించాం. ఇప్పటి వరకు కేవలం 27 రోజుల్లో మూడు విడతల్లో రూ.2 లక్షలలోపు రుణాలు కలిగిన 22,22,067 మంది రైతులకు రూ.17,869 కోట్ల రుణాలను మాఫీ చేశాం' అని లేఖలో ప్రస్తావించారు. పూర్తిగా రుణమాఫీ చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఇంకా 19,77,933 మంది రైతులకు రూ. 13,131 కోట్ల రుణాలు మాఫీ చేయాల్సి ఉన్నట్టు సీఎం రేవంత్‌రెడ్డే పరోక్షంగా వెల్లడించారు. లేఖలో రూ.2 లక్షలకు పైగా రుణం ఉన్న రైతుల అంశాన్నీ రేవంత్ ప్రస్తావించారు. ఆ రైతులకు రుణమాఫీ చేయలేదని ఆయనే ఒప్పుకొన్నారు.

దేవుళ్లపై ఒట్టేసి.. అరకొరే రుణమాఫీ

'డిసెంబర్ 9న రుణమాఫీ అని ఒకసారి, దేవుళ్లందరిపైనా ఒట్టుపెట్టి మరీ ఆగస్టు 15 అని ఒకసారి రేవంత్‌రెడ్డి హామీనిచ్చి తర్వాత నాలుక మడతేశారు. ఆగస్టు 15లోగా 2లక్షల వరకు పంట రుణాలు పూర్తిగా మాఫీ చేస్తే రాజీనామా చేస్తానని మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్ విసిరారు. దిగివచ్చిన సర్కార్ ఆగస్టు 15వరకు అరకొర రుణమాఫీ చేసింది. తర్వాత హరీశ్‌ను రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు వెంటబడ్డారు. కానీ, రుణమాఫీ సగం కూడా పూర్తి కాలేదని బీఆర్ఎస్ నేతలు లెక్కలతో సహా తేల్చిచెప్పడం, రాష్ట్రమంతటా రుణమాఫీ కాని రైతులు ఆందోళనలకు దిగడంతో ప్రభుత్వ పెద్దలు గమ్ముగుండిపోయారు.

ఆరు గ్యారెంటీలపై నిలదీయండి

- కాంగ్రెస్ మోసంపై దసరా సందర్భంగా కుటుంబసభ్యులు, దోస్తులతో చర్చ పెట్టండి
- మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపు

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఆరు గ్యారెంటీలతోపాటు, రైతు, యూత్, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ డిక్లరేషన్లపై కాంగ్రెస్ పార్టీని నిలదీయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. గ్యారెంటీలు అమలు చేయకపోగా, అవ్వాతాతలకు పింఛన్ పెంచలేదని, రుణమాఫీ పూర్తి చేయలేదని, రైతు బంధు వేయలేదని, రైతు భరోసా దిక్కు లేకుండా పోయిందని, బోనస్‌ను బోగస్ చేశారని ఆదివారం ఎక్స్‌వేదికగా దుయ్యబట్టారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలని చెప్పి 10 నెలలైనా అతీగతి లేదని, 4 వేల నిరుద్యోగభృతికి నీళ్లొదిలిందని విమర్శించారు. నిరుడు దసరా సందర్భంగా కాంగ్రెస్‌కు ఓటు వేయాలని గ్రామాల్లో ప్రచారం చేసిన యువత ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. దసరాకు ఊళ్లకు వస్తున్న కుటుంబ సభ్యులు, స్నేహితులతో అలయ్ -బలయ్ తీసుకుంటూ కాంగ్రెస్ చేసిన మోసాలపై చర్చించాలని కోరారు.

ఫీజు బకాయిలు 6,500 కోట్లు

- 10 నెలలైనా పైసా ఇవ్వని రేవంత్ సర్కారు
- విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వని కాలేజీలు
- అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్న స్టూడెంట్స్
- ఆకునూరి మురళి ఎటు వెళ్లారు?
- తెలంగాణ బిడ్డలకు విదేశీ విద్య దూరం
- బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్



తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 10 నెలల పాలనలో ప్రైవేట్ కాలేజీలకు నయాపైసా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ విమర్శించారు. తెలంగాణభవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రీన్‌చానల్ ద్వారా మొత్తం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి.. విద్యాశాఖపై ఒక్క సమీక్ష కూడా పెట్టలేదని దుయ్యబట్టారు. రూ.6,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా రాష్ట్రంలోని 12.50 లక్షల మంది విద్యార్థులను రేవంత్ సర్కారు ఇబ్బందులకు గురిచేస్తున్నదని ధ్వజమెత్తారు. కేసీఆర్ తీసుకొచ్చిన ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకాన్ని కాంగ్రెస్ సర్కారు అమలుచేయకపోవడంతో విదేశీ విద్యకు విద్యార్థులు దూరమవుతున్నారని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించని కారణంగా కళాశాలల యాజమాన్యాలు బోధనేతర సిబ్బందికి వేతనాలు చెల్లించడం లేదని, విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని తెలిపారు. దీంతో అప్పులు చేసి ఫీజులు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకెళ్తున్నారని చెప్పారు. ఈ నెల 14 వరకు గడువు ఉన్న స్టాఫ్ నర్సు ఉద్యోగాలకు దరఖాస్తు చేసేందుకు సిద్ధమైన నర్సింగ్ కాలేజీల విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇస్తలేరని తెలిపారు. విద్యావ్యవస్థలో సంస్కరణలు తీసుకొస్తానని చెప్పిన ఆకునూరి మురళి ఇష్టం లేకే రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం లేదా అని ప్రశ్నించారు. మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ప్రైవేటు కళాశాలలను పరిశీలిస్తున్నట్టుగానే, ప్రభుత్వ గురుకులాలను కూడా పరిశీలిస్తే నాసిరకమైన భోజనం, విద్యార్థుల కష్టాలు తెలుస్తాయని చెప్పారు. గతంలో బాసర ట్రిపుల్ ఐటీ గోడలు దూకి వెళ్లిన రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక ఒక్కసారి కూడా అక్కడికి ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు సీఎం క్షమాపణ చెప్పాలి

రాష్ట్రంలో ఇంజినీరింగ్ కాలేజీల విద్యార్థులు గంజాయి తాగుతున్నారంటూ అభాండాలు వేసిన సీఎం రేవంత్ వారికి క్షమాపణలు చెప్పాలని గెల్లు శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఆయన వద్ద ఏమైనా ఆధారాలు ఉన్నాయా? అని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అడుగుతున్నారనే విద్యార్థులను ఈ విధంగా బద్నాం చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు, నాయకులు నవీన్‌గౌడ్, విశాల్, కాల్వ నితీశ్ పాల్గొన్నారు.

పెద్దపల్లి జిల్లా గోదావరిఖని చౌరస్తాలో దీక్షను భగ్నం చేసి టెంట్‌ను తొలగించడంతో రోడ్డుపై నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి కొప్పుల, జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధు, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, నడిపెల్లి దివాకర్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

బీఆర్ఎస్ దీక్షపై పోలీస్ జులుం

> మొదటిపేజీ తరువాయి...

వైఖరిని తీవ్రంగా ఖండించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తోపాటు మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, నడిపెల్లి దివాకర్‌రావు, మాజీ జడ్పీ చైర్మన్ పుట్ట మధు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి పోలీసుల వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు. ప్రజాస్వామ్యయుతంగా శాంతియుత వాతావరణంలో దీక్ష నిర్వహిస్తుంటే పోలీసులు అడ్డుకోవడం సరికాదని, అతిగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకు దీక్ష జరగకుండా పోలీసులు విశ్వప్రయత్నాలు చేయగా, టీబీజీకేఎస్, బీఆర్ఎస్ శ్రేణులు రూటు మార్చారు. టీబీజీకేఎస్ కార్యాలయ ఆవరణలో టెంటు వేసి దీక్ష చేపట్టారు.

నికర లాభాలపై వాటా ఇవ్వాల్సిందే

సింగరేణి లాభాల్లో వాటా లెక్కల్లో యాజమాన్యం గోల్‌మాల్ చేస్తున్నదని, కార్మికుల శ్రమను దోచుకుంటున్నదని దీటు సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరంలో రూ.4,701 కోట్ల నికర లాభాలు సాధించిందని అన్నారు. 33 శాతం వాటా అంటే కార్మికులకు రూ.1,550 కోట్లు వస్తాయని తెలిపారు. అయితే సంస్థ విస్తరణ కోసం రూ.2 వేల కోట్లు మినహాయించుకున్న తర్వాత మిగిలిన డబ్బులపై 33 శాతం అంటే రూ.796 కోట్లను మాత్రమే వాటాగా పంచుతామని పేర్కొనడం సరికాదని పేర్కొన్నారు. వెంటనే నికర లాభాలపై వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సురేఖ వ్యాఖ్యలు నరహత్య కంటే ఘోరం

- 14న ఆమె వ్యాఖ్యలపై హైకోర్టులో పిల్ వేస్తా
- సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించాలి
- ప్రజాశాంతి అధ్యక్షుడు కేఏ పాల్

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): అక్కినేని కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు నరహత్య కంటే ఘోరమైనవిగా ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అభివర్ణించారు. తన మాటలను వెనక్కి తీసుకున్నానంటే సరిపోదని, నాగార్జున ఇంటికి వెళ్లి క్షమాపణ కోరాలని, అంతే కాకుండా మంత్రి పదవికి కూడా ఆమె రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. తాను పెట్టిన గడువు ముగిసినా సురేఖ రాజీనామా చేయనందున 14న హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) వేస్తానని తెలిపారు. సురేఖపై డీజీపీ కేసు నమోదుచేయాలని, హైకోర్టు సుమోటోగా కేసు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో పరిస్థితి యథా రాజా తథా మంత్రి అన్నట్టుగా ఉన్నదని, ముఖ్యమంత్రి మొదలు మంత్రులు అందరూ బూతు పురాణమే అందుకుంటున్నారని ఆక్షేపించారు. హైదరాబాద్ అమీర్‌పేటలోని తన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నరహత్య అంటే ఒకరి ప్రాణమే పోతుందని, కానీ, సురేఖ వ్యాఖ్యలు ఒక్క సినీరంగానికి సంబంధించినవి కావని, కోట్ల మంది భారత ప్రజల మనోభావాలకు సంబంధించినవని అన్నారు. మంత్రి వ్యాఖ్యలను మర్చిపోవాలని టీపీసీసీ చీఫ్ అంటున్నారని, అడ్డగోలుగా దూషించి మర్చిపోవాలంటే ఎలా? అని ప్రశ్నించారు. గతంలో అసెంబ్లీలో దానం నాగేందర్ బూతులు మాట్లాడారని, ఆయనను అనర్హుడిగా ప్రకటించాలని కోర్టులో కేసు వేశానని గుర్తుచేశారు. 1975లో ఇందిరాగాంధీని, ఇటీవల రాహుల్‌గాంధీని కూడా డిస్‌క్వాలిఫై చేశారని తెలిపారు. చట్టం ముందు అందరూ సమానులేనని, ఎవరూ అతీతులుకారని పేర్కొన్నారు. ఈ దేశంలో బాగుపడాలంటే పొలిటికల్ కరెక్షన్ ఉండకూడదని సూచించారు.

అభివాదం చేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

సర్కార్‌కు 60 రోజులే డెడ్‌లైన్!

- కులగణనపై జీవోల పేరిట కాలయాపన
- బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల
- బీసీల జీవితాలతో ఆడుకోవద్దని హెచ్చరిక

రవీంద్రభారతి, అక్టోబర్ 6: 'కులగణనపై జీవోల పేరిట కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఈ నెల 7 నుంచి 60 రోజుల పరకు డెడ్‌లైన్ విధిస్తున్నాం' అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ స్పష్టంచేశారు. బీసీల జీవితాలతో సీఎం రేవంత్‌రెడ్డి బీసీల సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరించారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో జాజుల మాట్లాడారు. కులగణన చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు పోతే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల ఆగ్రహానికి గురవుతుందని చెప్పారు. అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా కులగణనపై సీఎం, మంత్రులు మాట్లాడటం లేదని విమర్శించారు. ఇదే వైఖరి అవలంబిస్తే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పాలన చివరిది కాబోతుందని తెలిపారు. కాంగ్రెస్ నిర్లక్ష్యంపై 50 వేల మందితో మహారాష్ట్ర ఎన్నికల్లో సర్కారు మోసాలపై ప్రచారం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గా

07102024-MAI-06_Layout 1 10/7/2024 2:16 AM Page 1

చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com



కవి భర్తృహరి ప్రతి మానవుడికి జీవన గమనంలో ఉపయోగపడే 'నీతి', 'శృంగార', 'వైరాగ్య' శతకాలను రచించాడు. ఈ మూడు శతకాలు అమూల్య రత్నాల వంటి శ్లోకాలతో నాటినుంచి నేటివరకూ లోకాన్ని ప్రభావితం చేస్తూనే ఉన్నాయి.

ఒయ్యారి నడకే స్త్రీకి నగ

భర్తృహరి యోగిగా మారకముందు రచించిన శతకమ్ 'నీతి శతకమ్' కాగా ఆ తదుపరి రచించినది 'శృంగార శతకమ్'. కవి భర్తృహరి తన భార్య పింగళతో సంసార జీవితాన్ని గడిపే కాలంలో, సమాజంలోని శృంగార జీవన విధానాన్ని పరికిస్తూ ఈ 'శృంగార శతకమ్'ను వ్రాసి ఉంటాడని పండితాభిప్రాయం.

> **'శమ్భు స్వయమ్భు హరయో హరిణే- క్షణానాం/ యేనా క్రియన్త సతతం గృహకుంభదాసాః/ వాచామ గోచర చరిత్ర విచిత్రితాయ/ తస్మై నమో భగవతే మకరధ్వజాయ' -శివ, బ్రహ్మాది విష్ణు దేవుళ్లనూ సైతం వాళ్ల భార్యలకధీనులుగా చేసి ఇండ్లలో ఘటదాసులుగా మార్చి, ఇట్లా మాటలకందని చేతలనెన్నింటినో చేసేవాడైన మన్మథ దేవుడికి నమస్కారం అంటూ నమస్కరిస్తూ భర్తృహరి ఈ శతకాన్ని ప్రారంభించారు.**

ఇందులో 'స్త్రీ ప్రశంస' మొదలుకొని 'ఋతు వర్ణన పద్ధతి' వరకూ ఏడు శీర్షికలతో నూరు శ్లోకాలున్నాయి. భర్తృహరి మూడు శతకాలలోని శ్లోకభావాలననుసరించి ప్రఖ్యాత సంస్కృత కావ్య వ్యాఖ్యాత రామచంద్ర బుధేంద్రుడు శీర్షికలను నిర్ణయించాడని చెప్తారు.

మొదటి శీర్షిక: 'స్త్రీ ప్రశంస'లో 'స్మితేన భావేన చ లజ్జయా' సుందర దరహాసంతో, సిగ్గుతో, బెదురుతో, సొగసుగా ముఖం తిప్పుకునే విధానాలతో, క్రీగంటి చూపులతో స్త్రీలు తమ భర్తలను తమ చెంతనే బంధిస్తారంటూ, కనుబొమ్మల నేర్పుదనాల ముడిపాటులూ, ఓర చూపులూ, మునిముని నవ్వులూ, మెత్తని మాటల పలుకరింపులూ, సొగుతూ నిలుస్తూ మళ్లీ సొగే ఒయ్యారాల నడకలు స్త్రీలకు ఆభరణాలూ, ఆయుధాలూ అనీ పందొమ్మిది శ్లోకాల్లో స్త్రీని భర్తృహరి ప్రశంసించాడు. చక్కని కనుబొమ్మలు పద్మ సౌందర్యాన్ని అవహేళన చేయగలిగే ఆ కన్నులూ, మేలిమి పసిడిని ప్రక్కకు పెట్ట గలిగే మేనిరంగూ యువతులకు పుట్టుసొమ్ములంటాడు. అందమైన మగువకు మన్మథుడు సేవకుడేనని, ఆమె కనుబొమ్మల కదలికల సూచనలతో మన్మథుడు తన బాణాలను వేసేవాడుగా నడుచుకుంటున్నాడనీ అంటాడు. చీకట్లను పోగొట్టే దీపమూ, జ్వాలాశిఖాగ్నీ, తారలూ, సూర్యచంద్రులూ ఉన్నా... కొదమ లేడి కన్నుల వంటి కనులు కలిగిన ప్రియకాంత చెంతలే కుంటే ఈ లోకమే తన కంధకారమయమనీ చెప్తాడు.

రెండవ శీర్షిక: 'సంభోగ (సౌఖ్య) వర్ణనము'లో సంభోగ శృంగారాన్నీ, విప్రలంభ శృంగారాన్నీ పద మూడు శ్లోకాల్లో వర్ణించాడు. 'విశ్రమ్య విశ్రమ్య వనే ద్రుమాణాం.. నివారయన్తీ శశినోమయూఖాన్' -కాంతుడి విరహంలో కాగుతున్న కోమలి ఒకామె రాత్రి తోటలో చంద్ర కిరణాల తాపాన్ని తట్టుకోవడానికి తలపై కొంగును కప్పుకొని అక్కడ తచ్చాడుతూ చెట్ల నీడల్లో కూర్చుంటూ సేద దీరిలేస్తూ తిరిగి కూర్చుంటూ మళ్లీ లేచి తిరుగుతూ ప్రియుడి కోసం ఎదురుచూస్తుందని విప్రలంభ శృంగారాన్ని వర్ణించాడు. కుముదాక్షులూ, ఇందీవరాక్షులూ అయిన మాప్రేయసుల యవ్వన రూపాలను ముసలితనం ఆవరించక మునుపే సుఖ భోగాలలో తేలడానికి మాకు ఇళ్ళకు వెళ్ళడానికి అనుమతి ఇవ్వండి ఓ రాజా! అంటూ రాజును అర్థిస్తాడు.

మూడవ శీర్షిక: 'పక్షద్వయనిరూపణం'లో స్త్రీలను ప్రేమతో చూసుకునేవారికి ఇహలోక సౌఖ్యాలూ, స్త్రీలపై విరక్తితో వారిని త్యజించే వారికి పరలోక సౌఖ్యాలు కలుగుతాయనీ అనురక్తి, విరక్తి అనే రెండు పక్షాలుగా ఏడు శ్లోకాల్లో వర్ణించాడు. మానవా- నీవు విరాగివై అడవి జింకలకు పచ్చని దర్భలను ఆహారంగా అందిస్తూ అక్కడే అడవిలో ఉండిపోలేదా అనురాగివై నీ వధూమణికి తాంబూలాన్ని ప్రేమతో అందిస్తూ నీ గృహ స్వర్గంలోనే ఉండిపో! అని చెప్తాడు. ఇక్కడినుంచే భర్తృహరి వైరాగ్యం వైపు మళ్లుతున్నాడని చెప్పవచ్చు. ఓ జనులారా! ఘననితంబినులైన ప్రమదల కన్నా మనోజ్ఞమైన వారెవరూ లోకంలో లేరు, విరహాన్ని రగిలించి ఏడిపించడంలో వీళ్ల కన్నా ఇంకెవరూ లేరని అంటాడు.

నాలుగవ శీర్షిక: 'కామినీ గర్హణము'లో 'కాన్తేత్యుత్పలలోచనేతి విపులో శోణీభరే..' అన్ని తెలిసిన విద్వాంసుడూ యవ్వనాదులు అశాశ్వతం అని తెలిసి కూడా అందమైనది మగువ అని మెచ్చుకుంటూ మన్మథకేళుల్లో తేలియాడుతుంటాడు. ఆహా! మోహపు దుశ్చేష్ట ఎంతటి ఆశ్చర్యకరమని అంటాడు. అతివను, తలచుకుంటే ఆమె మన్మథ తాపాన్ని రగిలిస్తుందనీ, చూస్తేనే మదన సంబంధోన్మాదాన్ని పెంచుతుందనీ, తాకితేనే మోహపు తన్మయత్వాన్ని కలిగిస్తుందనీ.. ఇట్లా అస్థిరంగా, బలహీనంగా మార్చే ఆ అతివ ప్రేయసి ఎట్లా అవుతుందని ప్రశ్నిస్తాడు. అనురాగం ఉన్నప్పుడు ఆమె అమృతలత, అనురాగం లేనప్పుడు ఆమెనే విష మంజరి అని ఇట్లా స్త్రీని గర్హిస్తూ ఇరువై శ్లోకాలు రచించాడు భర్తృహరి.

ఐదవ శీర్షిక: 'సువిరక్త పద్ధతి'లో స్త్రీల పట్ల విముఖులైన వాళ్లలో సువిరక్తులూ, దుర్విరక్తులూ అని పురుషులలో రెండు రకాలని చెప్తాడు. తెల్లని విశాల నేత్రాలు కలవారైన, పరువాల గరువాల మిడిసిపాటుతో ఎద సంపద గలవారైన అతివల అందమైన రూపాలను చూసి ఏ పురుషుల మనసులు మదన వికారానికి లొంగిపోవో వారే ధన్యులు అంటూ సువిరక్త పద్ధతిని తొమ్మిది శ్లోకాల్లో వరిస్తాడు.

ఆరవ శీర్షిక: 'దుర్విరక్త పద్ధతి'లో 'తావదేవ కృతినామపి స్ఫురత్యేష నిర్మల వివేకదీపః' విద్వాంసులనెంతవరకూ ఆడవాళ్ల వయ్యారాల వాలుచూపుల అంచులు తాకవో అంతవరకూ ఆ విద్వాంసుల నిర్మల వివేకదీపం ఉజ్వలంగా ప్రకాశిస్తుందంటూ స్త్రీలపై నిందాపూర్వకంగా పది శ్లోకాలు రాశాడు.

> **ఇక ఏడవ శీర్షిక: 'ఋతు వర్ణన పద్ధతి'లో 'పరిమళభృతో వాతాః శాఖా నవాంకుర కోటయోః' పవనాలు పరిమళభరితాలయ్యాయి, చెట్లకొమ్మలు క్రొత్త చిగురులు వేశాయి, మగ కోకిలల కాకలీ స్వర గీతాలు ఆడ కోకిలలకు పియాన్ని కూరుస్తున్నాయి, వనితల వదనేందు బింబాలు మరుకేళుల వల్ల చెమట చుక్కలతో చెమరుస్తున్నాయి, వసంతం వస్తూండగానే ధరిత్రిపై ప్రతిదీ సుందర మధుర గుణ ప్రవర్ధమానమై ప్రవర్ధిల్లుతుదన్నదని వసంత ఋతువు గురించి ఆరు శ్లోకాల్లో వర్ణించాడు.**

'అచ్ఛాచ్ఛచన్దనరసార్ద్రతరా మృగాక్ష్యో' స్వచ్ఛ చందనరసాల మైపూతలతో స్త్రీలూ, జలయంత్ర సదనాలు, పుష్పాలు, పున్నమి వెన్నెలా, విరజాజి వాసనల మంద మారుతమూ మున్నగునవి గ్రీష్మ ఋతువులో హర్షాన్నీ, మన్మథుడి గర్వాన్నీ పెంచుతున్నాయని గ్రీష్మఋతువును భర్తృహరి మూడు శ్లోకాల్లో వర్ణించాడు. ఇక వర్షఋతువు గురించి కామాన్ని ఉద్దీప్తం చేసేదని చెప్తూ ఆరు శ్లోకాల్లో వర్ణించాడు. ఇంకా శరదృతువులో పురుషుడు నడిరాత్రి వరకు అటూ ఇటూ పొరలి చిన్న కునుకు తీసి లేచి ప్రియకాంతతో కూడి తర్వాత ఆరని దాహంతో ఉన్నవాడై తన ప్రియకాంత కౌగిలి నుంచి కొంత విడి వడి మట్టి పాత్ర నుంచి అందించే నీటిధారను -శరత్కాల చంద్రుడి వెన్నెలలో ఎవడైతే తాగడో వాడు అదృష్ట హీనుడంటూ ఒక్క శ్లోకంలో అద్భుతంగా వర్ణించాడు.

చివర శిశిర ఋతువును రెండు శ్లోకాలలో వర్ణిస్తూ శిశిర ఋతువే పవనుడై అతివేగంగా వీస్తూ స్త్రీల కేశాలను చిందరవందర చేస్తూ, వస్త్రాలను ఈడ్చేస్తూ, పెదవులు కొరుక్కునేలా చేస్తూ భర్తల వలెనే సంచరిస్తున్నాడని చెప్తాడు. ఇట్లా భర్తృహరి నాటి సమాజ శృంగార జీవనాన్ని చెప్తూ శృంగారంలోని అతిని వర్జిస్తూ 'శృంగార శతకాన్ని' రచించాడు.

మనిషికీ...

పొద్దున్నే,
వెలుగుల
పూలబుట్టను నెత్తినెత్తుకొని
అడవి,
నగరంలోకి వచ్చింది..
మధ్యాహ్నానికి,
రంగురంగులు సింగారించుకొనీ
అడవి, మొక్కేటి
గౌరమ్మైంది..
సాయంత్రానికి,
చప్పట్ల జాతరలో,
పాటల పూజల్లో, అడవి
ఊరేగింపుల బతుకమ్మైంది,
రాత్రి, వీడ్కోలుల చీకటినద్దుకొని
చల్లని చెరువు గుండెల్లోకి
అడవి
మెల్లెగా ఒదిగిపోయింది...
ఆవృతమై
అడవి, అడవిలోకి చేరిపోయింది..!

పొద్దున- వెలుగు
మధ్యాహ్నం- సింగారం
సాయంత్రం- గౌరవం
రాత్రి- వీడ్కోలు,
ఇది బతుకమ్మకే కాదు
మనిషి జీవితానికి కూడా!

డాక్టర్ కాసర్ల నరేష్ రావు
94414 06252

'రఘువర్మ' (టీయల్యన్)
92900 93933

> **ఇక హేమంత ఋతువును రెండు శ్లోకాలలో వర్ణిస్తూ పెరుగు, నెయ్యిలను కలిపి సుష్ఠుగా భుజించినవాడు, భార్యల బిగి కౌగిళ్ళలో ఉన్నవారు, తాంబూలం నమలి ఇళ్ల లోలోపలి గదుల్లో స్త్రీ పురుషులు సుఖంగా నిద్రిస్తున్నారంటాడు భర్తృహరి.**

గట్టి గింజల పంట

'అద్ధం అబద్ధం ఆడదు
మాయా దర్పణాలు సుబద్ధమాడవు
పేదరికం తగ్గింది
పేదలు పెరిగారు'

తెలుగులో అభ్యుదయ కవిత్వం మొదలుకావడంతోనే వచన కవిత్వం మొదలైంది. తెలుగు వచన కవిత్వం గత 90 ఏండ్లలో రూపపరంగా అనేక ప్రయోగాలకు లోనైంది. 18 పర్వాలు ప్రాచీన కావ్యమైతే, 18 పాదాలు ఆధునిక కవిత అనిపించుకున్నది. ఎన్ని గజాలు రాశామన్నది కాదు, ఎన్ని నిజాలు చెప్పామన్నది ప్రధానమని కూడా అనిపించుకున్నది. ఒకటి, రెండు పుటల్లో కవితలు వస్తున్న కాలంలోనే దీర్ఘకవితలు, వచన మహాకావ్యాలు వచ్చాయి. గత మూడు దశాబ్దాల్లో మినీ కవిత, హైకూలు, నానీలు, నానోలు, గాథలు, రెక్కలు వంటి అనేక ప్రయోగాలు జరిగాయి.



'నిజం' కలం పేరుగా గల కవి జి.శ్రీరామమూర్తి. ఈయన 'నివురు', 'నాలుగో పాదం' వంటి వచనకావ్యాలు రాసి, ఇప్పుడు 'రంగురంగుల సూర్యోదయాలు' అనే ముక్త కవచన కవితల సంపుటి ప్రచురించారు. ఇవి నానీలు, రెక్కలు, గాథలు, మినీ కవితలు వంటి ఏ ప్రక్రియకూ చెందినవి కావు. కవి కూడా వీటికి రూపపరమైన పేరేదీ పెట్టలేదు. అన్నీ స్వతంత్ర కవితలు. నాలుగు పాదాల కవిత. ప్రతి కవితా రెండు భాగాలుగా ఉంటుంది. మొదటిభాగం ప్రతిపాదనగా, రెండవ భాగం దానికి వ్యాఖ్యగా ఉంటుంది. మొదటిభాగంలో సామాజిక వాస్తవికత వస్తువుగా, రెండవ భాగంలో దాని మీద కవి దృక్పథంగా ఉంటాయి. 'రంగురంగుల సూర్యోదయాలు' అంటే విభిన్న వస్తువులు గల కవితల సమాహారం.

ఈ కవితలు మాటల ముక్కలు కావు. వర్తమాన, సామాజిక వాస్తవికతను తనదైన వ్యాఖ్యలతో కవి ఆవిష్కరించారు. వర్తమాన ఆర్థిక, రాజకీయ, సాంఘిక సాంస్కృతిక, తాత్విక రంగాల మీద కవి చేసిన సృజనాత్మక విమర్శలు ఈ సూర్యోదయాలు. ఈ కవితలలో మనకు ప్రధానంగా కనిపించేవి ప్రకృతిని మానవీకరించడం, మనిషిని ప్రకృతీకరించడం, మనిషికీ ప్రకృతికీ గల సంబంధాన్ని చెప్పడం, ప్రకృతి ముందు మనిషి ఎంత దిగువన ఉన్నాడో చెప్పడం వంటివి.

రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
94402 22117

'రెండు పూల మధ్య ఖాళీని
పరిమళం పూరిస్తుంది
ఇద్దరు మనుషుల మధ్య బంధాన్ని
మతం నరుకుతున్నది'

ప్రకృతి గత వస్తువులు తమ మధ్య ఏర్పడిన ఖాళీలను పూరించుకుంటుంటే, మనుషులు తమ మధ్య మతంతో దూరం తెచ్చుకుంటున్నారని కవి దెప్పి పొడిచారు. మతోన్మాదుల మాడు పగులగొట్టే చురక ఇది.

త్రిదండి చినజియ్యరు స్వామి ఇటీవల సమతామూర్తి పేరుతో రామానుజుని విగ్రహాన్ని భారీఎత్తున హైదరాబాద్‌లో ఆవిష్కరింపజేశారు. అలాంటి వారే ఒక సమయంలో కులాలు పోకూడదు, ఉండాలి. ఏ కులం పని ఆ కులం చేయాలి. ఏ తిండి తిన్న వాళ్లకు ఆ బుద్ధులు వస్తాయని చెప్పిన మాటలు చాలా వివాదమయ్యాయి. సాంఘిక వివక్షకు గురౌతున్న సామాజిక న్యాయవాదులు ఆయన అభిప్రాయాలను తీవ్రంగా ఖండించారు. బహుశా ఈనే పద్యంలో 'నిజం' కవి ఒక ముక్తకం రాశారు

'ఇక్కడ జరుగుతున్నది
ఏమిటో యికనైనా తెలుసుకోండి
కులం అణచివేతల
జియ్యరుల రాజ్యమండి'

కవిత్వం మీద కవిత్వం రాయని తెలుగు కవులు అరుదుగా ఉంటారు. పది కవితలు రాస్తే ఒకటైనా కవిత్వం మీద కవిత ఉంటుంది. నిజాం కవి కూడా ఈ తానులో పోగయ్యారు. కవిత్వం గురించి పాతిక దాకా కవితలు రాశారు. ఈయనకు తాను చేసే పనిమీద అపారమైన నమ్మకమున్నది.

'శబ్దానికి చితి
పేర్చడమే నా పని
అది కవిత్వమై
మండుతుంది'

'నిజం' కవి శ్రీరామమూర్తి 'రంగుల సూర్యోదయాలు' కావ్యం నిండా వర్తమాన సామాజిక వాస్తవికతలోని అనేక పార్శ్వాలు విమర్శనాత్మకంగా ప్రతిబింబిస్తున్నాయి. వేమన లాగే ఈయన కూడా తన వస్తువును అభివ్యక్తం చేయడానికి తన పరిసర ప్రకృతినే ఆశ్రయించారు. ఈ కావ్యంలోని కవితలు 'గట్టి గింజల పంట' వంటివి. ఇవి చూడటానికి సూత్రప్రాయాలు, చెప్పడానికి భాష్య ప్రాయాలు.

ఊపిరులు

నేను..
నా గదిలో ఉన్నప్పుడు
అల్మైరాల్లో ఇష్టపడి పెంచుకున్న
ఓ అడుగు మేర ఎత్తున్న
తెల్లని చెట్ల మధ్య సంచరిస్తుంటాను
వాటి కొమ్మల కింద
అక్షరాలతో సేద తీరుతాను

నేను..
బయటికి వెళ్ళినప్పుడు
రోడ్డుకి ఇరువేపులా ఏపుగా పెరిగిన
నేలలో పర్ఫెక్ట్ బైండింగ్‌తో ఉన్న
పచ్చని పుస్తకాలను చూస్తుంటాను
వాటి పుటల్ని గమనిస్తూ
ఆక్సిజన్ నింపుకుంటాను

నేను..
పలక పట్టిన్నాటి నుంచి
చెట్లూ పుస్తకాలూ
నా బతుక్కి
శ్వాసనందిస్తున్న
చదువుల తిత్తులు

నలిమెల భాస్కర్

ఆహ్వానం

2024 అక్టోబర్ 8వ తేదీన నాగర్‌కర్నూల్ జిల్లా తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో 'గ్రంథం జాషువా సాహిత్య సమాలోచన కార్యక్రమం జరుగనున్నది. ఈ కార్యక్రమంలో వక్తలుగా డాక్టర్ కోయి కోటేశ్వర్‌రావు, డాక్టర్ వెంకట్ పరిమళ్, వల్లభాపురం జనార్ధన్, వహీద్‌ఖాన్ పాల్గొనున్నారు. అందరూ ఆహ్వానితులే.

- వి.భానుచందర్, 94412 36242

మరి మా మాటేమిటి..?

ఇది మిత్రుడు పసునూరి రవీందర్ రాసిన 'మీది మీదే.. మాది మాదే..' వ్యాసానికి సమాధానం కాదు. తెలంగాణ ఉద్యమంలో పాలు పంచుకున్న ఆంధ్రోళ్లలో ఒకడినైన నా ప్రశ్న మాత్రమే. తెలంగాణ కోసం కానింత కవిత్వం, ఒకింత కన్నీరు కార్చాం కదా.. మరి మా గురించి ఏమిటన్నదే నా ప్రశ్న. 'మీది మీదే... మాది మాదే...' అని తెలంగాణ మిత్రులు తేల్చేశారు. ఎవరిది ఏదో... తమది ఏదో... ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాహితీవేత్తలు తేల్చలేదు. అసలు గంట ఎవరు కట్టాలో కూడా వాళ్లు నిర్ణయించుకున్నట్టుగా కనిపించడం లేదు. తొలి, మలితరం తెలంగాణ ఉద్యమ సమయంలో ఆ పోరాటానికి మద్దతు పలికిన మాలాంటి వారు.. అంటే ఆంధ్రోళ్లన్న మాట. అలాంటి మా మాటేమిటన్నదే నా ఈ అనుమానం. ఎవరికి వారు హద్దులు గీసుకుంటున్న వేళ.. ఎదుటి వారి హద్దులు కూడా నిర్ణయిస్తున్న సమయాన.. మూడో జాతి మనుషుల్లా మిగిలిపోయిన మా మాటేమిటన్నదే నా వేదన. తెలంగాణకు మద్దతుగా నిలిచాం కాబట్టి మేం ఆంధ్రోళ్లకు శత్రువులుగా మిగిలామనుకోవాలా!?.. లేక తెలంగాణ వచ్చేసింది కాబట్టి వాళ్లని ఇక ఆంధ్రోళ్లుగానే చూడాలని తెలంగాణ మిత్రులు నిర్ధారించుకున్నారనుకోవాలా?.. అన్నదే నా సంశయం.

ప్రత్యేక తెలంగాణ కల సాకారమైంది. ఈ కల సాకారమవడంలో తెలంగాణ కవులు, రచయితలు, మేధావుల పాత్ర చాలా ఉన్నది. ఇందుకు విరుద్ధంగా సమైక్యవాదాన్ని వినిపించిన కవులు, రచయితలు, మేధావులు కూడా ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి ఆరేడేండ్ల ముందు తెలుగు సాహిత్యం (మిత్రమా.. తెలుగు సాహిత్యమే.. మీరు ప్రస్తావించినట్టుగా తెలుగు భాష, తెలుగుదనం, సంస్కృతి, ఉమ్మడి వారసత్వం వంటి పేర్లు కాదు) కూడా రెండుగానే చీలిపోయింది. తెలంగాణను కాంక్షిస్తూ రాసేవారు తెలంగాణ వాదులుగా, విడిపోవడానికి వీల్లేదనే వారంతా సమైక్యవాదులుగా చీలిపోయిన దశ అది.

సరిగ్గా ఈ సమయంలోనే, తెలంగాణను కాంక్షించే 'ఆంధ్రోళ్లు' కొందరున్నారు. వీరు కూడా ప్రత్యేక తెలంగాణకు అనుకూలంగా కవిత్వం రాశారు, వ్యాసాలు రాశారు. అన్నట్టు సమైక్యవాదుల నుంచి తిట్లు, శాపనార్థాలు కూడా అనుభవించారు. మిలియన్ మార్చ్ సమయంలో ట్యాంక్‌బండ్ మీదున్న ఆంధ్ర సాహితీవేత్తల విగ్రహాలను కూల్చివేసిన సమయంలో మాకు ఎదురైన ప్రశ్నలు, అమ్ముడుపోయారనే మాటలు భరించలేక ఎంత ఇబ్బంది పడ్డామో మేం ఎప్పుడూ బహిర్గతం చేయలేదు. ఆ సమయంలో కూడా అలాంటి ప్రశ్నలకు నా నుంచి వచ్చిన సమాధానం ఉద్యమ సమయంలో విసిరిన రాళ్లన్నీ ఒకే వైపు పడవు. వాటిలో కొన్ని రాళ్లు ఉద్యమకారులకూ తగులుతాయి. అంతమాత్రాన ఉద్యమాన్ని తప్పుబట్టలేం. ఉద్యమ కాంక్షను వీడలేం అని సన్నిహిత సమైక్యవాదులకు చెప్పాను.

> **తెలంగాణ ఉద్యమ సమయంలో మేం చూపించింది సానుభూతి కాదు, సహానుభూతి. అవును, కచ్చితంగా సహానుభూతే. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి కానీ, రాయలసీమ నుంచి కానీ ఆనాడు వచ్చిన సాహిత్యం ఒక్కసారి పరిశీలిస్తే ఆ విషయం అర్థం చేసుకోగలం. ఇక, ఉభయ గోదావరి జిల్లాలతో పాటు మిగిలిన జిల్లాల నుంచి కూడా తెలంగాణ ఏర్పడాల్సిన ఆవశ్యకత గురించి సాహిత్యం వచ్చింది. అయితే, అది పరిమిత సంఖ్యలోనే కావచ్చు.**

నా మటుకు నేను తెలంగాణను కాంక్షిస్తూ అనేక వ్యాసాలు రాశాను. కవిత్వం కూడా రాశాను. చాలా చోట్ల ప్రత్యేక తెలంగాణ రావాల్సిన, ఇవ్వాల్సిన అంశం గురించే కాదు, ప్రత్యేక తెలంగాణ ఏర్పడాల్సిన ఆవశ్యకత గురించి కూడా మాట్లాడాను. అంతెందుకు, తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా హైదరాబాద్‌తో సహా తెలంగాణ జిల్లాల్లో బతుకుతున్నవారు (వీళ్లను సెటిలర్స్ అన్నారు. ఎందుకో నాకు ఆ మాట నచ్చదు) తెలంగాణ ఏలికల్లో ఇబ్బందులు పడుతున్నారంటూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి హోదాలో నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీలో విలేకరుల సమావేశంలో గుండెలు బాదుకుంటే.. అదంతా తప్పు... ఇక్కడున్న వారంతా చాలా బాగున్నారని, వారిని తెలంగాణ వాసులు చాలా బాగా చూసుకుంటున్నారంటూ నేను ఓ వ్యాసం రాశాను. ఆ వ్యాసం ప్రచురించింది కూడా నమస్తే తెలంగాణ దినప్రతికే. ఆ నా వ్యాసం తెలంగాణలో నన్ను ఎక్కువమంది అభిమానించేలా చేసింది. నన్ను తెలంగాణ సానుభూతిపరుడిగా కాకుండా తెలంగాణ వాడిగానే చూసింది.

నిజానికి, తెలంగాణ కోసం మలితరం ఉద్యమం ప్రారంభించడానికి ముందే ఈ ప్రత్యేక తెలంగాణను కాంక్షించే సమూహం ఉండేది. ఆ సమూహంలో ఆంధ్రోళ్లు కూడా కొందరున్నారు. అయితే, తెలంగాణ కల ఉద్యమరూపం తీసుకోలేదు కాబట్టి, ఆ కల కవిత్వంగానో, వ్యాసాలుగానో వచ్చిందే తప్ప ఓ పోరాట రూపానికి మద్దతుగా మాత్రం రాలేదు. వామపక్ష పార్టీల్లో ముఖ్యంగా, నాటి పీపుల్స్‌వార్,. నేటి మావోయిస్టు పార్టీ రాజకీయాల పట్ల కాసింత సానుభూతిగా ఉన్నవారంతా ప్రత్యేక తెలంగాణ వస్తే చూడాలనుందని కలగన్నవారే.



తొలితరం తెలంగాణ ఉద్యమకారులలో కమ్యూనిస్టుల్లో చాలామంది ప్రాంతీయవాదాన్ని వ్యతిరేకించినా పీపుల్స్‌వార్ వ్యవస్థాపకులైన కొండపల్లి సీతారామయ్య, కేజీ సత్యమూర్తి మాత్రం ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కావాల్సిందేనని ఆకాంక్షించారు. కొండపల్లి సీతారామయ్య అయితే అప్పట్లో కొన్ని వ్యాసాలు రాయడమే కాదు, కమ్యూనిస్టు పార్టీల్లో చర్చ కూడా లేవదీశాడు. కొండపల్లి సీతారామయ్య, కేజీ సత్యమూర్తి ఇద్దరూ ఉద్యోగం అయితే తెలంగాణలో చేశారేమో కానీ వాళ్లిద్దరు కూడా ఆంధ్రోళ్లే. ఇప్పుడు మిత్రుడు పసునూరి రవీందర్ 'మీది మీదే.. మాది మాదే' అంటున్నారు. ఈ సరికొత్త వాదంలో తెలంగాణ రావాలని కాంక్షించిన జన్మతహా ఆంధ్రోళ్లమైన మాలాంటి వాళ్లం ఎటువైపు ఉంటామన్నదే నా ఈ ప్రశ్న.

> **తెలంగాణను కాంక్షించింది ఒక్కసైద్ధాంతికంగానే కాదు మిత్రమా. అక్కడి సంస్కృతి, ఆ ప్రేమ, అనురాగం, అడక్కుండానే కడుపులో అన్నం తీసిపెట్టే అచ్చమైన మనుషులను చూసిన తర్వాతే. అంతే కాదు, సహజన్మ అన్నట్టు స్వరాష్ట్ర పాలకుల నుంచి తెలంగాణవాసులు ఎదుర్కొన్న ఇబ్బందులను ప్రత్యక్షంగా చూసి, పరోక్షంగా చదువుకున్న తర్వాతే తెలంగాణ రావాలనే మా ఆకాంక్ష మరింత పెంచుకున్నాం.**

మీకు నీళ్లు రావడం కోసం మీరెన్ని కన్నీళ్లు కార్చారో... ఇప్పుడు అటు ఇటు కాకుండా పోయిన ఈ మూడో తరగతి మనుషులుగా పిలవబడే మేం కూడా అంతే కన్నీరు కారుస్తున్నాం. మేం కార్చిన కన్నీళ్లకు బహుమతిగా మేం ఎటూ కాకుండా పోవడమే మాకు ఎదురైన విషాదం. ఓ భాషగా తెలుగు గురించి మాట్లాడాల్సి వస్తే కొందరికి కొత్తగా వచ్చిన ఇబ్బంది ఏమిటో నాకు అర్థం కావడం లేదు. దేశంలో అనేక రాష్ట్రాల్లో హిందీ మాట్లాడతారు. భాషకు సంబంధించి యాసలో మార్పులుంటాయి కానీ భాషలో కాదు గదా? తెలంగాణ ఏర్పడకముందు ఆంధ్రప్రదేశ్ అనే వారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అని విడివిడిగాను, రెంటినీ కలపాల్సి వస్తే తెలుగు రాష్ట్రాలని అంటున్నారు. దీని వల్ల వచ్చిన ఇబ్బంది ఏమిటన్నదే నాకు అర్థం కాని ప్రశ్న. ఇతర అంశాలు అంటే సాహిత్య అకాడమీలో సభ్యులకు సంబంధించి మీ ప్రతిపాదనకు నేను ఓటు వేస్తాను. పత్రికల్లో ప్రాధాన్యం ఇవ్వడం వంటివి ఆ పత్రిక పాలసీగా ఉంటుంది కాబట్టి ఓ జర్నలిస్టుగా నేను సమాధానం చెప్పలేను. భవిష్యత్తులో అస్తిత్వవాద ఉద్యమాలు వస్తే మాలాంటి వాళ్లు ఎటువైపు ప్రయాణించాలో తెలియని ఓ ప్రశ్న కూడా ఇప్పటినుంచే ప్రారంభం కావడం నన్ను ఇబ్బంది పెడుతున్న మరో విషాదం. చివరగా మీరు సరే.. వాళ్లు సరే.. మధ్యలో మా మాటేమిటన్నదే నా ప్రశ్న.

ముక్కామల చక్రధర్
99120 19929

మరో కౌలు రైతు ఆత్మహత్య

- దిగుబడులు రాక, అప్పులు తీర్చలేక
- భూపాలపల్లి జిల్లాలో రైతు బలవన్మరణం

రాజబాపు (ఫైల్)

మహదేవపూర్ (కాటారం), అక్టోబర్ 6: దిగుబడులు రాక, అప్పులు తీర్చలేక మరో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలో ఆదివారం జరిగింది. ఎస్సై అభినవ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొండ రాజబాపు(45) పలిమెల గ్రామంలో భూమి కౌలు తీసుకొని పత్తి పంట సాగు చేశాడు. రెండేండ్లల్లో అధిక వర్షాల కారణంగా పంట నష్టం జరిగింది. సరైన దిగుబడి రాక రూ.7 లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. దీంతో కాటారానికి వచ్చి మళ్లీ 4 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగుచేయగా, నష్టం రావడంతో రూ.3 లక్షల అప్పులయ్యాయి. అప్పులు తీర్చే మార్గం కానరాక తీవ్ర మనోవేదనతో రాజబాపు గురువారం రాత్రి గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మహదేవపూర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

కరెంట్ షాక్‌తో ఇద్దరు చిన్నారులు మృతి

- బతుకమ్మ పూలు కోస్తుండగా ఒకరు
- ఫ్యాన్ వైరును పక్కకు తొలగిస్తుండగా మరొకరు..

రఘునాథపాలెం/ గుండాల, అక్టోబర్ 6: వేర్వేరు చోట్ల విద్యుదాఘాతానికి గురై ఇద్దరు చిన్నారులు మృతిచెందిన ఘటనలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆదివారం చోటుచేసుకున్నాయి. ఖమ్మం రఘునాథపాలెం మండలం పాపటపల్లికి చెందిన మిట్టపల్లి చరణ్ తేజ్(15) పదో తరగతి చదువుతున్నాడు. బతుకమ్మ వేడుక కోసమని టేకు చెట్టు పైన ఉన్న పూలు కోసేందుకు డాబా పైకి ఎక్కాడు. పూలు కోస్తుండగా, పక్కనే ఉన్న విద్యుత్తు లైన్‌కు చేయి తగలడంతో షాక్‌కు గురై మృతిచెందాడు. అలాగే, భద్రాద్రి జిల్లా గుండాల మండలం వెన్నెలబైలుకు చెందిన ఇర్ప సువర్ణ (12) ఇంటి రేకులకు ఉన్న ఫ్యాన్ వైరును పక్కకు తొలగించబోయింది. ఆ వైరును ఎలుకలు కొరికివేయడంతో దీనిని గమనించకుండా పట్టుకోవడంతో షాక్ తగలడంతో కుప్పకూలింది. దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందింది.

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ మృతి

రమేశ్ సింగ్, రాకం లింగమూర్తి (ఫైల్)

హుజూరాబాద్ టౌన్/చిగురుమామిడి, అక్టోబర్ 6: విధినిర్వహణలో ఉన్న ఇద్దరు ఆర్టీసీ ఉద్యోగులు గుండెపోటుతో మృతిచెందారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం దుద్దెనపల్లికి చెందిన ఠాకూర్ రమేశ్‌సింగ్ (45) హుజూరాబాద్ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. 15 రోజుల క్రితమే పరకాల డిపో నుంచి డిప్యూటేషన్‌పై హుజూరాబాద్‌కు వచ్చారు. ఆదివారం హుజూరాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా గజ్వేల్ సమీపంలోకి రాగానే గుండెపోటుకు గురయ్యారు. దీంతో బస్సును పక్కకు ఆపి కండక్టర్, ప్రయాణికులకు చెప్పారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది వచ్చి రమేశ్ సింగ్‌ను గజ్వేల్ దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అలాగే.. చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన రాకం లింగమూర్తి (55) కరీంనగర్-2 డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా ఆదివారం బస్టాండ్‌కు వచ్చి బస్సు వద్దకు వెళ్తుండగా ఛాతీలో నొప్పి రావడంతో కుప్పకూలిపోయాడు. వెంటనే ఆర్టీసీ సిబ్బంది కరీంనగర్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్లు నిర్ధారించారు.

పంచాయతీలకు నిధుల కటకట!

రోజువారీ పనులకు కూడా డబ్బుల్లేవు

- పడకేసిన పారిశుద్ధ్యం.. జ్వరాల విజృంభణ
- దాదాపు 4 వేల కోట్లు విడుదలచేయని సర్కార్
- అప్పులు చేయాల్సిన దుస్థితిలో కార్యదర్శులు

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): గ్రామ పంచాయతీలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని నెలలుగా నిధులు విడుదల చేయకపోవడంతో పల్లెలను నిధుల కొరత వేధిస్తున్నది. ఆదాయ వనరులు అంతగా లేని పంచాయతీల్లో కనీసం కార్మికులకు వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి నెలకొన్నది. దీంతో పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేసి అత్యవసర ఖర్చులకు సర్దుబాటు చేయాల్సి వస్తున్నది. అభివృద్ధి పనుల మాట దేవుడెరుగు.. కనీసం వేతనాలు, కరెంటు బిల్లులు, ఈఎంఐ లకైనా నిధులు ఇవ్వండి మహాప్రభో అని వేడుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నిధులు లేక గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. చెత్త సేకరించే ట్రాక్టర్లకు కనీసం డీజిల్ కూడా పోసే పరిస్థితి లేకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతున్నది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రతి ఇంట్లో ఒకరిద్దరు దవాఖాన పాలవుతున్నారు. గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛదనం, పచ్చదనం, బతుకమ్మ, దసరా పండగ సంబరాలకు నిధుల లేమి సమస్యగా మారిందని పంచాయతీ కార్యదర్శులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

నాడు ఎట్లుండె.. నేడు ఏమైంది?

గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు అత్యంత ప్రాధాన్యమిచ్చింది. కేంద్రం నుంచి వచ్చే నిధులకు అంతే మొత్తంలో జమ చేసి నెలకు రూ.250 కోట్లకుపైగా గ్రామ పంచాయతీలకు విడుదల చేసేవారు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు సాఫీగా జరిగేవి. గ్రామాలు పచ్చదనం, పరిశుభ్రతతో చూడముచ్చటగా ఉండేవి. ఇప్పుడు పరిస్థితి తారుమారైంది. నిధుల విడుదల ఆగిపోవడంతో అన్ని పనులు బంద్ అయ్యాయి. గత పది నెలల్లో పంచాయతీలకు దాదాపు రూ.2,500 కోట్లు, ఉపాధి హామీ పథకం కింద దాదాపు మరో రూ.1,300 కోట్ల నిధులు విడుదల కావాల్సి ఉన్నదని మాజీ సర్పంచ్‌లు చెప్తున్నారు. తాము అనేకసార్లు ప్రభుత్వాన్ని, గవర్నర్‌ను, ప్రతిపక్షాలను కలిసినా ఫలితం లేదని మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులే చిన్నచిన్న పనులకు కూడా నిధులు లేకపోవడంతో వ్యక్తిగతంగా అప్పులు తెచ్చి పెడుతున్నారు. ప్రభుత్వం నిధుల విడుదలలో జాప్యం చేస్తుంటే వాటిని ఎలా తీర్చాలోనని మధనపడుతున్నారు.

గాడి తప్పిన పాలన

సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ఫిబ్రవరి 2న ప్రత్యేకాధికారులను నియమించింది. నిధుల లేమి, సిబ్బంది జీతాల చెల్లింపుల్లో జాప్యం కారణంగా పంచాయతీ పాలన గాడితప్పుతున్నది. గ్రామాల్లో పారిశుద్ధ్యం పనుల కోసం బ్లీచింగ్ పౌడర్, చెత్త సేకరణ, మురుగు కాలువల్లో పూడికతీత, విద్యుత్తు దీపాల ఏర్పాటు, తాగునీటి పైప్‌లైన్ల లీకేజీలు, ట్రాక్టర్లకు డీజిల్ కొరత తదితర సమస్యలు రాజ్యమేలుతున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. ప్రత్యేకాధికారులు సైతం చేసేదేమీ లేక పంచాయతీలను పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

9న కొత్త టీచర్లకు నియామకపత్రాలు

- సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అందజేత
- నేటి సాయంత్రంలోగా కలెక్టరేట్లకు ఎంపిక జాబితాలు
- పాల్గొననున్న 10 వేల మందికి పైగా అభ్యర్థులు
- జిల్లాల వారీగా ప్రత్యేక కౌంటర్లు
- టెలి కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 9న ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేయనున్నట్టు సీఎస్ శాంతికుమారి వెల్లడించారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లపై సీఎస్ ఆదివారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో దాదాపు 10 వేల మందికి పైగా అభ్యర్థులు పాల్గొంటారని చెప్పారు. ఇప్పటికే డీఎస్సీ సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిందని, సోమవారం సాయంత్రంలోగా తుది జాబితాలను జిల్లా కలెక్టర్లకు పంపుతామని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులంతా ఎల్బీ స్టేడియానికి చేరుకునేలా చూడాలని, బస్సులు సహా అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎల్బీస్టేడియంలో అభ్యర్థులకు నియామక పత్రాలిచ్చేందుకు జిల్లాల వారీగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, అడిషనల్ డీజీ మహేశ్ భగవత్, ఆర్ అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టింగ్ ఆర్డర్లకు ఆలస్యం?

డీఎస్సీ అభ్యర్థులకు ఇప్పటికిప్పుడు నియామక పత్రాలిచ్చినా పోస్టింగ్‌కు కొంత సమయం పట్టనున్నది. వెంటనే పోస్టింగ్ ఇస్తే జీవో 317 బాధితులకు తీరని అన్యాయం జరుగుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. డీఎస్సీ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియలో దివ్యాంగ కోటా అభ్యర్థులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నారు. మెడికల్ బోర్డును నియమించకుండా, సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించకుండా ఇష్టారీతిన చేస్తున్నారని అభ్యర్థులు మండిపడుతున్నారు. గురుకుల బోర్డు, టీజీపీఎస్సీ తరహాలో పకడ్బందీగా వెరిఫికేషన్ చేపట్టడంలేదని ఆరోపిస్తున్నారు. మెడికల్ బోర్డును నియమించి, పరీక్షలు నిర్వహించిన తర్వాతే దివ్యాంగుల కోటా ఉద్యోగాలను భర్తీచేయాలని తెలంగాణ సమీకృత వికలాంగుల సంఘం నేతలు ప్రభుత్వాన్ని కోరారు.

నేటి నుంచి ఎడ్‌సెట్ స్పెషల్ ఫేజ్ కౌన్సెలింగ్

- 11న సీట్ల కేటాయింపు
- 14 నుంచి 17 వరకు రిపోర్టింగ్‌కు అవకాశం

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): రెండేండ్ల బీఈడీ కోర్సులో భారీగా సీట్లు మిగలడంతో మరో విడుత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. ఎడ్‌సెట్ స్పెషల్ ఫేజ్ కౌన్సెలింగ్ నేటి(సోమవారం)నుంచి ప్రారంభంకానున్నది. సోమవారం రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశముండగా, సోమ, మంగళవారాల్లో వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చు. 8న వెబ్ ఆప్షన్లను ఎడిట్ చేసుకోవచ్చు. 11న సీట్లను కేటాయింపు ఉంటుందని, 14 నుంచి 17 వరకు కళాశాలల్లో రిపోర్టు చేయాలని అధికారులు పేర్కొన్నారు.

దక్షిణ బంగాళాఖాతంలో ఆవర్తనం

మరో మూడు రోజులు వర్షాలు

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం కారణంగా ఆదివారం నుంచి నాలుగు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షంతో పాటు గంటకు 30-40కి.మీ వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నట్టు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. జోగులాంబ-గద్వాల,రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడి, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఆయా జిల్లాలకు ఎల్లోఅలర్ట్ జారీ చేశారు. నేడు మేడ్చల్-మల్కాజిగిరి,భూపాలపల్లి, హైదరాబాద్, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, సిద్దిపేట, యాదాద్రి, రంగారెడ్డి,వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, జనగామ, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వరంగల్, హనుమకొండ, వనపర్తి జిల్లాల్లో వర్షాలు కురుస్తాయన్నారు. గడిచిన 24 గంటల్లో జనగామలో అత్యధికంగా 3.40 సెం.మీ, జోగులాంబ-గద్వాల జిల్లా రాజోలిలో 3.06 సెం.మీ, రాజన్న -సిరిసిల్ల జిల్లా వేములవాడలో 2.52 సెం.మీ, జనగామ జిల్లా బచ్చన్నపేటలో 2.45 సెం.మీ, కామారెడ్డి జిల్లా పిట్లంలో 2.27 సెం.మీ, రామారెడ్డిలో 2.06 సెం.మీ, లింగంపేటలో 1.96 సెం.మీ, పాల్వంచలో 1.87 సెం.మీ, సంగారెడ్డి జిల్లా కంగ్టిలో 2.11 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్టు తెలిపారు.

జేఎల్ సంఘం అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్(జీజేఎల్ఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ పీ మధుసూదన్‌రెడ్డి మరోసారి ఎన్నికయ్యారు. సంఘం మూడో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించగా, ఇప్పటికే రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయన్నే మరోసారి ఎన్నుకున్నారు. ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి సమావేశానికి హాజరై మాట్లాడారు. అనంతరం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా బలరాం జాదవ్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎస్ శ్రీనివాస్, జీ సత్యపాల్‌రెడ్డి, జీ వేణుగోపాల్, టీ శ్రీధర్, ఎన్ రమేశ్, వీ అశోక్, సంయుక్త కార్యదర్శిగా ఎం విజయశేఖర్, ఆర్థిక కార్యదర్శిగా ఏ శివప్రసాద్, మహిళా కార్యదర్శిగా ఎస్ పద్మావతి, రాష్ట్ర కార్యదర్శులుగా వీ ప్రమీల, ఏఏవీ ప్రసాద్, ఎం హరిప్రసాద్, ఫహీముద్దీన్, జీ మధు, కే శ్రీదేవిని ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు 7.5శాతం నిధులు కేటాయించడంపై సమావేశం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. రాష్ట్రంలో 10+2+3 విద్యా విధానాన్ని యాధావిధిగా కొనసాగించి, ఇంటర్ విద్య అస్తిత్వాన్ని గుర్తించాలని డిమాండ్ చేసింది. ఇంటర్ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం, మధ్యాహ్న భోజనాన్ని అందించాలని కోరింది.

గురుకుల పనివేళలు మార్చండి

- మెస్‌చార్జీలను పెంచాలి
- జేఏసీ నేతలు డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్6 (నమస్తే తెలంగాణ): గురుకుల పనివేళలను ప్రభుత్వం వెంటనే మార్చాలని గురుకుల సంఘాల జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. జేఏసీ నేతలు మామిడి నారాయణ, డాక్టర్ మధుసూదన్, నరసింహులు గౌడ్, గణేశ్, భిక్షంయాదవ్, వేదంతాచారి ఆదివారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 662 వరకు గురుకుల పాఠశాలలు అద్దె భవనాల్లోనే ఉన్నాయని, విద్యార్థులు మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వమే అంగీకరిస్తున్నదని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం మార్చిన పనివేళలు విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలను మరింత తీవ్రం చేస్తున్నదని వెల్లడించారు. గతంలో మాదిరిగా పనివేళలను ఉదయం 9 నుంచి 4:30 గంటల వరకు పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంటిగ్రేటెడ్ గురుకులాల ఏర్పాటును స్వాగతిస్తున్నామని, అయితే ప్రస్తుతం విద్యార్థులకు అందిస్తున్న మెస్‌చార్జీలను పెంచాలని కోరారు. అనేక సమస్యలను ప్రభుత్వానికి నివేదించామని, అయినప్పటికీ స్పందన లేదని వాపోయారు. ఇకనైనా సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు స్పందించి గురుకుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పాలసీనే లేదు.. కొనుగోళ్లు ఎలా?

మొదటిపేజీ తరువాయి...

ఒప్పందాలు చేసుకోలేదు. మరోవైపు తమ సమస్యలు పరిష్కరించే వరకు ధాన్యం దించుకునేది లేదంటూ మిల్లర్లు ఇప్పటికే అల్టిమేటం జారీ చేశారు. కొనుగోళ్లపై క్షేత్రస్థాయి అధికారులకు కూడా పూర్తిస్థాయిలో డైరెక్షన్ ఇవ్వలేదని తెలిసింది. పై స్థాయిలో ఒప్పందాలు, క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు చేయకుండా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తామంటూ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలపై విమర్శలొస్తున్నాయి.

పాలసీ రూపొందించడంలో జాప్యం

ఏటా ధాన్యం కొనుగోళ్లపై భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)తో రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఒప్పందం కుదుర్చుకుని పాలసీని రూపొందిస్తుంది. సాధారణంగా ఆగస్టు లేదా సెప్టెంబర్‌లో పాలసీని రూపొందిస్తారు. ఎంత ధాన్యం కొనుగోలు చేయాలి? ఎన్ని కేంద్రాలు ఏర్పాటు చేయాలి? మిల్లర్లకు, సీఎమ్మార్‌కు ఎలాంటి నిబంధనలు విధించాలి? తదితర అంశాలు ఈ పాలసీలో ఉంటాయి. కానీ, అక్టోబర్ మొదటి వారం పూర్తయి, ధాన్యం కొనుగోళ్ల ప్రారంభించే సమయం వచ్చినా, పాలసీని రూపొందించలేదు. మరోవైపు కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తిచేశామంటూ అధికారులు ప్రకటిస్తున్నారు. ఈ నేపథ్యంలో అసలు పాలసీ లేకుండా ధాన్యం కొనుగోళ్లు ఏ విధంగా చేస్తారనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ప్రభుత్వానికి, పౌరసరఫరాల సంస్థకు ధాన్యం కొనుగోళ్లపై ముందస్తు ప్రణాళిక లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మిల్లర్లతో ఒప్పందాల సంగతేంటి?

రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లు దించుకోవాల్సి ఉంటుంది.

ఇందుకోసం పౌరసరఫరాల సంస్థ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మిల్లర్లతో ఒప్పందాలు చేసుకోవాల్సి ఉంటుంది. కానీ, ఇప్పటివరకు మిల్లర్లతో ఒప్పందం చేసుకోలేదు. దీంతో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎవరు దించుకుంటారు? ఎక్కడ నిల్వ చేస్తారు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సన్న ధాన్యానికి సంబంధించి అవుట్‌టర్న్ రేషియోను తేల్చే వరకు తాము ధాన్యాన్ని దించుకోబోమని మిల్లర్లు తెగేసి చెప్తున్నారు. నిబంధనల ప్రకారం ధాన్యం నుంచి 67% బియ్యం రావడం కష్టమని, 60% వరకే వస్తాయని మిల్లర్లు చెప్తున్నారు. మిగిలిన నష్టానికి ఎవరు బాధ్యులు, ఏం చేయాలో తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఈ వివాదంపై స్పందించలేదు. దీంతో మిల్లర్లు కూడా బెట్టుదిగడం లేదు. 'మేము దిగొస్తామని అధికారులు అనుకుంటున్నారేమో. ఆ పరిస్థితి అసలే లేదు. మేము నష్టాలను భరిస్తూ ప్రభుత్వానికి మేలు చేయాలా? అలా చేస్తే మా బతుకులు రోడ్డుపాలు కావడం ఖాయం' అని ఒక మిల్లరు వ్యాఖ్యానించడం గమనార్హం. తాము నెలనుంచి సమస్యను అధికారుల దృష్టికి, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తున్నామని, కానీ, స్పందన లేదని చెప్పారు. ఒకవేళ ధాన్యం దించుకోవడంలో ఇబ్బందులు ఎదురైతే, తమను బాధ్యులను చేస్తే మాత్రం సహించేది లేదని హెచ్చరించారు. గతంలో జిల్లా అసోసియేషన్ ఆ జిల్లాలోని మిల్లర్లకు బాధ్యత వహిస్తూ లెటర్ ఇచ్చేది. కానీ ఈ సీజన్ నుంచి జిల్లా అసోసియేషన్ తరుపున మిల్లర్లకు లెటర్లు ఇవ్వొద్దని నిర్ణయించినట్టు తెలిసింది. మిల్లర్లు ఎవరికి వారే సొంతంగా సివిల్ సప్లైకి గ్యారంటీ ఇవ్వాల్సి ఉంటుంది.

కేంద్రాలెక్కడ.. కొనుగోళ్లేవి?

అక్టోబర్ మొదటి వారంలో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. దీనిపై గత నెల 23న ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలో జిల్లాల జాయింట్ కలెక్టర్లు, సివిల్ సప్లై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అక్టోబర్ మొదటి వారంలో నల్లగొండ, మెదక్ జిల్లాల్లో, రెండో వారంలో నిజామాబాద్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కానీ మొదటి వారం పూర్తయినా రాష్ట్రంలో కనీసం ఒక్క కొనుగోలు కేంద్రమైనా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. దసరా తర్వాత ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్తున్నట్టు తెలిసింది. మరోవైపు పలు జిల్లాల్లో వరి కోతలు మొదలయ్యాయి. దీంతోపాటు వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం కాకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

మధ్యాహ్న భోజనం వద్దు..

- టిఫిన్ బాక్స్‌లే ముద్దు
- 32శాతం విద్యార్థుల్లో విముఖత
- ఏటా తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య
- ఆందోళన వ్యక్తంచేసిన కేంద్రం
- నివేదికను సమర్పించాలని ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): సర్కారు స్కూళ్లల్లో 32శాతం విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తినడం లేదు. ఇంటినుంచి టిఫిన్‌బాక్స్‌లు తెచ్చుకుని కడుపు నింపుకుంటున్నారు. పట్టణ ప్రాంతాల వారే కాకుండా.. మారుమూల జిల్లాల్లోని విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని ముట్టడంలేదు. ఏటా వీరి సంఖ్య తగ్గుతుండటంతో కేంద్రం గతంలో 2.25 లక్షల మందికి కోతపెట్టింది. 2022-23తో పోల్చితే 2023-24లో ఏకంగా 3.71లక్షల విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తినడం మానేశారు. ఇందుకు గల కారణాలను అన్వేషించి, సమగ్ర నివేదికను రూపొందించి అందించాలని రాష్ట్ర విద్యాశాఖకు కేంద్రం సూచించింది. అడవుల జిల్లా అయిన ములుగు, అర్బన్ జిల్లా అయిన హైదరాబాద్‌లో ప్రాథమిక పాఠశాలల్లో 60శాతం విద్యార్థులు మాత్రమే మధ్యాహ్న భోజనాన్ని తింటుండగా, పెద్దపల్లి, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం, మేడ్చల్ జిల్లాల్లో ప్రాథమికోన్నత పాఠశాలల్లోని వారు 60శాతంలోపే స్వీకరిస్తుండటం ఆందోళనకరం. కాగా, రాష్ట్రంలో 27,008 స్కూళ్లుండగా, ఇప్పటి వరకు 3,985 స్కూళ్లకు (15శాతం)మాత్రమే ఎల్‌పీజీ కనెక్షన్లున్నాయి. మిగతా బడుల్లో కట్టెల పొయ్యిలపైనే వంట చేస్తున్నారు. అన్ని బడులకు ఎల్‌పీజీ కనెక్షన్లు అందజేయాలని కేంద్రం సూచించింది.

ఉపాధ్యాయ సంఘాల సూచనలు

- గురుకులాలు, హాస్టళ్లు, సర్కారు స్కూళ్లల్లో కామన్ మెనూను రూపొందించి అమలుచేయాలి.
- కేజీబీవీ, గురుకులాల తరహాలో వంట సరుకులను ప్రభుత్వమే టెండర్ల ద్వారా అందించాలి. అంగన్‌వాడీలకు అందించినట్టుగా ప్రభుత్వమే కోడిగుడ్లను సరఫరా చేయాలి.
- గురుకులాల తరహాలో సర్కారు బడుల్లోని విద్యార్థులకు సైతం అల్పాహారం, స్నాక్స్, టీలను అందించాలి.
- మధ్యాహ్న భోజన కార్మికులకు ఇప్పుడిస్తున్న పారితోషికం నామమాత్రమే. కనీస వేతన చట్టానికి అనుగుణంగా నెలకు రూ.9,048కు పెంచాలి.
- రాష్ట్రంలో 13వేల స్కూళ్లల్లో విద్యార్థుల సంఖ్య 50లోపే ఉంది. ఒకరిద్దరు విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలల్లో రూ.4.97-రూ.248 గరిష్టంగా చెల్లిస్తున్నారు. ఉన్నత పాఠశాలల్లో రోజుకు రూ.7.45-రూ. 372.5 చెల్లిస్తున్నారు. ఇంత తక్కువ మొత్తంతో భోజనాన్ని సమకూర్చడం కష్టం. కావున వంటచేసేందుకు అర్బన్, ఎంపికచేసిన గ్రామీణ ప్రాంతాల్లో సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని అనుసరించాలి.
- మధ్యాహ్న భోజన ఏజెన్సీలు వంట చేయలేని పరిస్థితుల్లో సమీపంలోని హాస్టళ్లు, గురుకులాల నుంచి భోజనాన్ని సమకూర్చడం ఉత్తమం.

మధ్యాహ్న భోజనం అమలు తీరు

స్కూళ్లు	ఎన్‌రోల్‌మెంట్	స్వీకరించింది	శాతం
ప్రైమరీ	11,96,559	8,19,783	69
అప్పర్ ప్రైమరీ	6,92,429	4,69,689	68
మొత్తం	18,88,988	12,89,472	68

జిల్లా స్థాయిలోనే సరుకులను సేకరించాలి

పులుపు ఎక్కువగా ఉండటంతో విద్యార్థులు తినేందుకు ఇష్టపడటంలేవు. స్కూల్లో ఒకే కూర పెడుతుండటంతో కొంత మంది ఇంటి నుంచి మరో కూరను తెచ్చుకుంటున్నారు. ఆరోగ్యం దృష్ట్యా సైతం మరికొంత మంది తినేందుకు ఇష్టపడటంలేవు. కిచెన్ షెడ్లు లేకపోవడంతో చెట్ల కింద వంట చేయడంతో ఆకులు, పురుగులు పడుతున్నాయి. తక్కువ విద్యార్థులున్న చోట సరుకులు కొనడం ఇబ్బందిగా ఉంటుంది. కావున జిల్లా స్థాయిలోనే సరుకులను టెండర్ల ద్వారా సేకరించాలి.

– రాజభాను చంద్రప్రకాశ్, హెచ్ఎం అసోసియేషన్ అధ్యక్షుడు

జలపాతంలో మునిగి బీటెక్ విద్యార్థి మృతి

వాజేడు, అక్టోబర్ 6 : ములుగు జిల్లా వాజేడు మండలం కొంగాల అటవీ ప్రాంతంలోని దూసపా

లక్షన్నర కోట్లు 'మూసీ'పాలు?!

దేశంలో ఇప్పటివరకూ చేపట్టిన ప్రధాన రివర్ ఫ్రంట్ బడా ప్రాజెక్టులన్నీ అతి పెద్ద వైఫల్యాలే

నమామీ గంగే నుంచి చంబల్ వరకూ అన్నీ అంతే.. శాస్త్రీయత, ప్రణాళిక కొరవడటంతో ప్రాజెక్టులు ఫ్లాప్

వెరసి వేల కోట్ల ప్రజాధనమంతా నీటిపాలు

మూసీ విషయంలోనూ సైంటిఫిక్ సర్వే, సీవరేజ్ ట్రీట్మెంట్ లేకుండా రేవంత్ సర్కారు ముందుకు

పేద, బడుగువర్గాల ఇండ్లను కూల్చేయడంపైనే ఆసక్తి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని మూసీని సుందరమైన రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుగా తీర్చిదిద్దుతామని, దీనికోసం రూ. లక్షన్నర కోట్ల నిధులను ఖర్చుచేయనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. ప్రపంచంలో ఇప్పటివరకూ ఏ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు కూడా ఇంత పెద్దమొత్తంలో నిధులను ఖర్చు చేయలేదు. అలాగే, దేశంలో ఇప్పటివరకూ చేపట్టిన ప్రధాన రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులన్నీ విఫల ప్రయత్నాలుగానే మిగిలిపోయాయి. ఫలితంగా రూ. వేల కోట్ల ప్రజాధనం నీటిపాలైనట్లయింది. శాస్త్రీయ అధ్యయనం, పర్యావరణ పరిస్థితులను ఏ మాత్రం అవగాహన చేసుకోకుండా, సీవరేజ్ ట్రీట్మెం ట్ కార్యాచరణను ముందస్తుగా పూర్తిచేయకుండా మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు సక్సెస్ కావడం అనేది కుదరదు. ఇలాంటి కీలక విషయాలను ఏమాత్రం పట్టించుకోకుండా బడుగుల ఇండ్లను కూల గొట్టడంతోనే మూసీ అభివృద్ధి జరుగుతుందన్నట్టు వ్యవహరిస్తున్న రేవంత్ ప్రభుత్వంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే రూ. లక్షన్నర కోట్ల ప్రజాధనం మూసీలో కలిసినట్టేనన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

1 నమామీ గంగే ప్రాజెక్టు

ప్రాజెక్టు పేరు: నమామీ గంగే
రాష్ట్రాలు: ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, బీహార్, బెంగాల్
లక్ష్యం: గంగానది శుద్ధి
ప్రారంభం: 2014
వ్యయం: రూ. 40 వేల కోట్లు
ప్రాజెక్టు ఫలితం: ఫెయిల్
ఫెయిల్యూర్ కారణాలు: మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్వహణలోపం, మూతబడ్డ పైప్‌లైన్ల ప్రాజెక్టులు

గంగా నది.. హిందువులు పరమ పవిత్రంగా భావించే జీవనది.. ఒక్కసారి ఆ నదిలో మునిగితే పాపాలన్నీ హరించుకుపోతాయని భక్తుల విశ్వాసం.. పాపాలు పోవటమేమోకానీ.. ఇప్పుడు ఆ నదిలో మునిగితే లేనిపోని రోగాలన్నీ అంటుకొనే దుస్థితి దాపురించింది. 'కాలుష్య కాసారంగా ఉన్న గంగా నదిని స్వచ్ఛంగా మారుస్తాం. ఈ నీటిని తాగునీటికి సైతం వినియోగించేలా తీర్చిదిద్దుతాం. దీని కోసం 'నమామి గంగే' ప్రాజెక్టును చేపడుతున్నాం' అంటూ పదేండ్ల కిందట ప్రధాని నరేంద్రమోదీ ఈ ప్రాజెక్టును అట్టహాసంగా ప్రకటించారు. ఇప్పటివరకూ ఈ ప్రాజెక్టుపై రూ. 40 వేల కోట్లు ఖర్చు పెట్టారు. అయినప్పటికీ నది నీరు శుద్ధికాలేదు. గంగా నదిలో 50 శాతం నీరు మురుగేనని ఎన్జీటీ వ్యాఖ్యానించటం నది దుస్థితికి అద్దం పడుతున్నది.ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మురికినీటి శుద్ధి ప్లాంట్లు సమర్థంగా పని చేయడం లేదనే విమర్శలున్నాయి. అందులో చాలామటుకు మూతపడ్డాయని తెలిసింది. యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు, మూతబడ్డ పైపులైన్ల ప్రాజెక్టులు, నదుల అనుసంధానం వంటివి కూడా గంగా ప్రక్షాళనకు ఆటంకాలుగా మారాయని నిపుణులు పేర్కొంటున్నారు.

2 గంగా యాక్షన్ ప్లాన్

ప్రాజెక్టు పేరు: గంగా యాక్షన్ ప్లాన్
రాష్ట్రాలు: ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, బీహార్, బెంగాల్
లక్ష్యం: గంగానది శుద్ధి
ప్రారంభం: 1986
వ్యయం: రూ. 6,788.78 కోట్లు
ప్రాజెక్టు ఫలితం: ఫెయిల్
ఫెయిల్యూర్ కారణాలు: నిధులు పక్కదారి, కాగితాల్లోనే ప్రాజెక్టుల నిర్మాణం

వ్యవసాయ, మానవ వ్యర్థాలతోపాటు పారిశ్రామిక వ్యర్థాలను కూడా నదిలోకి నేరుగా వదులుతుండటంతో గంగా నది తీవ్రంగా కలుషితం అవుతున్నది. గంగానది వేగంగా కలుషితమవుతున్నదని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు దశాబ్దాల కిందే గుర్తించి శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టింది. రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో 1986 జనవరి 14న గంగా యాక్షన్ ప్లాన్ (జీఏపీ) ప్రారంభించారు. జీఏపీ కింద 2016 జూన్ నాటికి ప్రభుత్వం గంగా పరిరక్షణకు రూ. 6,788.78 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటివరకూ గంగానది శుద్ధి కోసం 409 ప్రాజెక్టులు చేపట్టినట్టు కేంద్రమే ప్రకటించింది. అయితే, ఈ నిధులన్నీ, ప్రాజెక్టులన్నీ ఏమయ్యాయో తెలియదు కానీ.. గంగ మాత్రం కాలుష్య కాసారంగానే మిగిలిపోయింది. కాగా, 40 ఏండ్లుగా గంగానదిని శుద్ధిచేస్తున్నా ఇప్పటికీ అది మురుగు కాలువలాగే ఉన్నదని సాక్షాత్తూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఆందోళన వ్యక్తంచేసింది.

3 బిలాస్‌పూర్ రివర్ ఫ్రంట్

ప్రాజెక్టు పేరు: బిలాస్‌పూర్ రివర్ ఫ్రంట్
రాష్ట్రం: ఛత్తీస్‌గఢ్
లక్ష్యం: అర్పా నది శుద్ధి, తాగునీటి అవసరాలు
ప్రారంభం: 2001
వ్యయం: 1,000 కోట్లు
ప్రాజెక్టు ఫలితం: ఫెయిల్
ఫెయిల్యూర్ కారణాలు: నిధులు పక్కదారి

ఏదైనా సక్సెస్‌ఫుల్ ప్రాజెక్టును చూసి ఎవరైనా కొత్త ప్రాజెక్టును ప్రారంభిస్తారు. అయితే, గుజరాత్‌లో ఆరు దశాబ్దాల కిందట ప్రతిపాదనలతో తెరమీదకు వచ్చిన సబర్మతీ యాక్షన్ ప్లాన్‌ను చూసి ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌లో ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. నగరంలో ప్రవహిస్తున్న అర్పా నదిని శుద్ధి చేయడమే లక్ష్యంగా దీన్ని ప్రారంభించారు. తద్వారా నగర ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చవచ్చని లక్ష్యంగా పెట్టుకొన్నారు. అయితే, ప్రాజెక్టు ప్రారంభించిన కొద్దిరోజుల్లోనే ఈ పనులు అటకెక్కాయి. ప్రాజెక్టుకు కేటాయించిన రూ. 1000 నిధులు ఏమయ్యాయో కాగితాల్లో కూడా కనిపించట్లేదు.

సబర్మతీ యాక్షన్ ప్లాన్

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ప్రవహిస్తున్న సబర్మతీ నదిని శుద్ధి చేసే ఉద్దేశంతో 2005లో 'సబర్మతీ యాక్షన్ ప్లాన్' పేరిట ఈ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును తీసుకొచ్చారు. ప్రధాని మోదీ మానస పుత్రికగా ప్రారంభమైన ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటివరకూ రెండు దఫాల్లో రూ. 1,400 కోట్లు ఖర్చు చేశారు. అయితే, నదిలో నీటిని మాత్రం శుద్ధి చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. నిజానికి 1961లోనే సబర్మతీ నదిని శుద్ధి చేయాలన్న ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. అయితే, అహ్మదాబాద్ శివారుల్లోని పారిశ్రామిక వేత్తలు, స్థానిక రాజకీయ నాయకులు ఈ ప్రాజెక్టును ముందుకు సాగనియ్యలేదు. కొంతమేర పనులు మొదలైనా వాటితో ప్రయోజనం చేకూరలేదు. చివరకు ప్రధాని మోదీ ప్రత్యేకంగా దృష్టిసారించినప్పటికీ సీవరేజ్ ట్రీట్మెంట్ ట్యాంకుల నిర్వహణ లోపాలతో సబర్మతీ నది మురుగు కాలువగానే మిగిలిపోయింది. ఇక, సబర్మతీ రీ-డెవలప్‌మెంట్ ప్రాజెక్టు పేరిట తీసుకొచ్చిన ఈ పనులతో జాతిపిత మహాత్మాగాంధీ నివసించిన 'సబర్మతీ ఆశ్రమం' కూడా ధ్వంసమైనట్టు హక్కుల కార్యకర్తలు విమర్శిస్తున్నారు.

4



ప్రాజెక్టు పేరు: సబర్మతీ యాక్షన్ ప్లాన్
రాష్ట్రం: గుజరాత్
లక్ష్యం: సబర్మతీ నది శుద్ధి
ప్రారంభం: 1961-2005
వ్యయం: రూ. 1,400 కోట్లు
ప్రాజెక్టు ఫలితం: ఫెయిల్
ఫెయిల్యూర్ కారణాలు: సీవరేజ్ ట్రీట్మెంట్ ట్యాంకుల్లో నిర్వహణ లోపాలు

5 ద్రవ్యావతి రివర్ ప్రాజెక్టు

ప్రాజెక్టు పేరు: ద్రవ్యావతి యాక్షన్ ప్లాన్
రాష్ట్రం: రాజస్థాన్ ; లక్ష్యం: ద్రవ్యావతి నది శుద్ధి
ప్రారంభం: 2015 ; వ్యయం: రూ. 1,676 కోట్లు
ప్రాజెక్టు ఫలితం: ఫెయిల్
ఫెయిల్యూర్ కారణాలు: సరైన దిశానిర్దేశం లేకపోవడం, అక్రమాలు

రాజస్థాన్‌లో ప్రవహిస్తున్న ద్రవ్యావతి నది పునరుజ్జీవనం కోసం 2015లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రూ. 1,676 కోట్లతో 'ద్రవ్యావతి రివర్ ప్రాజెక్టు'ను ప్రారంభించింది. 47.7 కిలోమీటర్ల పొడువులో కలుషిత నీటిని శుద్ధి చేసి స్వచ్ఛమైన నీటిగా మార్చడం వంటి పనులను లక్ష్యంగా పెట్టుకొన్నది. రోజుకు 170 మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేయడానికి జైపూర్ డెవలప్‌మెంట్ అథారిటీ లక్ష్యంగా నిర్ణయించింది. ప్రాజెక్టులో భాగంగా నది ఒడ్డున మొక్కల పెంపకం, కొత్త నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించింది. 2018నాటికి పూర్తికావాల్సిన ఈ ప్రాజెక్టు సరైన దిశా నిర్దేశం లేకపోవడంతో మధ్యలోనే ఆగిపోయింది. రూ. 1,676 కోట్లు నీటిపాలయ్యాయి.

నర్మదా యాక్షన్ ప్లాన్

6

ప్రాజెక్టు పేరు: నర్మదా యాక్షన్ ప్లాన్
రాష్ట్రాలు: మధ్యప్రదేశ్, గుజరాత్
లక్ష్యం: నర్మదా నది శుద్ధి
ప్రారంభం: 1995
వ్యయం: రూ. 18,000 కోట్లు
ప్రాజెక్టు ఫలితం: ఫెయిల్
ఫెయిల్యూర్ కారణాలు: వ్యర్థాలను నదిలో కలువకుండా కట్టడి చర్యలు లేకపోవడం

మధ్యప్రదేశ్, గుజరాత్‌లో ప్రవహిస్తున్న నర్మదా నది పరిరక్షణకు, నీటి శుద్ధికి, నదిపై పెద్ద డ్యామ్‌ల నిర్మాణం కోసమని 'నర్మదా యాక్షన్ ప్లాన్'ను మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించింది. పారిశ్రామిక వ్యర్థాలు నదిలో కలువకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకొంటామంటూ రూ. 15,000 కోట్లు (డ్యామ్స్ నిర్మాణం ఖర్చు అదనం) ఖర్చుచేసింది. అయితే, వ్యర్థాలను నదిలో కలువకుండా ఎలాంటి చర్యలను చేపట్టలేదు. సుందరీకరణ పనులు అటకెక్కాయి. ప్రాజెక్టు పేరిట తమ భూములను ప్రభుత్వం అక్రమంగా లాక్కొన్నదని, అడవులను నాశనం చేస్తున్నదని ఆరోపిస్తూ ఆదివాసీలు, రైతులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'నర్మదా బచావో ఆందోళన్' నిర్వహించారు. ఇక, పర్యాటకంగా ప్రయోజనం చేకూరుతుందంటూ 182 మీటర్ల ఎత్తుతో గుజరాత్‌లోని కెవాడియా వద్ద నర్మద ఒడ్డున ప్రభుత్వం రూ. 3 వేల కోట్లతో 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ'ని ఏర్పాటు చేసింది. అయితే, విగ్రహం ఏర్పాటు చేసిన తొలినాళ్లలో ఆసక్తి కనబర్చిన పర్యాటకులు.. ఆ తర్వాత తగ్గిపోయారంటూ నివేదికలు వెలువడ్డాయి.

ములా-ముటా ఆర్ఎఫ్‌డీ ప్రాజెక్ట్

7

ప్రాజెక్టు పేరు: ములా-ముటా ఆర్ఎఫ్‌డీ ప్రాజెక్ట్
రాష్ట్రం: మహారాష్ట్ర
లక్ష్యం: ములా-ముటా నదుల శుద్ధి
ప్రారంభం: 2015
వ్యయం: రూ. 4,727 కోట్లు
ప్రాజెక్టు ఫలితం: ఫెయిల్
కారణాలు: నిధులు పక్కదారి

మహారాష్ట్రలోని పుణె నగరంగుండా ప్రవహిస్తున్న ములా-ముటా నదులను 44 కిలోమీటర్ల మేర శుద్ధిచేయడంతో భాగంగా ములా-ముటా పుణె రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ (ఆర్ఎఫ్‌డీ) ప్రాజెక్టును తీసుకొచ్చారు. నది నీటిని శుద్ధి చేయడంతో పాటు నదిఒడ్డున 50 హెక్టార్ల విస్తీర్ణంలో గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు, వాణిజ్య సముదాయాల నిర్మాణం, వంతెనలు నిర్మిస్తామని ప్రభుత్వం చెప్పుకొచ్చింది. నదీపరీవాహక ప్రాంతాల్లోని వారిని ఖాళీ చేయించి కొత్త నిర్మాణాలను చేపట్టిన ప్రభుత్వం.. నీటి శుద్ధిని మాత్రం గాలికొదిలేసింది. నిధులు పక్కదారి పట్టాయన్న విమర్శలు ఉన్నాయి.

8 విశ్వామిత్ర రివర్ ప్రాజెక్ట్

ప్రాజెక్టు పేరు: విశ్వామిత్ర రివర్ ప్రాజెక్ట్
రాష్ట్రం: గుజరాత్
లక్ష్యం: విశ్వామిత్రనది శుద్ధి
ప్రారంభం: 2010
వ్యయం: రూ. 1,200 కోట్లు
ప్రాజెక్టు ఫలితం: ఫెయిల్
ఫెయిల్యూర్ కారణాలు: ప్రాజెక్టు నిధులు పక్కదారి, పేదల భూముల ఆక్రమణలు, సీవరేజ్ ట్రీట్మెంట్ వ్యవస్థ నిర్వహణలేమి

గుజరాత్‌లోని వడోదరాకు వరదల ముప్పును తప్పించడానికి, నదీ జలాన్ని శుద్ధి చేయడానికి విశ్వామిత్ర రివర్ ప్రాజెక్టును 2010లో తీసుకొచ్చారు. వరదల మాట ఏమోగానీ, ఈ ప్రాజెక్టు పేరిట భారీఎత్తున భూ ఆక్రమణలు జరిగాయని, నదీ నీటిని శుద్ధిచేసే సీవరేజ్ ట్రీట్మెంట్ వ్యవస్థ నిర్వహణ సరిగ్గాలేదని స్థానికులు పెద్దయెత్తున ఆందోళనలు చేపట్టారు. నది ఒడ్డున పేదల ఇండ్లను కూల్చేసి రాజకీయ నాయకులు ఆ భూములను ఆక్రమించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ ప్రాజెక్టు ప్రారంభంలోనే ఫెయిల్ అయినట్టు పలు నివేదికలు వెల్లడించాయి. నిధులు కూడా పక్కదారిపట్టాయన్న ఆరోపణలు కూడా లేకపోలేదు.

చంబల్ రివర్ ఫ్రంట్

9

ప్రాజెక్టు పేరు: చంబల్ రివర్ ఫ్రంట్
రాష్ట్రం: రాజస్థాన్
లక్ష్యం: చంబల్ నది శుద్ధి, అభివృద్ధి
ప్రారంభం: 2020
వ్యయం: రూ. 1,445 కోట్లు
ప్రాజెక్టు ఫలితం: ఫెయిల్
ఫెయిల్యూర్ కారణాలు: ప్లాస్టిక్ వ్యర్థాలు నదిలో కలువకుండా తగిన చర్యలు లేకపోవడం

రాజస్థాన్‌లోని కోటాలో ప్రవహిస్తున్న చంబల్ నదీజలాల శుద్ధి, నదీ పరీవాహాన్ని అభివృద్ధి చేయడానికి ఈ ప్రాజెక్టును తీసుకొచ్చారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రాచరికం ఉట్టిపడుతూ కండ్లుచెదిరే విధంగా 26 ఘాట్లను తీర్చిదిద్దారు. అయితే, ఇది నాణెనికి ఒకవైపు మాత్రమే. ఈ ఘాట్ల నిర్మాణం కోసం పేదల నుంచి భూములను తీసుకొని తగిన పరిహారాన్ని ఇంకా చెల్లించలేదు. పర్యాటకంగా ఈ రివర్ ఫ్రంట్ అందరినీ ఆకర్షిస్తున్నప్పటికీ, ప్రాజెక్టు ప్రాథమిక లక్ష్యమైన నదీజలాల శుద్ధి మాత్రం జరుగలేదు. పర్యాటకుల తాకిడి పెరుగడంతో నదిలో ప్లాస్టిక్ వ్యర్థాలు కలువడం ఎక్కువైంది.

రివర్ ఫ్రంట్స్‌తో 'సీన్ రివర్స్'

జాబితాలో రావి, విస్తులా, పార్వా, నార్త్ రైన్, టోరెన్స్ .. శాస్త్రీయత, ప్రణాళిక కొరవడటం, చిత్తశుద్ధిలేమి కారణం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని మూసీని సుందరీకరిస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం సర్వత్రా చర్చనీయాంశం అవుతున్నది. వ్యర్థాలతో కంపుకొడుతున్న ఏ నదినైనా ప్రక్షాళన చేయాలంటే ముందుగా శాస్త్రీయపరమైన అధ్యయనం ఎంతైనా అవసరం. అంటే నదీ ప్రవాహం తీవ్రత, కాలుష్యం జరుగుతున్న తీరు, నదిఒడ్డున నిర్మాణాలు ఇలా ప్రతీ అంశంపై లోతైన అవగాహన ఉండాలి. అలాగే, రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును చేపట్టడానికంటే ముందే సీవరేజ్ ట్రీట్మెంట్ వ్యవస్థను ప్రారంభించాలి. ఇలాంటి కీలకాంశాలను పట్టించుకోకుండా ఆర్భాటంగా ప్రారంభించిన పలు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులు స్వదేశంలోనే కాదు విదేశాల్లోనూ విఫల ప్రయత్నాలుగానే మిగిలాయి. ఈ క్రమంలో ఎలాంటి పటిష్ట కార్యాచరణలేకుండా బడుగుల ఇండ్లను కూలగొట్టడంతోనే మూసీ అభివృద్ధి జరుగుతుందన్నట్టు రేవంత్ ప్రభుత్వం వ్యవహరిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కెమికల్ ఫ్యాక్టరీ యాజమాన్యాలతో చేరి

ఐరోపాలోని పోలండ్‌లో చారిత్రక నిర్మాణాలకు, సంస్కృతీ సాంప్రదాయాలకు క్రాకో నగరం పెట్టిందిపేరు. ప్రపంచవారసత్వ నగరంగా 1978లోనే ఈ నగరం యునెస్కో గుర్తింపు పొందింది. అయితే, నగరంగుండా ప్రవహించే విస్తులా నది కాలుష్యానికి చిరునామాగా మారడం, వాయుకాలుష్యంతో చారిత్రాత్మక కట్టడాలు ధ్వంస మవ్వడం ప్రారంభమైంది. టూరిస్టుల సంఖ్య కూడా తగ్గుముఖంపట్టింది. దీంతో విస్తులా రివర్ ఫ్రంట్ పేరిట రూ. 1,700 కోట్లతో నీటి శుద్ధి కార్యక్రమాలు, అభివృద్ధి పనులకు ప్రణాళికలు రచించారు. అయితే, స్థానిక యంత్రాం గం కెమికల్ ఫ్యాక్టరీ యాజమాన్యాలతో కుమ్మక్కై ఆ ప్రాజెక్టును అటకెక్కించాయి. సీవరేజ్ ట్రీట్మెంట్ నిర్వహణకు అవసరమైన ట్యాంకుల నిర్మాణానికి తగిన జాగా లేదని ప్రభుత్వాధికారులు చేతులు దులుపుకొన్నారు. అయితే, ప్రాజెక్టుకు కేటాయించి నిధులు ఏమయ్యాయో మాత్రం తెలియలేదు.

జీవితకాలం లేదు

ఏదైనా ఒక ప్రాజెక్టు ప్రారంభం కావాలంటే.. ఏడాది, ఐదేండ్లు, పదేండ్ల వరకూ సమయం పట్టొచ్చు. అయితే, 77 ఏండ్ల కిందట ప్రతిపాదించిన ఓ ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తిస్థాయిలో పట్టాలు ఎక్కలేదంటే నమ్మగలమా? పాకిస్థాన్ ఇందుకు వేదికగా నిలిచింది. భారత్ నుంచి విడిపోయిన 1947లో రావి రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టును అప్పటి పాక్ ప్రభుత్వం ప్రతిపాదించింది. అలా దాదాపు 73 ఏండ్లు వాయిదాపడుతున్న ఈ ప్రాజెక్టును 2020లో ఎట్టకేలకు మళ్లీ తెరమీదకు తీసుకొచ్చారు.

రావి రివర్ ఫ్రంట్‌కు రూ. 2.5 లక్షల కోట్ల మేర నిధులు అవసరంఅవుతాయని అంచనావేశారు. ప్రాజెక్టుకు సంబంధించి ఎలాంటి ప్రణాళికలను సిద్ధం చేయకుండానే నది ఒడ్డున నివాసం ఉంటున్న 1.5 కోట్ల మందిని వేరే ప్రాంతాలకు తరలించారు. ఇండ్లు, ఇతరత్రా నిర్మాణాలను కూల్చేశారు. దీంతో ఈ వివాదం కోర్టుకు చేరింది. ప్రాజెక్టు పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. ముందస్తు ప్రణాళిక, చిత్తశుద్ధిలేమితోనే ఫిన్లాండ్‌లోని పార్వా రివర్‌ఫ్రంట్, జర్మనీలోని నార్త్ రైన్ రివర్‌ఫ్రంట్, ఆస్ట్రేలియాలోని టోరెన్స్ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులు విఫలప్రయత్నాలుగానే మిగిలిపోయాయి.

భవిష్యత్తులో ఎలాగూ జరుగుతుంది



'నా అభిప్రాయాలు నా పిల్లలపై రుద్దను. అలా చేయడం కూడా సబబు కాదు. ఇప్పుడున్న రోజుల్లో ఎవరి ఆలోచనలు వారికుంటున్నాయి. వాళ్ల కెరీర్ గురించి వాళ్లు ఆలోచించుకునే వాతావరణాన్ని మనం కల్పించాలి. అంతే తప్ప.. ఇది చెయ్.. అది చెయ్.. అంటూ వాళ్ల ఆలోచనలకు అడ్డు చెప్పకూడదు' అంటున్నారు ఎన్టీఆర్. ఆయన కథానాయకుడిగా నటించిన 'దేవర' చిత్రం విజయవంతంగా ప్రదర్శింపబడుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ప్రమోషన్లో భాగంగా ఇటీవల ఎన్టీఆర్ అమెరికా లాస్ ఎంజెలిస్ వెళ్లారు. అక్కడి మీడియా సమావేశంలో తన కుమారుల గురించి, వారి భవిష్యత్ గురించి తారక్ మాట్లాడారు. 'అభయ్, భార్గవ్ ఇద్దరి మధ్య ఎంతో వ్యత్యాసం ఉంది. వయసు పరంగా వాళ్లు చాలా చిన్నపిల్లలు. ప్రస్తుతం చదువుకుంటున్నారు. భవిష్యత్లో కూడా వాళ్లను 'సినిమాల్లోకి రండి.. యాక్టింగ్ నేర్చుకోండి..' అని బలవంతపెట్టను. నాకు ప్రేరణ నా తల్లిదండ్రులే. వాళ్లెప్పుడు నన్ను ఆ విధంగా ట్రీట్ చేయలేదు. 'వాడేదో సాధించాలనుకుంటున్నాడు.. చేయనీ..' అని నా మానన నన్ను వదిలేశారు. నేనూ నా పిల్లల విషయంలో అలాగే ఉంటా. అయితే.. నా వృత్తి గురించి నా పిల్లలకు తెలుసు. నన్ను వాళ్లు నటుడిగా చూస్తున్నారు. భవిష్యత్తులో వాళ్ల నాన్నలాగే వాళ్లూ హీరోలం కావాలని కోరుకుంటారు. అది ఎలాగూ జరుగుతుంది.' అంటూ చెప్పుకొచ్చారు తారక్.

అనుభూతినిచ్చిన సినిమా

''విశ్వం' సినిమాలో అన్నీ వైవిధ్యంగా ఉంటాయి. ముఖ్యంగా నా పాత్ర కొత్తగా ఉంటుంది. ఛాలెంజ్గా తీసుకొని ఈ పాత్ర చేశాను. శ్రీనువైట్ల డైరెక్షన్ డిఫరెంట్గా ఉంటుంది. నా పాత్రని చాలా స్టైలిష్గా డిజైన్ చేశారాయన. ఆయన డెడికేషన్కి ఎవరైనా హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే. ఈ సినిమాలో చాలా పాత్రలుంటాయి. అందరినీ మోటివేట్ చేయడమంటే సామాన్యమైన విషయం కాదు. శ్రీనువైట్ల వల్లే ఈ సినిమాలో బాగా నటించగలిగాను. ముఖ్యంగా ట్రైన్ ఎపిసోడ్ సినిమాలో హైలైట్గా ఉంటుంది.' అని కథానాయిక కావ్య థాపర్ అన్నారు. గోపీచంద్ సరసన ఆమె నటించిన చిత్రం 'విశ్వం'. శ్రీనువైట్ల దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, చిత్రాలయా స్టూడియోస్ కలిసి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా కావ్య ఆదివారం విలేకరులతో ముచ్చటించింది. 'ముందుగా ఈ సినిమాను చిత్రాలయా బ్యానర్ స్టార్ట్ చేసింది. ఆ తర్వాత ప్రతిష్టాత్మక పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ భాగం అయ్యింది. దాంతో సినిమా రేంజ్ పెరిగింది. నిర్మాణ విలువలు చాలా హైప్లో ఉంటాయి. రేపు థియేటర్లో మీరే చూస్తారు.' అని తెలిపింది కావ్య థాపర్. 'గోపీచంద్ చాలా కామ్ గోయింగ్. సెట్లో తన పనేదో తాను చేసుకుంటారు. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. సాంకేతికంగా కూడా ఈ సినిమా ఉన్నతంగా ఉంటుంది. హిమాచల్, మనాలి వంటి ప్రాంతాల్లో వర్క్ చేయడం చాలా కష్టం. యూనిట్ సహకారంతో అక్కడి షూటింగ్ పూర్తి చేయగలిగాం. నటిగా నాకు గొప్ప అనుభూతి కలిగించిన సినిమా 'విశ్వం' ' అని కావ్యాథాపర్ చెప్పారు.

షూటింగ్‌కి ముందే హీటెక్కిస్తున్న స్పిరిట్

ప్రభాస్ 'స్పిరిట్' సినిమా షూటింగ్ ఇప్పటివరకూ మొదలుకాలేదు. కానీ సినిమాపై వస్తున్న వార్తలు మాత్రం అభిమానులకే కాక, సగటు ప్రేక్షకులకు కూడా హీట్ పుట్టిస్తున్నాయి. ఇప్పటికే 'స్పిరిట్'లో సైఫ్అలీఖాన్, కరీనాకపూర్ నటిస్తున్నారనీ, ఈ భార్యభర్తలిద్దరూ ఇందులో నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలు పోషిస్తున్నారని వార్తలు వచ్చాయి. వాటిని నిజం చేస్తూ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఇటీవలే ఈ జంటను కలిశారు. వారికి కథ, పాత్రలు కూడా వివరించినట్టు బీటౌన్ సమాచారం. ఇదిలా వుంటే.. ఇప్పుడు ఏకంగా మలయాళ సూపర్స్టార్ మమ్ముట్టి ఈ సినిమాలో భాగం కానున్నారన్న వార్త అభిమానులకు పూనకాలు తెప్పిస్తున్నది. అయితే.. ఇప్పటివరకూ వీటిపై అధికారిక ప్రకటనలు మాత్రం రాలేదు. వచ్చే ఏడాది ఈ సినిమా షూటింగ్ మొదలు కానుంది. సందీప్రెడ్డి వంగా మార్క్ యాక్షన్ సీన్స్, వైల్డ్ ఎలిమెంట్స్తో హాలీవుడ్ స్థాయిలో 'స్పిరిట్' తెరకెక్కనున్నదనీ, దాదాపు 400కోట్ల నిర్మాణ వ్యయంతో సందీప్ ఈ సినిమాను నిర్మించనున్నారని సమాచారం. టి.సిరీస్, భద్రకాళి పిక్చర్స్ కలిసి నిర్మిస్తున్న ఈచిత్రానికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీత దర్శకుడు.

అప్పుడో ఇప్పుడో ఎప్పుడో..

నిఖిల్ హీరోగా, సుధీర్వర్మ దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్కి 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' అనే టైటిల్ని ఖరారు చేశారు. ఈ విషయాన్ని ఆదివారం ఓ ప్రకటన ద్వారా మేకర్స్ తెలియజేశారు. ఈ ఏడాది దీపావళి కానుకగా ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ఫస్ట్లుక్ని విడుదల చేశారు. నిఖిల్ స్టైలిష్గా, రుక్మిణీ వసంత్ గ్లామరస్గా.. ఇద్దరూ కలిసి నడుస్తూ ఈ లుక్లో కనిపిస్తున్నారు. సుధీర్వర్మ, నిఖిల్ కాంబినేషన్లో గతంలో వచ్చిన స్వామిరారా, కేశవ చిత్రాలను మించేలా ఈ సినిమా ఉంటుందని, కచ్చితంగా వీరిద్దరికీ ఇది హ్యాట్రిక్ హిట్ అవుతుందని నిర్మాత నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. దివ్యాంశ కౌశిక్, హర్ష చెముడు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రిచర్డ్ ప్రసాద్, సంగీతం: కార్తీక్, నేపథ్య సంగీతం: సన్నీ.ఎం.ఆర్, సహనిర్మాతలు: యోగేష్ సుధాకర్, సునీల్ షా, రాజా సుబ్రహ్మణ్యం, సమర్పణ: బాపినీడు, నిర్మాణం: ఎస్.వి.సి.సి.ప్రొడక్షన్స్.

సెలబ్రిటీ ట్విస్ట్ అందరికీ నచ్చింది

'మా మనవడు పరుచూరి సుదర్శన్ కథానాయకుడిగా వచ్చిన 'మిస్టర్ సెలబ్రిటీ' సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం. సెలబ్రిటీలపై పురస్కారం, వాటి పర్యవసానాలపై కథను అల్లుకొని దర్శకుడు రవికిశోర్ సినిమాను అద్భుతంగా తీశాడు. ట్విస్ట్ కూడా అందరికీ నచ్చింది. కొత్త కాన్సెప్ట్తో వచ్చిన ఈ సినిమా కచ్చితంగా అందరికీ నచ్చుతుంది. చూడనివారుంటే చూడండి.' అని ప్రఖ్యాత రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన మనవడు పరుచూరి సుదర్శన్ హీరోగా పరిచయం అయిన చిత్రం 'మిస్టర్ సెలబ్రిటీ'. రవికిశోర్ దర్శకుడు. చిన్న రెడ్డయ్య, ఎన్.పాండురంగారావు నిర్మాతలు. ఇటీవలే సినిమా విడుదలైంది. ఈ సినిమా సక్సెస్మీట్ని హైదరాబాద్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన ప్రముఖ దర్శకుడు బి.గోపాల్ చిత్రయూనిట్కి అభినందనలు అందించారు. కథను నమ్మి చేసిన సినిమా ఇదని, నటుడిగా సుదర్శన్కి మంచి గుర్తింపు రావడం ఆనందంగా ఉందని, వరలక్ష్మీ శరత్కుమార్ పాత్ర సినిమాకు ప్రధాన బలమని దర్శకుడు చెప్పారు. ఇంకా నిర్మాత పాండురంగారావు కూడా మాట్లాడారు.

దేవకీనందనుడి ఆగమనం

సూపర్స్టార్ కృష్ణ మనవడు, మహేశ్బాబు మేనల్లుడు అశోక్ గల్లా హీరోగా రూపొందుతోన్న యాక్షన్ ఎంటర్టైనర్ 'దేవకీ నందన వాసుదేవ'. అర్జున్ జంధ్యాల దర్శకుడు. సోమినేని బాలకృష్ణ నిర్మాత. నవంబర్ 14న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు ఆదివారం హైదరాబాద్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా రిలీజ్ డేట్ పోస్టర్ని, టీజర్ని మేకర్స్ విడుదల చేశారు. ఈ కథలో సోల్ చాలా డెప్త్గా ఉంటుందని, దర్శకుడు అర్జున్ జంధ్యాల సినిమాను అద్భుతంగా తీశారని, కథానాయిక మానస వారణాసి ఛాలెంజింగ్ రోల్ చేసిందని, కచ్చితంగా హిట్ సినిమా అవుతుందని హీరో అశోక్ గల్లా నమ్మకం వెలిబుచ్చారు. 'మేం కొత్తవాళ్లమే అయినా మంచి అవుట్పుట్తో వస్తున్నాం. మా సినిమా రిలీజ్ టైమ్లోనే మట్కా, కంగువా సినిమాలు కూడా రిలీజ్ అవుతున్నాయి. అయినా సరే.. మా సినిమా మాదే. కంటెంట్ని నమ్మి చేసిన ఈ సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందనే నమ్మకంతో ఉన్నాం. ప్రశాంత్ వర్మ కథ, సాయిమాధవ్ బుర్రా పదునైన సంభాషణలు, భీమ్స్ సిసిరోలియో ఆకట్టుకునే బాణీలు ఈ సినిమాకు హైలైట్ కానున్నాయి. మా హీరో అశోక్ గల్లాని హీరోగా మరోస్థాయిలో నిలబెట్టే సినిమా ఇది' అని నిర్మాత బాలకృష్ణ చెప్పారు. కృష్ణుడి నేపథ్యంలో కథ నడుస్తుందని, కథలో చక్కని డివోషనల్ టచ్ ఉంటుందని, ఆరంభం నుంచి ముగింపు వరకూ ప్రతి పాత్రా హైలైట్ అయ్యే సినిమా ఇదని దర్శకుడు తెలిపారు. ఇంకా కథానాయిక మానస వారణాసి కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: ప్రసాద్ మూరెళ్ల, రసూల్ ఎల్లోర్, సమర్పణ: నల్లపనేని యామిని, నిర్మాణం: లలితాంబిక ప్రొడక్షన్స్.

అల్ట్రా మోడ్రన్ యాక్షన్ థ్రిల్లర్

జ్యోతి పూర్వాజ్ ప్రధాన పాత్రలో 'కిల్లర్' పేరుతో ఓ యాక్షన్ థ్రిల్లర్ రూపొందనుంది. పూర్వాజ్ స్వీయ దర్శకత్వంలో ప్రజయ్ కామత్తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఆదివారం ఈ చిత్రం టైటిల్తో పాటు మోషన్ పోస్టర్ని కూడా మేకర్స్ విడుదల చేశారు. పవర్ఫుల్ లేడీ, గన్, చెస్ కాయిన్స్తో ఆల్ట్రా మోడ్రన్గా ఈ పోస్టర్ని మేకర్స్ డిజైన్ చేశారు. దర్శక, నిర్మాత పూర్వాజ్ ఈ చిత్రంలో ఓ కీలక పాత్రలో కూడా కనిపించనున్నారు. ఈ యాక్షన్ థ్రిల్లర్కు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో తెలియజేస్తామని మేకర్స్ చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: జగదీశ్ బొమ్మిశెట్టి, సంగీతం: అషీర్ ల్యూక్, సుమన్ జీవరత్నం, నిర్మాణం: థింక్ సినిమా, మెర్జ్ ఎక్స్ఆర్.

భారతీయ జెండా ఓ ఖడ్గం

శ్రీకాంత్, రవితేజ, ప్రకాశ్రాజ్ ప్రధానపాత్రధారులుగా కృష్ణవంశీ దర్శకత్వంలో వచ్చిన 'ఖడ్గం' చిత్రం ఎంతటి విజయాన్ని సాధించిందో ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. 22 ఏండ్ల క్రితం విడుదలైన ఈ చిత్రానికి నేటికీ అభిమానులున్నారు. త్వరలో ఈ సినిమా మళ్లీ రీరిలీజ్కి ముస్తాబవుతున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. భారతీయ జెండా ఒక 'ఖడ్గం' అనే ఉద్దేశంతో ఈ సినిమాకు ఆ పేరు పెట్టామని, ఆనాడు ఈ సినిమాకు అన్ని విధాలా సహకరించిన నిర్మాత మధుమురళికి ధన్యవాదాలు తెలుపుతున్నామని కృష్ణవంశీ అన్నారు. దేశభక్తి నేపథ్య చిత్రాలన్నింటిలో 'ఖడ్గం' గొప్ప సినిమాఅనీ, తన జీవితంలో మరిచిపోలేని సినిమా ఇదని హీరో శ్రీకాంత్ చెప్పారు. ఇంకా ఇందులో కీలక పాత్రలు పోషించిన శివాజీరాజా, షఫీ కూడా మాట్లాడారు.

మూడో పార్ట్‌లో ముగ్గురుగా?

కంగనా రనౌత్ కెరీర్లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన సినిమా 'తను వెడ్స్ మను'. కథానాయికగా కంగనాకు స్టార్ స్టేటస్ని కట్టబెట్టిన సినిమా ఇదే. ఇందులో కంగనా, మాధవన్ల నటనను ఎవరూ మరిచిపోలేరు. ఆనంద్ ఎల్.రాయ్ తెరకెక్కించిన ఈ చిత్రానికి నేటికీ ఫ్యాన్స్ ఉన్నారు. ఈ సినిమాకు సీక్వెల్గా వచ్చిన 'తను వెడ్స్ మను రిటర్న్స్' కూడా మంచి హిట్ అయిన విషయం తెలిసిందే. త్వరలో 'తను వెడ్స్ మను' మూడో పార్ట్ రానున్నట్లు బీటౌన్లో వార్తలు బలంగా వినిపిస్తున్న నేపథ్యంలో.. ఆ వార్తలు నిజమేననీ, పార్ట్ 3కి సన్నాహాలు జరుగుతున్నాయని దర్శకుడు ఆనంద్ ఎల్ రాయ్ క్లారిటీ ఇచ్చేశారు. ఈ సినిమా విషయంలో ఆసక్తిని రేకెత్తిస్తున్న మరో విషయం ఏంటేంటే.. ఈ మూడో పార్ట్లో కంగనా ఏకంగా త్రిపాత్రాభినయం చేస్తున్నదట. మూడు భిన్నమైన పాత్రల్లో ఆమె కనిపించనున్నట్టు బాలీవుడ్ మీడియా కోడై కూస్తున్నది. ఇది కంగనా అభిమానులకు నిజంగా శుభవార్తే.

మిస్టర్ ఇడియట్ సెలబ్రేషన్స్

అగ్రహీరో రవితేజ తమ్ముడి తనయుడు మాధవ్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'మిస్టర్ ఇడియట్'. సిమ్రాన్ శర్మ కథానాయిక. గౌరీ రోణంకి దర్శకత్వంలో జె.జె.ఆర్.రవిచంద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నవంబర్లో సినిమా థియేట్రికల్ రిలీజ్ కానుంది. ప్రమోషన్లో భాగంగా విడుదల చేసిన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభిస్తున్నదని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా రీసెంట్గా విడుదల చేసిన 'కాంతారా కాంతారా..' సాంగ్, ట్రైలర్ సక్సెస్ సెలబ్రేషన్స్ని ధ్రువ ఫ్యాషన్ టెక్నాలజీ కాలేజ్లో జరిపారు. తమ ఆనందాన్ని కళాశాల విద్యార్థులతో చిత్ర టీమ్ షేర్ చేసుకున్నారు. ఇదే కాలేజ్లో ఈ సినిమా షూటింగ్ జరిపామనీ, ఆ క్షణాలు తన జీవితంలో మరిచిపోలేనివని హీరో మాధవ్ అన్నారు. షూటింగ్ టైమ్లో మీరంతా ఎంతో సహకరించారనీ, సినిమా మీకందరికీ నచ్చుతుందనీ డైరెక్టర్ గౌరీ రోణంకి నమ్మకం వెలిబుచ్చారు. టీమ్ అంతా ప్రాణంపెట్టి పనిచేశారని, హీరో మాధవ్ భవిష్యత్లో పెద్ద స్టార్ అవుతాడని నిర్మాత జె.జె.ఆర్.రవిచంద్ నమ్మకం వ్యక్తం చేశారు. ఇంకా కథానాయిక సిమ్రాన్, సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్, సింగర్ రాహుల్ సిప్లిగంజ్, రంగస్థలం మహేశ్ కూడా మాట్లాడారు.

మొదట్లో బాధపడ్డా.. ఇప్పుడు అలవాటు పడ్డా..

దక్షిణాదితోపాటు బాలీవుడ్లోనూ గుర్తింపు సాధించింది అందాలభామ ప్రియమణి. ప్రస్తుతం ఆమె సినిమాలు, సిరీస్, టీవీ ప్రోగ్రామ్స్తో బిజీ బిజీగా ఉన్నది. ఈ సందర్భంగా ఆమె ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత విషయాల గురించి మాట్లాడింది. 'నేను మతాంతర వివాహం చేసుకున్నాను. దాంతో నాపై వచ్చినన్ని ట్రోల్స్ ఎవరి మీదా రాలేదు. నేనేదో దేశద్రోహం చేసినట్టు రెచ్చిపోయి మరీ కామెంట్లు పెట్టేవారు. మనసులు కలవడానికి కులమతాలు అడ్డుకావు. ముస్తాఫా రాజ్ నాకెంతోకాలంగా తెలుసు. మా అభిప్రాయాలు, అభిమతాలు కలిశాయి. పెద్దల అంగీకారం లభించింది. ఎనిమిదేండ్ల క్రితం ఇద్దరం పెళ్లితో ఒకటయ్యాం. ఈ రోజుకు కూడా మా పెళ్లి విషయంలో ట్రోల్స్ వస్తూనే ఉన్నాయంటే నమ్ముతారా!? మొదట్లో ఈ ట్రోల్స్ వల్ల బాధపడేదాన్ని. ఇప్పుడు అలవాటు పడిపోయా.' అంటూ చెప్పుకొచ్చింది ప్రియమణి. 'జవాన్'తో గత ఏడాది ప్రేక్షకుల్ని పలకరించింది ప్రియమణి. ఈ ఏడాది ఆమె నటించిన మైదాన్, ఆర్టికల్ 370 చిత్రాలు పెద్దగా ఆడలేదు. ఓటీటీలో విడుదలైన 'భామాకలాపం 2'కు మాత్రం మంచి స్పందన వస్తున్నదని మేకర్స్ చెబుతున్నారు.

కుర్రాళ్లు కుమ్మేశారు

తొలి టీ20లో భారత్ సునాయాస విజయం

అర్ష్‌దీప్, వరుణ్ ధాటికి బంగ్లా బెంబేలు ● హార్దిక్, సూర్య దూకుడు

గ్వాలియర్ : ఈ ఏడాది పొట్టి ప్రపంచకప్ టైటిల్ గెలిచాక స్వదేశంలో ఆడిన తొలి టీ20 మ్యాచ్‌లో యువ భారత్ దుమ్ములేపింది. తమకంటే అనుభవజ్ఞులైన ఆటగాళ్లతో కూడిన బంగ్లాదేశ్‌ను 7 వికెట్ల తేడాతో చిత్తుచేసింది. మాధవరావు సింధియా నూతన క్రికెట్ స్టేడియంలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచి మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యాన్ని సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', అర్ష్‌దీప్ సింగ్ (3/14), స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (3/31) ధాటికి బంగ్లా 19.5 ఓవర్లలో 127 పరుగులకే కుప్పకూలింది. మెహిది హసన్ (35 నాటౌట్) టాప్ స్కోరర్. ఈ మ్యాచ్‌లో అరంగేట్రం చేసిన మయాంక్ యాదవ్ (1/21) ఆకట్టుకున్నాడు. అనంతరం స్వల్ప ఛేదనను భారత్ 11.5 ఓవర్లలోనే దంచేసింది. హార్దిక్ పాండ్యా (16 బంతుల్లో 39 నాటౌట్, 5 ఫోర్లు, 2 సిక్సర్లు), సూర్యకుమార్(29) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడారు. శాంసన్ (29) ఉన్నంతసేపు మెరుపులు మెరిపించాడు.

అర్ష్‌దీప్, వరుణ్ అదుర్స్

అర్ష్‌దీప్ మొదటి ఓవర్లోనే లిటన్ దాస్ (4)ను పెవిలియన్‌కు పంపి బంగ్లా వికెట్ల పతనానికి శ్రీకారం చుట్టాడు. తన మరుసటి ఓవర్లో హోసేన్ ఎమోన్ (8)ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. వరుణ్ చక్రవర్తి 5వ ఓవర్లో తౌహిద్ హృదయ్ (12) రెండు ఫోర్లు బాదగా శాంతో (27) సిక్సర్ కొట్టి ఇన్నింగ్స్‌ను పునర్నిర్మించే యత్నం చేశారు. కానీ అతడే వేసిన 7వ ఓవర్లో తౌహిద్.. హార్దిక్‌కు క్యాచ్ ఇచ్చాడు. తొలి ఓవరే మెయిడిన్ వేసిన యువ పేస్ సంచలనం మయాంక్ యాదవ్ తన రెండో ఓవర్లో మహ్మదుల్లాను ఔట్ చేసి వికెట్ల ఖాతా తెరిచాడు. శాంతోను వాషింగ్టన్ సుందర్ ఔట్ చేశాడు. ఆ తర్వాత వచ్చినవారిలో మిరాజ్ ఒక్కడే కాస్త దూకుడుగా ఆడటంతో బంగ్లా ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది.

భారత్ ధనాధన్..

ఛేదనలోను భారత్ దూకుడుగా ఆరంభించింది. షోరిపుల్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే శాంసన్ రెండు బౌండరీలు సాధించాడు. రెండో ఓవర్‌లో మరో ఓపెనర్ అభిషేక్ శర్మ.. 6, 4, 4 తో జోరు చూపించినా దురదృష్టవశాత్తూ రనౌట్ అయ్యాడు. ఈ క్రమంలో సంజూతో జతకలిసిన సూర్య.. బంగ్లా బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అరంగేట్రం మ్యాచ్ ఆడుతున్న తెలుగు కుర్రాడు నితీశ్‌రెడ్డి (16 నాటౌట్)తో జతకలిసిన హార్దిక్ పాండ్యా.. ఫోర్లు, సిక్సర్లతో చెలరేగడంతో 49 బంతులు మిగిలుండగానే భారత్ గెలిచింది.

సుకన్యకు రజతం

కురవి, అక్టోబర్ 6: దక్షిణాఫ్రికాలోని సన్‌సిటీ వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ పవర్‌లిఫ్టింగ్ టోర్నీలో భారత యువ లిఫ్టర్ తేజావత్ సుకన్య రజత పతకంతో మెరిసింది. ఆదివారం జరిగిన మహిళల 76కిలోల విభాగంలో బరిలోకి దిగిన సుకన్య లిఫ్ట్‌లో 107.5కిలోలు ఎత్తి రెండో స్థానంలో నిలిచింది. ఇదే కేటగిరీలో పోటీపడ్డ భారత్‌కు చెందిన వైశాలి(112.5కి), బెల్ ఎలెనా(100కి, ఐర్లాండ్) వరుసగా స్వర్ణ, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. మాహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం కలెక్టర్ తండాకు చెందిన సుకన్య నమస్తే తెలంగాణతో మాట్లాడుతూ తనకు ఆర్థికంగా అండగా నిలిచిన గ్రీన్‌కో గ్రూపు సీఎండీ అనిల్‌కుమార్‌కు రుణపడి ఉంటానని పేర్కొంది.

ఐసీసీ ఈవెంట్స్‌లో పాకిస్థాన్‌పై ఘనమైన రికార్డు కలిగిన భారత మహిళల క్రికెట్ జట్టు.. దాయాదుల పోరులో మరోసారి పైచేయి సాధించింది. యూఏఈలో జరుగుతున్న పొట్టి ప్రపంచకప్‌ను ఓటమితో మొదలుపెట్టిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన.. పాక్‌పై మాత్రం ఆల్‌రౌండ్ ప్రదర్శనతో రాణించి ఈ టోర్నీలో బోణీ కొట్టింది. మొదట బౌలింగ్‌లో హైదరాబాదీ అరుంధతిరెడ్డి, రేణుకాసింగ్ ఠాకూర్ కట్టుదిట్టమైన పేస్‌కు పాక్ బెంబేలెత్తగా యువ స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ ఆ జట్టుపై మరింత ఒత్తిడి పెంచింది. స్వల్ప ఛేదనే అయినా భారత్‌కు విజయం అంత ఈజీగా దక్కలేదు. షఫాలీ, జెమీమా, మంధాన, హర్మన్, రిచా వంటి స్టార్ బ్యాటర్లున్నా టీమ్‌ఇండియా ఇన్నింగ్స్‌లో ఐదు ఫోర్లే నమోదవడం గమనార్హం.

మహిళల టీ20 ప్రపంచకప్

భారత్ బోణీ

పాకిస్థాన్‌పై విజయం ● మెరిసిన అరుంధతి రెడ్డి, షఫాలీ వర్మ ● సెమీస్ ఆశలు సజీవం

అరుంధతి (3/19)

దుబాయ్: యూఏఈ వేదికగా జరుగుతున్న ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత్ గెలుపు బోణీ చేసింది. తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో ఓడిన టీమ్‌ఇండియా.. ఆదివారం పాకిస్థాన్‌పై 6 వికెట్ల తేడాతో గెలిచి సెమీస్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. దుబాయ్ వేదికగా దాయాదితో జరిగిన పోరులో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న హర్మన్‌ప్రీత్ కౌర్ సేన.. మొదట పాకిస్థాన్‌ను నిర్ణీత ఓవర్లలో 105/8 పరుగులకే కట్టడి చేసింది. అరుంధతిరెడ్డి (3/19), స్పిన్నర్ శ్రేయాంక పాటిల్(2/12) పాక్‌ను నిలువరించారు. పాక్ జట్టులో నిదా దర్ (34 బంతుల్లో 28, 1 ఫోర్) ఫర్వాలేదనిపించింది. స్వల్ప ఛేదనే అయినప్పటికీ భారత్ దానిని 18.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి పూర్తిచేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ (35 బంతుల్లో 32, 3 ఫోర్లు) తన సహజ శైలికి భిన్నంగా ఆడగా హర్మన్‌ప్రీత్ (24 బంతుల్లో 29 రిటైర్డ్ హర్ట్, 1 ఫోర్) కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడింది. అరుంధతికే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

ఆరంభం నుంచే తడబాటు..

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన పాక్ ఆరంభం నుంచే వికెట్లు కోల్పోయింది. భారత బౌలర్ల ధాటికి ఆ జట్టు క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. రేణుకా సింగ్ వేసిన తొలి ఓవర్ ఆఖరి బంతికి ఫెరోజా ఖాతా తెరవకుండానే క్లీన్‌బౌల్డ్ అయింది. వన్ డౌన్‌లో వచ్చిన సిద్రా అమీన్ (8) దీప్తి శర్మ 5వ ఓవర్లో బౌల్డ్ అయి వెనుదిరిగింది. అరుంధతి ఏడో ఓవర్లో ఒమైమా సోహైల్ (3)ను ఔట్ చేయడంతో పాక్ కష్టాలు రెట్టింపయ్యాయి. శ్రేయాంక పాటిల్ వేసిన పదో ఓవర్లో మునీబా అలీ (17) స్టంపౌట్ అయింది. భారత బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేయడంతో తొలి పది ఓవర్లలో ఏకంగా 38 డాట్ బాల్స్ నమోదవడం విశేషం. 13వ ఓవర్లో అలియా రియాజ్ (4) కూడా అరుంధతి బౌలింగ్‌లోనే ఎల్బీగా ఔట్ అయి డగౌట్ చేరింది. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో నిదాను బౌల్డ్ చేసిన అరుంధతి మూడో వికెట్‌ను సాధించింది.

భారత్ కూడా నెమ్మదిగానే..

స్వల్ప లక్ష్యమే అయినప్పటికీ భారత్ వేగంగా పరుగులు రాబట్టలేకపోయింది. స్పిన్‌కు అనుకూలిస్తున్న దుబాయ్ పిచ్‌పై పాక్ తొలి ఓవర్ నుంచే స్పిన్నర్లను దించి భారత్ దూకుడుకు అడ్డుకట్ట వేసింది. 16 బంతులాడిన ఓపెనర్ స్మృతి మంధాన (7) ఐదో ఓవర్లోనే పెవిలియన్ చేరింది. ఆరంభం నుంచే ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడే షఫాలీ కూడా డిఫెన్స్‌తో పాటు సింగిల్స్‌కే ప్రాధాన్యమివ్వడంతో ఓవర్‌కు 5 రన్‌రేట్ కూడా నమోదుకాలేదు. 8వ ఓవర్ దాకా భారత్ ఖాతాలో ఒక్క ఫోర్ కూడా రాలేదంటే ఇన్నింగ్స్ ఎంత మందకొడిగా సాగిందో అర్థం చేసుకోవచ్చు. జెమీమా రోడ్రిగ్స్ (28 బంతుల్లో 23) తో కలిసి షఫాలీ రెండో వికెట్‌కు 43 పరుగులు జతచేసినా ఈ ఇద్దరూ సింగిల్స్‌కే పరిమితమయ్యారు. 12వ ఓవర్లో షఫాలీ నిష్క్రమణ తర్వాత క్రీజులోకి వచ్చిన హర్మన్‌ప్రీత్ కూడా ఆచితూచి ఆడింది. 16వ ఓవర్లో రోడ్రిగ్స్ పెవిలియన్ చేరినా దీప్తి శర్మ (7 నాటౌట్) అండతో హర్మన్ టీమ్‌ఇండియాను విజయతీరాలకు చేర్చింది.

పెరగని నెట్ రన్‌రేట్..

ఈ మ్యాచ్‌లో భారత్ గెలిచినప్పటికీ పాయింట్ల పట్టికలో మాత్రం పాకిస్థాన్ తర్వాత నాలుగో స్థానంలో ఉంది. తొలి మ్యాచ్‌లో కివీస్ చేతిలో దారుణంగా ఓడటంతో భారత నెట్ రన్‌రేట్ దారుణంగా పడిపోయింది. ఇక పాక్‌తో మ్యాచ్‌లో భాగంగా ఛేదనలో భారత ఇన్నింగ్స్‌లో 5 ఫోర్లే నమోదయ్యాయి. టాపార్డర్ బ్యాటర్లంతా వికెట్ కాపాడుకుంటూ సింగిల్స్‌కే ప్రాధాన్యమివ్వడంతో పాక్‌పై గెలిచినప్పటికీ మన నెట్ రన్‌రేట్ (-1.127) మైనస్‌లోనే ఉంది. పాకిస్థాన్ (+0.555) మూడో స్థానంలో మెరుగ్గా ఉంది. సెమీస్ బెర్తును ఖాయం చేసుకోవాలంటే భారత్ రాబోయే శ్రీలంక, ఆస్ట్రేలియా మ్యాచ్‌లలో భారీ విజయాలు సాధించడం అవసరం. గ్రూప్ దశలో టాప్-2లో ఉన్న జట్లే సెమీస్‌కు అర్హత సాధిస్తాయి.

సంక్షిప్త స్కోర్లు

పాకిస్థాన్: 20 ఓవర్లలో 105/8 (నిదా దర్ 28, మునీబా 17, అరుంధతి 3/19, శ్రేయాంక 2/12)

భారత్: 18.5 ఓవర్లలో 108/4 (షఫాలీ 32, హర్మన్‌ప్రీత్ 29, ఫాతిమా 2/23, ఒమైమా 1/17)

గాఫ్‌దే చైనా ఓపెన్

ఫైనల్లో ముచోవాపై గెలుపు

బీజింగ్: మహిళల టెన్నిస్‌లో ప్రపంచ ఆరో ర్యాంకర్ కోకో గాఫ్ ఈ ఏడాది చైనా ఓపెన్‌లో విజేతగా నిలిచింది. ఆదివారం బీజింగ్‌లోని డైమండ్ కోర్ట్ వేదికగా జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్స్‌లో గాఫ్.. 6-1, 6-3తో కరోలినా ముచోవా (చెక్ రిపబ్లిక్)ను వరుస సెట్లలో చిత్తు చేసి టైటిల్ కైవసం చేసుకుంది. ఫైనల్లో గాఫ్ 6 ఏస్‌లు సంధించగా ముచోవా 2 మాత్రమే కొట్టగలిగింది. ఈ టోర్నీలో నాలుగో సీడ్‌గా బరిలోకి దిగిన గాఫ్.. గత మ్యాచ్‌లకు భిన్నంగా ఆరంభం నుంచే దూకుడుగా ఆడుతూ వరుస సెట్లలో గెలిచి ట్రోఫీని దక్కించుకుంది. తద్వారా 2013 (సెరెనా విలియమ్స్) తర్వాత చైనా ఓపెన్ గెలిచిన రెండో ప్లేయర్‌గా గాఫ్ రికార్డులకెక్కింది. ఈ ఏడాది ఆమెకు ఇది రెండో డబ్ల్యూటీఏ 1000 టైటిల్ కాగా ఓవరాల్‌గా 8వ టైటిల్. ఈ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో స్పెయిన్ యువ సంచలనం కార్లోస్ అల్కారజ్ విజేతగా నిలిచిన విషయం తెలిసిందే.

ధోనీ ట్రెండ్ సెట్టర్ : గేల్

శ్రీనగర్: భారత క్రికెట్ జట్టు మాజీ సారథి మహేంద్రసింగ్ ధోనీపై విండీస్ దిగ్గజం క్రిస్ గేల్ ప్రశంసల వర్షం కురిపించాడు. ధోనీ ఒక ట్రెండ్ సెట్టర్ అని అభివర్ణించాడు. భారత్‌లో జరుగుతున్న లెజెండ్స్ లీగ్ క్రికెట్(ఎల్ఎల్‌సీ)లో భాగంగా గుజరాత్ జెయింట్స్‌కు ఆడుతున్న గేల్ మాట్లాడుతూ.. 'భారత జట్టుకు ధోనీ అత్యంత విజయవంతమైన సారథి. అతడు ఒక ట్రెండ్‌ను సెట్ చేశాడు. అతడి బాటలోనే రోహిత్ శర్మ కూడా తన పాత్రకు తగిన న్యాయం చేస్తున్నాడు. కోహ్లీ కూడా బాగా కెప్టెన్సీ చేశాడు' అని అన్నాడు.

లండన్ ఐబీఎఫ్ మాస్టర్స్ టోర్నీలో భారత ప్లేయర్ వెంకట నారాయణ మూర్తి రన్నరప్‌గా నిలిచాడు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

జిందగీ
చైతన్య
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 7 అక్టోబర్ 2024
www.ntnews.com
11

మహా చండికాదేవి

నేటి అలంకారం

యా దేవీ మధుకైటభ ప్రశమనీ యా మాహిషోన్మూలినీ
యా ధూమ్రేక్షణ చండముండ దమనీ యా రక్తబీజాశినీ
యా శుంభాది నిశుంభ దైత్య దమనీ యా సిద్ధలక్ష్మీః పదా
సా చండీ నవకోటి శక్తి సహితా మాం పాతు విశ్వేశ్వరీ॥

చండీ స్వరూపం మహోగ్రమైంది. సకల రాక్షస శక్తుల్ని నిర్జించే శక్తి కలిగిన ప్రచండ రూపం ఇది. మహాకాళీ, మహాలక్ష్మీ, మహాసరస్వతీ శక్తులు, ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తుల సమ్మేళనం ఇది. వెయ్యి సూర్యుల ప్రకాశంతో వెలుగుతూ, సింహ వాహనాన్ని అధిరోహించి ఉంటుంది. దేవీ భాగవతంలో చండీ అమ్మవారి వైభవం విస్తారంగా వర్ణితమై ఉంటుంది. మధుకైటభులు, చండముండులు తదితర రాక్షసులను సంహరించిన సంహారశక్తి ఈ స్వరూపం. జగన్మాతను చండీ స్వరూపంలో అర్చిస్తే కష్టాలన్నీ తొలగిపోతాయి. అడ్డంకులు తొలగి కార్యసాధన జరుగుతుంది. అమ్మకు ఎర్రటి వస్త్రం అలంకరించాలి. పులిహోర, కట్టెపొంగలి నివేదన చెయ్యాలి. 'ఓం ఐం హ్రీం క్లీం చాముండాయై విచ్చే' అనే మంత్రాన్ని ఉపాసన చెయ్యాలి. ముత్తయిదువులను పూజించాలి. చండీ సప్తశతీ పారాయణం చెయ్యాలి. అవకాశం ఉన్నవారు చండీహోమం చేస్తే శీఘ్ర ఫలితాలు కలుగుతాయి.

అర్రెం (అలిగిన బతుకమ్మ)

ఇదొక్కటి బతుకమ్మ

దేవీభాగవతం ప్రకారం నవరాత్రుల్లో అమ్మ వారు మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి రూపాల్లో రాక్షస సంహారం చేసిందని చెబుతారు. భండాసురుణ్ని, చండముండల్ని సంహరించిన తర్వాత అలసిపోయిన అమ్మవారికి ఒక రోజు విశ్రాంతి ఇవ్వాలని ఆరోనాడు బతుకమ్మ ఆడరు. దానినే అర్రెం అనీ, అలసిన బతుకమ్మ అని పిలుస్తారు. కాలక్రమంలో అదే అలిగిన బతుకమ్మగా స్థిరపడింది. ఐదురోజుల పాటు బతుకమ్మ సంబురాలు మిన్నంటిన తరుణంలో.. ఆరో రోజు అలిగిన బతుకమ్మ పేరు మీద వేడుకలు నిర్వహించరు. మళ్లీ ఏడోనాడు నుంచి అంగరంగ వైభవంగా బతుకమ్మ కొనసాగుతుంది. దుష్ట సంహారం కోసం నడుం బిగించిన అమ్మ వారికి మేమంతా తోడుగా ఉన్నామని మహిళలు అందరూ ఆటపాటలతో, చప్పట్లతో తోడుగా నిలుస్తారు. ఉత్సాహపరుస్తారు.

• డా॥ ఆర్.కమల

పరాశక్తి నవరూపాలు

ప్రథమం శైలపుత్రీ చ ద్వితీయం బ్రహ్మచారిణీ
తృతీయం చంద్రఘంటేతి కూష్మాండేతి చతుర్థకం
పంచమం స్కందమాతేతి షష్ఠం కాత్యాయనీతి చ
సప్తమం కాళరాత్రీ చ మహాగౌరీతి చాష్టమం
నవమం సిద్ధిదాత్రీచ నవదుర్గాః ప్రకీర్తితాః

శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంటా, కూష్మాండ, స్కంద మాత, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిదాత్రి ఇలా వరుసగా తొమ్మిది రోజులు అమ్మవారిని తొమ్మిది రూపాలలో కొలుస్తారు. ఈ తొమ్మిది అవతారాలూ వేరుకావు. దుర్గాదేవి తొమ్మిది భేదాలే శైలపుత్రి మొదలుగా ఉన్న తొమ్మిది శక్తులు. దుర్గాదేవి నవరూపాలు ధరించడం వెనుక ఉన్న ఆంతర్యం తెలుసుకుంటూ, భక్తిశ్రద్ధలతో యథాశాస్త్రం ప్రతాన్ని ఆచరిస్తే అమ్మ అనుగ్రహం లభిస్తుంది. మొదట భౌతిక సుఖాలు పొంది, కొంతకాలానికి అంతఃకరణ శుద్ధి ఏర్పడి సచ్చిదానంద రూపమైన నిత్యశుద్ధ బుద్ధ స్వభావమైన మోక్షాన్ని అందుకోగలుగుతాం.

.. శ్రీ

అహం వీడితేనే..

ఎవ్వరూ వేరెవరి కంటే కూడా గొప్పవారు కారు. ఒకరి కన్నా గొప్పవారు ఉండరు. ఎందుకంటే అందరూ దైవాధీనులే అన్న విషయం గుర్తించుకోవాలి. మానవుడు ఎంత సాధించినా, అసంపూర్ణుడే! దేవుడు మాత్రమే పరిపూర్ణుడు. మిగిలినవన్నీ ఆ దైవశక్తిలో అసమగ్రమైన భాగాలే. ప్రతి మనిషికీ ఆత్మాభిమానం ఉండొచ్చు కానీ, అహంకారం ఉండగూడదు. తాను చేసే పనిమీద గట్టి నమ్మకం, చేపట్టిన కార్యాన్ని తప్పక నెరవేర్చుకోగలను అన్న విశ్వాసమే ఆత్మాభిమానం. దానికి తగ్గట్టుగానే శ్రమించాలి. నమ్మిన దేవుడ్ని దానికి ముందుంచి అనుకున్న లక్ష్యం వైపు మున్ముందుకు సాగిపోవాలి. ఇక్కడ సద్గుణాల సమ్మేళనంతోపాటు తనపై, తాను నమ్మిన దైవంపై ప్రగాఢ విశ్వాసం ప్రకటితమవుతుంది. దీనికి భిన్నమైంది, నేను అనే భావం!! 'నేనే సర్వం, సర్వజ్ఞుడను నేనే' అని విర్ర వీగడం అహం. 'నన్ను మించిన వాడు లేనే లేడు. ఇంకెక్కడ ఉండకూడదు' అనుకోవడం అహంకారం. ఇది వినాశన హేతువు. 'దేవుడు అహంకార ద్వేషి' అంటుంది క్రీస్తు ధర్మం (సామెతలు 8:13). దైవం వాక్కు పట్ల అవిధేయత, నిర్లక్ష్యం.. ఈ రెండూ అహంకారానికి బిడ్డల్లాంటివి. ప్రజలకు మేలు కార్యాలు తలపెట్టడానికి ఇష్టపడని దుష్టుడే 'దేవుడు లేడ'ని పేలుతుంటారు. ఇది అహంకృతితో సాగే విషయమే. కనుక ఈ పాపానికి పుట్టినిల్లు అహంకారమే అని చెబుతుంది దావీదు కీర్తన (10:4). 'నాశనమునకు ముందు గర్వము నడచును. పడిపోవుటకు ముందు అహంకారమైన మనస్సు నడచును' అని సోలోమన్ రాజు సామెతలు (16:18) చెబుతున్నది. సాతాను కూడా ఒకా నొకప్పుడు దైవ సన్నిధిలో ఉన్నవాడే! అవిధేయత, తిరుగుబాటు. అహంకారం వల్లే అతను స్వర్గంలో ఉండే అర్హత కోల్పోయాడు. అందుకే, అహం వీడితేనే ప్రభువు ఆశీస్సులు పొందే అర్హత లభిస్తుంది.



.. ప్రొ॥బెర్నార్డ్ రాజు, 98667 55024

హృదయ పూర్వకంగా

ఖురాన్ 'హృదయం (గుండె)' గురించి వివరంగా చర్చించింది. సుమారుగా 130 సార్లు హృదయానికి సంబంధించిన వాక్యాలు ఈ పవిత్ర గ్రంథంలో కనిపిస్తాయి. గుండెను ఖురాన్ ఖల్బ్ అని సంబోధించింది. ఖల్బ్ అంటే 'తిరగడం' అని అర్థం. 'శరీరంలో ఒక మాంసపు ముద్ద ఉంది, అది మంచిగా మారితే శరీరం మొత్తం బాగుంటుంది, కానీ అది చెడిపోతే శరీరం అంతా చెడిపోతుంది. అదే హృదయం' అన్నారు ప్రవక్త ముహమ్మద్. ఇస్లాం ప్రకారం మనుషుల హృదయాల్లో వివిధ రకాలు ఉన్నాయి. దృఢమైన హృదయం అంటే అహంకారం లేనిది. జబ్బుపడిన హృదయం అంటే వ్యర్థమైన కోరికలతో నిండి ఉండేది.

హృదయంలో అల్లాహ్ పట్ల వినయ విధేయతలు లేనప్పుడూ అది కఠినంగా మారుతుంది. కోరికలకు బానిసైన వారి హృదయాలు ఎప్పుడూ చెడు గురించే ఆలోచిస్తుంటాయి! అయితే కోరికలకు బానిస కాకుండా తమ అవసరాలను హలాల్ మార్గంలో తీర్చుకోవడం ద్వారా ప్రజలు సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు దగ్గరవుతారు. కష్టాల్లో, ఆపదలో ఉన్న వారిని చూసినప్పుడు భావోద్వేగానికిలోనై వారికి చేతనైన సాయం చేయాలి. అప్పుడే వారి హృదయం కుదుట పడుతుంది. 'అల్లాహ్ స్మరణ ద్వారానే హృదయాలకు తృప్తి కలిగే భాగ్యం లభిస్తుంది (13:28)'. అందుకే మంచి హృదయం ఇవ్వమని ఆయనను ప్రార్థించాలి. అల్లాహ్‌ను ఎక్కువగా స్మరిస్తే మన ఉద్దేశాలు, హృదయం స్వచ్ఛంగా ఉంటాయి.

.. ముహమ్మద్ ముజాహిద్
96406 22076

శ్రీ సంతోషం

జ్ఞాన బోధ

శక్తి ఒక్కటే.. వ్యక్తమయ్యే మార్గాలు అనేకం.
మూలపుటమ్మ ఒక్కరే.. రూపుదాల్చిన అవతారాలు అనేకం.
లలితగా సాత్త్వికంగా అనుగ్రహించినా..
దుర్గగా రాజసంగా కరుణించినా..
కాళిగా తామసంగా అభయమిచ్చినా..
ఆ తల్లి ప్రతిరూపం అపురూపమే!
సర్వభూతాల్లోనూ శక్తిగా సంస్థితమై ఉన్న అమ్మను
దశమహావిద్య రూపాల్లో కొలుచుకుంటారు శాక్తేయులు.
దశమహావిద్యలు అంటే ఏమిటి?
అవి ఏం దిశానిర్దేశం చేస్తున్నాయి?

'ఆధ్యాత్మికత' అంటే అష్ట ఐశ్వర్యాలను త్యజించడమనీ, భౌతిక సుఖాలను తృణీకరించడమనీ మన పూర్వులు ఎన్నడూ చెప్పలేదంటారు శ్రీ అరవిందులు. శరన్నవరాత్రులలో జరిగే అమ్మవారి అలంకారాలు చూస్తే శ్రీ అరవిందుల మాట అక్షర సత్యమని తెలుస్తుంది. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి దశమి వరకు అమ్మవారిని పది రకాలుగా అలంకరించి పూజిస్తారు. ఒక్కొక్క అలంకారానికీ ఒక్కొక్క నామం ఉన్నది. ఒక్కొక్క నామానికీ ఒక్కొక్క ప్రయోజనం ఉన్నది. వైభవోపేతమైన, శాంతియుతమైన మానవ జీవన కల్యాణార్థం ఈ ఉత్సవాలు జరుగుతాయి.

అమ్మశక్తి దశదిశలా..

సారం, గాణాపత్యం, స్కందం, శైవం, వైష్ణవం, శాక్తేయం అన్నవి హైందవ జీవన విధానంలో వేద ప్రమాణాన్ని అంగీకరించే మతాల (ఉపాసనా విధనాలు)లో ప్రధానమైనవి. ఈ ఆరు మత విధానాల్లోనూ నిత్య పూజావిధానం నిర్దేశించి ఉంది. అయినప్పటికీ మాఘమాసం సూర్యోపాసనకు, భాద్రపదం వినాయకుడి ఉపాసనకు, కార్తిక, మార్గశిర మాసాలు కుమారస్వామి ఆరాధనకు, కార్తికం శైవ, వైష్ణవ ఆరాధనకు, ఆశ్వయుజం శక్త్యుపాసనకు శ్రేష్ఠమైనవిగా భావిస్తారు. ఆశ్వయుజ, కార్తిక మాసాలు శరత్ రుతువు. ఈ రుతువులోని మొదటి తొమ్మిది రాత్రులను శరన్నవరాత్రులుగా పిలుస్తారు. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు అమ్మవారు బాలా త్రిపుర సుందరిగా పూజలు అందుకుంటుంది. మాసం చివరి రోజు అయిన అమావాస్య నాడు కమలాత్మికగా అర్చనలు స్వీకరిస్తుంది.

సౌర, గాణాపత్య, స్కంద, శైవ, వైష్ణవ మతాల మధ్యన అక్కడక్కడా వైరభావం కనిపిస్తుంది. కానీ శాక్తేయం పట్ల వీరందరికీ స్నేహభావమే ఉన్నది. దేవమాత కారణంగా సూర్యోపాసకులు, పార్వతి కారణంగా శైవులు, గాణాపత్య, స్కందులు, మహాలక్ష్మి కారణంగా వైష్ణవులు శాక్తేయంతో ముడిపడి ఉన్నారు. సృష్టి, స్థితి, లయలకు కారణభూతులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు వారి వారి కర్తవ్య నిర్వహణకు కావలసిన శక్తిని ఇచ్చే మహా సరస్వతి, మహాలక్ష్మి, మహాకాళులకు మూలపుటమ్మ అయిన ఆది పరాశక్తి శక్త్యుపాసనకు మూలవిరాట్టుగా నిలిచి ఉన్నది. భారతీయులందరినీ ఒక్కతాటిపై నిలిపి ఉంచగలిగిన శక్తి శాక్తేయానికి మాత్రమే ఉన్నదన్నది నిర్వివాదాంశం. ఈ విషయం గ్రహించిన కారణంగానే బంకిం చంద్రఛటర్జీ తన వందేమాతరం గీతంలో భారతమాతను దుర్గాభవానిగా అభివర్ణించాడు.

శరన్నవరాత్రుల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అర్చిస్తుంటారు. బాలాత్రిపుర సుందరి, గాయత్రి, అన్నపూర్ణ, లలితా త్రిపుర సుందరి, మహాచండి, మహాలక్ష్మి అన్నవి మొదటి ఆరు రోజుల అర్చనా రూపాలు. కాగా, వీటికి నామాంతరాలు ఉన్నాయి. ఒక్కొక్క గుడిలో ఒక్కో విధానం ఆచరణలో కనిపిస్తుంది. శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కందమాత, కాత్యాయనీ, కాళరాత్రి వంటి రూపాలలో ఆయా ఆలయాలలో అర్చనలు జరుగుతుంటాయి. ఇక చివరి నాలుగు రోజు అంటే సప్తమి నుంచి విజయ దశమి వరకు అలంకారాలు స్థిరంగా ఉంటాయి. సప్తమి (మూలా నక్షత్రం) నాడు సరస్వతి, అష్టమి రోజు దుర్గాదేవి, మహర్నవమి సందర్భంగా మహిషాసుర మర్దని, విజయ దశమినాడు శ్రీరాజరాజేశ్వరి అలంకారాలు ఉంటాయి. సకల సౌభాగ్యాలను ప్రసాదించే శ్రీరాజరాజేశ్వరీదేవి పట్టాభిషేకంతో శరన్నవరాత్రి ఉత్సవాలు ముగుస్తాయి. ఇందులో సరస్వతిని కాత్యాయనీ అనీ, దుర్గను కాళరాత్రి అనీ, మహిషాసుర మర్దనిని సిద్ధిదాత్రి లేదా మహాగౌరి అని భావన చేస్తారు.

అమ్మవారి రూపాలు అనంతం. కాగా సమస్త మానవాళి ఇష్టకామ్యార్థ సిద్ధి నిమిత్తం రుషులు అమ్మవారిని పది ప్రధాన రూపాలలో దర్శించి, అందుకు సంబంధించిన ఉపాసనా మార్గాలను మనకు ప్రసాదించారు. నెరవేర్చుకోవలసిన కామ్యాన్ని బట్టి అమ్మవారి రూపం ఉంటుంది. అందుకు తగిన నామం ఉంటుంది. ఉపాసకుడు ఆచరింపవలసిన కర్తవ్యాన్ని, లేదా పయనించవలసిన మార్గానికి 'మహావిద్య' అని పేరు. వాటి సంఖ్య పది కాబట్టి అవి 'దశ మహావిద్య'లయ్యాయి. ఈ కారణంగా దశమహావిద్యలను కూడా శరన్నవరాత్రుల్లో అర్చించడం ప్రధానంగా కనిపిస్తుంది. కాళి లేదా మహాకాళి, తార, షోడశి, భువనేశ్వరి, త్రిపుర భైరవి, ఛిన్నమస్త, ధూమ్రావతి, బగళాముఖి, మాతంగి, కమల (కమలాత్మిక) అని దశమహావిద్యల పేర్లు.

దశ మహావిద్యల్లో మొదటి శక్తి మహాకాళి. మహారాత్రి ఈమె లక్షణం. మహాకాలుడి భార్యగా కాలాన్ని నియంత్రించగల శక్తిశాలిని. కలకత్తాలోని కాళీమాత శ్రీరామకృష్ణ పరమహంస దక్షిణాచార పద్ధతిలో కొలిచాడు. ఈమె స్వయంగా తన భర్త అయిన శివుడి దేహంపైన పాదాలను నిలిపి ఉంటుంది. శ్మశానాలు ఈమె నివాసం. శ్రావణ బహుళ అష్టమి నాడు మహాకాళి జన్మించింది.

దశమహావిద్యల్లో రెండోది తార. క్రోధరాత్రి ఈమె స్వభావం. సిద్ధవిద్యా అన్నది మరోపేరు. చైత్రశుద్ధ నవమి (శ్రీరామనవమి) ఈమె జయంతి. ఏక జాతి, ఉగ్రతార, నీల సరస్వతి అన్నవి ఈమె ప్రసిద్ధ రూపాలు. ఈమె భర్తగా శివుని పేరు అక్షోభ్యుడు. ఈ దేవత కొలువుదీరిన పశ్చిమబెంగాల్‌లోని తారాపీఠ్ దేవాలయం ప్రసిద్ధి.

మూడోదైన షోడశీ మహావిద్యకున్న మరోపేరు బాలాత్రిపుర సుందరి. మూలాధార, అనాహత, ఆజ్ఞాచక్రాలకు అధిష్ఠాత్రి. బాలాత్రిపుర సుందరి పంచప్రేతాసినిగా గుర్తింపు పొందింది. బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశ్వరుడు ఈమె సింహాసనానికి కాళ్లుగా ఉండగా, సదాశివుడు పరుపు అయ్యాడు. మాఘ శుద్ధ పౌర్ణమి షోడశీ జయంతి.

భువనేశ్వరీదేవి సిద్ధ విద్య. రాజరాజేశ్వరి అన్నది ఈమెకున్న మరో నామం. శివుడు త్ర్యంబక నామంతో ఈమెకు భర్తగా ఉన్నాడు. భాద్రపద శుద్ధ ద్వాదశి భువనేశ్వరి జయంతి. ఈమె స్వాధిష్ఠాన చక్రానికి అధిష్ఠాత్రి. మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతులను సృష్టించి వారిని వరుసగా రుద్ర, విష్ణు, బ్రహ్మలకు ప్రసాదించిన ఆదిపరాశక్తిగా భువనేశ్వరి ప్రసిద్ధురాలు.

ఛిన్నమస్తా స్వభావం వీరరాత్రి. కబంధ నామంతో శివుడు ఈమెకు భర్తగా ఉన్నాడు. వైశాఖ శుద్ధ పౌర్ణమి ఈమె జన్మదినం. ప్రహ్లాదుని కుమారుడైన విరోచనుని కుమార్తెగా ఈమె వైరోచని. కుడిచేత ఖడ్గాన్ని ధరించి, తన శిరస్సును తానే ఖండించుకొని దానిని ఎడమ చేతితో పట్టుకొని ఉంటుంది. ఆమె కంఠభాగం నుంచి మూడు ధారలుగా ఎగజిమ్మిన రక్తాన్ని ఖండిత శిరస్సుతోపాటు ఇరువురు పరిచారికలు తాగుతుంటారు. మైథున క్రీడలో నిమగ్నమైన జంటపై నగ్నంగా నిలబడిన రూపం ఛిన్నమస్తాదేవి. కావ్యకంఠ వాశిష్ఠ గణపతిముని ఈమె నామాన్ని జపిస్తూ ఉండగా ఆయన శిరస్సునుంచి పొగలు వెలువడ్డాయట!

త్రిపుర భైరవీ మహావిద్యకున్న మరొకర పేరు కాళరాత్రి. ఈమె సిద్ధి విద్యగా ప్రసిద్ధి. కాలభైరవ నామంతో దక్షిణామూర్తి అయిన శివుడు ఈమెకు భర్త. మార్గశిర శుద్ధ పౌర్ణమి నాడు ఈమె జన్మించింది. త్రిభువనాలకు, త్రిగుణాలకు, త్రిమూర్తులకు, అవస్థా త్రయానికి, ఇచ్ఛాజ్ఞానక్రియా శక్తులకు త్రిపుర భైరవి అధిష్ఠాత్రి.

ధూమావతి అలక్ష్మిగా, జ్యేష్ఠాదేవిగా ప్రసిద్ధురాలు. కాకి ఈమె వాహనం. ఈమె భర్త శివుడు శూన్యుడు. దారుణ రాత్రి ఈమె స్వభావం. జ్యేష్ఠ శుద్ధ అష్టమి ఈ అమ్మవారి జయంతి. కోపం, దురదృష్టం, క్షయం, మరణం లాంటివి తొలగిపోవడానికి ఆమెను ప్రార్థించాలి. నైరుతి దిశతో ఈమెకు సంబంధం ఉందంటారు. దక్షయజ్ఞంలో సతీదేవి తనను తాను దహించుకున్నప్పుడు వెలువడిన ధూమంలోంచి పుట్టుకొచ్చిన మహావిద్యయే ధూమావతి అన్న ఐతిహ్యం ఉన్నది.

బగళాముఖిని పీతాంబరి అని కూడా అంటారు. కోర్టు కేసులు, అప్పుల నుంచి బయటపడవేసే దేవతగా ఈమె ప్రసిద్ధురాలు. బంగారుమేని ఛాయతో ప్రకాశించే ఈ దేవత తనకు ఎదురుపడిన వారిని లోబరుచుకొనే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఆ శక్తిని తన భక్తులకు ప్రసాదిస్తుంది. వైశాఖ శుద్ధ తదియ బగళా జయంతి.

లఘు శ్యామలగా కీర్తించే మాతంగీదేవి స్వభావం మోహరాత్రి. మాతంగ నామంతో శివుడు ఈమెకు భర్తగా ఉన్నాడు. వైశాఖ శుద్ధ తదియ ఈమె జన్మదినం. వాక్కు, సంగీతం, జ్ఞానం, కళలను నియంత్రించే మాతంగి సరస్వతీదేవి తాంత్రికరూపంగా చెబుతారు. అధికారంతో కూడిన పదవులను పొందడానికి చేసే రాజశ్యామల యాగం మాతంగి మహావిద్యకు సంబంధించినదే!

దశమహావిద్యల్లో చివరిది కమల (కమలాత్మిక)! దీపావళి ఈమె జన్మదినం. సదాశివ విష్ణు నామంతో శివుడు ఈమెకు భర్తగా ఉన్నాడు. మహారాత్రి ఈమె స్వభావం. లక్ష్మీనామంతో ఈమె వరదాయిని. దీపావళి నాటి అర్ధరాత్రి సమయంలో పూజలు అందుకునే మహాలక్ష్మి ఈ దేవతే!

వాక్కు మనదేహంలో 'పరా'నుంచి ప్రారంభమై 'పశ్యంతి', 'మధ్యమా'లుగా ప్రవహించి 'వైఖరి'గా వెలువడుతుందని చెబుతారు. ఈ క్రమంలో 'పరా' కు త్రిపురభైరవి, 'పశ్యంతి'కి తారాదేవి, 'మధ్యమా'కు ఛిన్నమస్తా, 'వైఖరి'కి మాతంగి అధిష్ఠాన దేవతలుగా ఉంటారు. సృష్టికి మూలమైన ఓంకారానికి మాతంగి అధిష్ఠాత్రిగా చెబుతారు. అస్సాంలోని గువాహటి సమీపంలో బ్రహ్మపుత్ర నది ఒడ్డున ఉన్న పర్వత శ్రేణుల్లో వెలసిస కామాఖ్యాదేవి వామాచార, దక్షిణాచార సంప్రదాయాలతో కూడిన దేవ్యుపాసనకు ఆటపట్టుగా ఉన్నది. దశ మహావిద్యలకు ఆ కొండలలో విడివిడిగా దేవాలయాలు ఉన్నాయి. నవదుర్గలైన శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కందమాత, కాళరాత్రి, మహాగౌరి, కాత్యాయని, సిద్ధదాత్రులు కూడా అక్కడ కొలువై ఉన్నారు.

శక్త్యుపాసనలో కేవలం విగ్రహారాధనమే కాదు, శక్తి స్వరూపాలుగా భావించే మహిళలను ప్రత్యక్షంగా ఆరాధించే సంప్రదాయం కనిపిస్తుంది. శరన్నవరాత్రుల్లో ఐదేండ్లలోపు ఉన్న బాలికలను బాల గానూ, పన్నెండేండ్లలోపు వయసున్న బాలికలను కుమారి గానూ, ముత్తయిదువులను సువాసినులు గానూ పూజిస్తారు. గురుతుల్యులైన వరిష్ఠ దంపతులకు దంపతి పూజ నిర్వహిస్తారు. నరకాసురుని చెర నుంచి పదహారు వేల మంది రాకుమార్తెలు విడుదలైన రోజు ఆశ్వయుజ బహుళ అమావాస్య. అంతకుముందు రోజైన చతుర్దశి నాడు నరకుడి వధ జరిగింది. నరకాసురుణ్ని సంహరించింది సత్యభామ అని మరవకూడదు. స్త్రీ శక్తిని లోకానికి తెలియజెప్పే ప్రయత్నమే ఆశ్వయుజ మాసంలో శక్త్యుపాసన అంతరార్థం.

అమ్మలంగన్న యమ్మ ముగురమ్మల మూలపుటమ్మ, చాలఁ బెద్దమ్మ, సురారులమ్మ కడుపారడి వుచ్చిన యమ్మ, తన్ను లో నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడి యమ్మ, దుర్గ, మాయమ్మ, కృపాబ్ధి యిచ్చత మహత్త్వకవిత్వ పటుత్వ సంపదల్
(పోతన భాగవతం)

ఈ పద్యంలో అమ్మ అన్న శబ్దం పది పర్యాయాలు వచ్చింది. ఇది దశమహావిద్యలకు సంకేతమేమో!

... వరిగొండ కాంతారావు

■ దక్షిణాచారమే రక్ష

దైవారాధన ముఖ్యంగా శాక్తేయంలో దక్షిణాచార మనీ, వామాచారమనీ రెండు రకాలు. వేద విహిత మార్గాన్ని ఆచరించడం దక్షిణ మార్గం. తద్విరుద్ధ ఆచరణ వామాచారం. యజ్ఞయాగాదులు, తాంత్రిక విధానాలు రెండింటా ఉన్నా, దక్షిణాచార మార్గం సత్త్వ, రజోగుణ సంపన్నం. వామాచారం రజస్తమోగుణ ప్రధానం. వశిష్ఠ, శుక, సనక, సనందన, సనత్కుమారాలనే ఐదు తంత్రాలు దక్షిణాచారంలో భాగాలు. రుషి సంప్రదాయం లేదా సమయాచారంగా పిలిచే దక్షిణ మార్గంలో జంతుబలులు క్రమేణా తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుత కాలంలో నైవేద్యానికి బెల్లం, మధుర పదార్థాలు, పాలు, పండ్లు వంటివి వినియోగిస్తున్నారు.

నవదుర్గల విషయంలో ఎలా ఉన్నా, దశమహావిద్యల విషయంలో ఇంకా వామాచార ప్రభావం ఎక్కువగా కొనసాగుతున్నది. కౌలం, వామం, చీనం, సిద్ధాంతం, శాంబరం అన్న ఐదు తంత్రాలలో వామాచారం నిర్వహిస్తుంటారు. తరతరాలుగా వస్తున్న వంశాచారాలు కౌలం అని చెబుతారు. చైనా, టిబెట్ దేశాల నుంచి మనకు సంక్రమించిన ఆచారాలకు చీనం, మహాచీనం, చీన క్రమం అన్న పేర్లున్నాయి. శబర లేదా శంబర శబ్దం నుంచి 'శాంబరం' వచ్చిందని భావించొచ్చు. ఇది ప్రధానంగా ఆటవికుల ఉపాసనా విధానం. వామం, సిద్ధాంతం అన్నవి మూలాచారాలై ఉండవచ్చు. వామాచారాన్ని క్షుద్ర పూజలని కూడా వ్యవహరిస్తారు. వామాచారం అనుసరణీయం కాదని విజ్ఞుల అభిప్రాయం.

రాబడి

పండుగ ఆఫర్లు భళా

ఈ పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని ఖాతాదారులను ఆకట్టుకోవడానికి ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులు పెద్ద ఎత్తునే ఆఫర్లను తెచ్చాయి. నవరాత్రులు, దుర్గాపూజ, దసరా, దీపావళి, భాయ్ దూజ్ పర్వదినాలుండటంతో రుణాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ), క్రెడిట్ కార్డు ఖర్చులపై వడ్డీ రేట్ల సవరణ, డిస్కౌంట్లను వ్యాపారులతో కలిసి ఆయా బ్యాంకర్లు అందిస్తున్నారు. ఐసీఐసీఐ బ్యాంక్ వార్షిక ఫెస్టివ్ బొనాంజా పేరిట ఎలక్ట్రానిక్స్, మొబైల్స్, ఫ్యాషన్, జ్యుయెల్లరీ, ఫర్నీచర్, ట్రావెల్, ఈ-కామర్స్, డైనింగ్ కొనుగోళ్లపై రూ.40,000 వరకు ఆఫర్లు, డిస్కౌంట్లను ఇస్తున్నది. క్రెడిట్/డెబిట్ కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్‌ల వినియోగం ద్వారా పొందవచ్చు. ఐఫోన్ 16, ఇతర యాపిల్ ఉత్పత్తులపైనా ప్రత్యేక ఆఫర్లున్నాయి. ఇక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబిల్ స్కోర్ ఆధారంగా 8.35 శాతం వడ్డీకే గృహ రుణాన్ని ఆఫర్ చేస్తున్నది. ప్రాసెసింగ్ ఫీజునూ రద్దు చేసింది. దిల్ సే ఓపెన్ సెలబ్రేషన్స్ పేరుతో యాక్సిస్ బ్యాంక్ ముందుకొచ్చింది. వివిధ రకాల బ్రాండ్లపై క్యాష్‌బ్యాక్ ఆఫర్లను పరిచయం చేసింది. ఆన్‌లైన్ షాపింగ్‌పై 25 శాతం వరకు డిస్కౌంట్‌నూ ప్రకటించింది. అలాగే ఎస్బీఐ డెబిట్ కార్డు వినియోగంపై అమెజాన్ షాపింగ్‌లో 10 శాతం ఇన్‌స్టంట్ డిస్కౌంట్ అందుకోవచ్చు. గృహ, వాహన, గోల్డ్ రుణాలపై ఆకర్షణీయ వడ్డీ రేట్లను కెనరా బ్యాంక్ ప్రకటించింది. డాక్యుమెంటేషన్, ప్రాసెసింగ్ ఫీజులను ఎత్తివేసింది. బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రత్యేకంగా 400 రోజుల రిటైల్ టర్మ్ డిపాజిట్‌ను పరిచయం చేసింది. గరిష్ఠ వడ్డీరేటు 8.10 శాతంగా ఉన్నది. కస్టమర్ల కోసం ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ కూడా రకరకాల ఆఫర్లను తీసుకొచ్చింది.



స్మార్ట్ సిప్ అదుర్స్

రెగ్యులర్ సిప్‌తో పోల్చితే ఆకర్షణీయ లాభాలు

రెగ్యులర్ సిప్-స్మార్ట్ సిప్‌ల్లో పెట్టుబడులపై ఇప్పటిదాకా వచ్చిన రాబడుల మధ్య తేడాను ఒక్కసారి గమనిస్తే..(రూ.లలో)

పెట్టుబడి	5,000	5,000	5,000	5,000
సంవత్సరాలు	10	15	20	25
సిప్ రిటర్న్స్ 12%	11,20,179	23,79,675	45,99,287	85,01,033
స్మార్ట్ సిప్ రిటర్న్స్ 13.5%	12,13,555	27,06,657	55,19,003	1,08,16,122
స్మార్ట్ సిప్‌ల్లో పెరిగిన లాభం	93,376	3,26,982	9,19,716	23,15,089

స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టాలనుకునే చాలామందికి సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్లు (సిప్స్) మొదటి ప్రాధాన్యతగా ఉంటాయి. ఇందులో ఎంచుకున్న కాలవ్యవధుల మేరకు మ్యూచువల్ ఫండ్ల ద్వారా నిర్దేశిత మొత్తాలను పెట్టుబడిగా పెడుతూపోవచ్చు. ఉదాహరణకు ప్రతి నెలా 5న రూ.10,000 పెట్టుబడిగా పెట్టాలని నిర్ణయిస్తే.. నెలనెలా 5న అంతే మొత్తం ఇన్వెస్ట్ చేస్తూనే ఉండాలి. మార్కెట్ పరిస్థితులతో సంబంధం లేకుండా ఇది కొనసాగుతుంది. దీర్ఘకాలంలో మీరు అధిక రాబడుల్నే అందుకోవచ్చు. అయితే ఇక్కడ 'స్మార్ట్ సిప్' అనే ఆప్షన్ కూడా ఉన్నది. మార్కెట్ పరిస్థితులనుబట్టి ప్రయోజనం పొందే వెసులుబాటు దీనిలో కనిపిస్తున్నది. ఫలితంగా ఎక్కువ లాభాలను మదుపరులు ఇందులో అందుకునే వీలున్నదని చెప్పవచ్చు.

స్మార్ట్ సిప్ అంటే ఏమిటి?

మార్కెట్ పరిస్థితులకు తగ్గట్టు పెట్టుబడులపై ఓ నిర్ణయం తీసుకుంటూ ఆకర్షణీయ లాభాలను ఒడిసి పట్టుకునేలా రూపొందించినదే ఈ స్మార్ట్ సిప్. ఒక్కమాటలో చెప్పాలంటే సంప్రదాయ సిప్‌కు ఇదో అప్‌గ్రేడ్ వెర్షన్. స్టాక్ మార్కెట్లు లాభాల్లో ఉన్నప్పుడు పెట్టుబడులు తగ్గిస్తూ, నష్టాల్లోకి జారుకున్నప్పుడు పెంచుతూపోవచ్చు. తద్వారా రిస్క్‌ను తగ్గించుకోవచ్చని, ఇదే సమయంలో మన పెట్టుబడులపై అధిక రాబడులనూ అందుకోవచ్చని నిపుణులు చెప్తున్నారు.

ఇదీ సంగతి..

మార్కెట్ వాల్యుయేషన్స్ ఆధారంగా పెట్టుబడి మొత్తాలను సర్దుబాటు చేస్తూ స్మార్ట్ సిప్‌లను మ్యూచువల్ ఫండ్స్ కొనసాగిస్తూ ఉంటాయి. సింపుల్‌గా చెప్పాలంటే తక్కువ కొనడం, ఎక్కువ అమ్మడం వీటి వ్యూహం. స్టాక్ మార్కెట్లు లాభాల్లో పరుగులు పెడుతున్నప్పుడు మీ మంత్లీ సిప్ (నిర్దేశిత నెలవారీ పెట్టుబడి) మొత్తం ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌ల్లోకి సాధారణంగానే వెళ్తుంది. కానీ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో నడుస్తున్నప్పుడు మీరు పెట్టే పెట్టుబడులు రెట్టింపవుతాయి. అంటే స్టాక్ మార్కెట్లు అప్ ట్రెండ్‌లో ఉన్నప్పుడు షేర్ల ధర ఎక్కువగా ఉంటుంది. అందుకే అప్పుడు స్మార్ట్ సిప్‌లో షేర్లను మ్యూచువల్ ఫండ్స్ మేనేజర్లు తక్కువగా కొంటుంటారు. లాభాల స్వీకరణకు పెద్దపీట వేసి ఉన్న షేర్లను అమ్మేస్తూ ఉంటారు. మార్కెట్ డౌన్ ట్రెండ్‌లో ఉన్నప్పుడు షేర్ల ధర కూడా తగ్గుతుంది. దీంతో వీలైనంత ఎక్కువగా రకరకాల షేర్లను కొనాలని మేనేజర్లు చూస్తారు. మార్కెట్లు పడుతున్నకొద్దీ ఇలా షేర్లను కొంటూనేపోతుంటారు. అందుకే స్మార్ట్ సిప్‌లో మీరు పెట్టే పెట్టుబడులు రెట్టింపవుతాయి. మార్కెట్ మళ్లీ పుంజుకున్నప్పుడు ఆ షేర్లను ఎక్కువ ధరలకు అమ్ముతారు. దీంతో పెట్టుబడులకు పెద్దగా ఆస్కారం ఉండదు. ఫలితంగా ఇన్వెస్టర్లకు లాభాలు కూడా పెరుగుతాయి. ఒకవేళ మార్కెట్లు అదేపనిగా పెరుగుతూపోతుంటే పెట్టుబడులను ఈక్విటీ స్కీముల్లో కాకుండా లిక్విడ్ ఫండ్స్‌ల్లోకి మ్యూచువల్ ఫండ్ మేనేజర్లు మళ్లిస్తారు. దీంతో ఆకస్మిక పతనాల నుంచి మదుపరులకు రక్షణ లభిస్తుంది.

స్మార్ట్ సిప్ ఎక్కడ లభ్యం?

ప్రస్తుతం యాక్సిస్ ఏఎంసీ, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ, కొటక్ ఏఎంసీలు స్మార్ట్ సిప్‌లను ఇన్వెస్టర్లకు ఆఫర్ చేస్తున్నాయి. మార్కెట్ పరిస్థితులకు తగ్గట్టుగా ఈ సిప్‌ల్లో ఇన్వెస్టర్లు ఎంచుకున్న కనీస పెట్టుబడి మొత్తాలు ఒక్కోసారి రెట్టింపవుతాయని, మరోసారి తగ్గుతాయని ఆయా ఫండ్ మేనేజర్లు చెప్తున్నారు. అయితే బుల్ మార్కెట్‌లో స్మార్ట్ సిప్‌ల నుంచి రెగ్యులర్ సిప్‌ల కంటే తక్కువగా రిటర్న్స్ రావచ్చని కూడా అంటున్నారు. మార్కెట్ వాల్యుయేషన్స్ ఆధారంగా పెట్టుబడులు తగ్గడమే ఇందుకు కారణం. అయినప్పటికీ బేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెరుగుతాయి కాబట్టి ఎక్కువ రాబడులు వచ్చే వీలుందని పేర్కొంటున్నారు. అయినా.. మ్యూచువల్ ఫండ్స్ సిప్‌ల్లో పెట్టుబడులు మార్కెట్ ఒడిదొడుకులకు లోబడి ఉంటాయి కనుక అన్నీ తెలుసుకొని ఇన్వెస్ట్ చేయడమే శ్రేయస్కరం అన్నది గుర్తుంచుకోవాలి.

గ్లోబల్ పరిణామాలు కీలకం

దేశీయ స్టాక్ మార్కెట్ల లాభాలకు బిగ్ బ్రేక్ పడింది. ఆల్‌టైమ్ హై శిఖరాలకు చేరుకున్న సూచీలు.. భారీ నష్టాలతో కిందకి వచ్చేశాయి. లాభాల స్వీకరణ దిశగా అడుగులేస్తున్న మదుపరులకు పశ్చిమాసియా ఉద్రిక్తతలు కూడా తోడవడంతో గత వారం ట్రేడింగ్‌లో భీకర నష్టాలే వాటిల్లాయి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 3,883.40 పాయింట్లు లేదా 4.60 శాతం క్షీణించి 81,688.45 వద్ద నిలిచింది. అలాగే ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ సైతం 1,164.35 పాయింట్లు లేదా 4.50 శాతం పడిపోయి 25,014.60 దగ్గర ముగిసింది. ఇక వరుసగా 5 రోజులపాటు మార్కెట్లు నష్టాల్లోనే కదలాడటంతో రూ.16.2 లక్షల కోట్లకుపైగా మదుపరుల సంపద హరించుకుపోయింది. ఈ నేపథ్యంలో ఈ వారం ఆర్బీఐ ద్రవ్యసమీక్షతో పాటు ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య పోరు.. పెద్ద ఎత్తునే ప్రభావితం చేస్తాయనిపిస్తున్నది. దీంతో కరెక్షన్‌కే వీలెక్కువగా ఉన్నట్టు కనిపిస్తున్నది. అలాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారంలోనూ భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,600 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,300 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే 25,400-25,600 మధ్యకు వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

చివరగా..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు మదుపరులు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్ అని గుర్తుంచుకోవాల్సిందిగా మనవి.

కొందామా.. ఆగుదామా?

గోల్డ్ మార్కెట్ ట్రెండ్‌పై నిపుణుల మాటేంటి?

బంగారం ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ప్రస్తుతం మునుపెన్నడూ లేనివిధంగా ఆల్‌టైమ్ హైల్లో గోల్డ్ రేట్లు కదలాడుతుండటం గమనార్హం. 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాములు ఏకంగా రూ.78,450గా నమోదైంది. నిజానికి గతకొద్ది రోజులుగా పుత్తడి విలువ నిత్యం ఎంతో కొంత పెరుగుతూనే ఉన్నది. ఈ క్రమంలోనే చాలామందికి ముఖ్యంగా సగటు మధ్యతరగతి వర్గానికి పసిడి కొనుగోళ్లపై ఎటూ తేల్చుకోలేని సందిగ్ధతే ఏర్పడింది. కొందామా.. ఆగుదామా? అనేది తెలియక ఒకింత గందరగోళంలోనే కొనుగోలుదారులున్నారు. మరి.. గోల్డ్ మార్కెట్ ట్రెండ్‌పై నిపుణుల మాటేంటి?

పండుగ సీజన్‌లో పైపైకే..

ఈ పండుగ సీజన్‌లో ధరలు మరింత పెరిగేలానే ఉన్నాయని మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ అంచనా వేస్తున్నారు. నవరాత్రులు, దసరా, దీపావళి, క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి ఇలా వరుసగా పండుగలున్న నేపథ్యంలో మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగానే ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. పైగా ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు, గ్లోబల్ మార్కెట్‌లో ఎగబాకుతున్న ముడి చమురు ధరలు, దేశ-విదేశీ స్టాక్ మార్కెట్ల పతనం వంటివి ఇన్వెస్టర్లను సహజంగానే గోల్డ్‌వైపు తిప్పుతున్నాయి. బంగారాన్ని రక్షణాత్మక పెట్టుబడిగా చూస్తుండటంతో ఇన్వెస్టర్ల నుంచి పెరిగే డిమాండ్ కూడా మార్కెట్‌లో ధరలను పరుగులు పెట్టిస్తుందని అంటున్నారు. దీంతో మరో 3-4 నెలలదాకా గోల్డ్ రేట్లు తగ్గకపోవచ్చనే అంచనాలే కనిపిస్తున్నాయి.

కరెక్షన్ ఎప్పుడు?

గోల్డ్ మార్కెట్‌లో కరెక్షన్ ఎప్పుడన్నదానికి పశ్చిమాసియాలో ఉద్రిక్తకర వాతావరణం చల్లబడాలని, స్టాక్ మార్కెట్లు తిరిగి లాభాల బాట పట్టాలని, అప్పుడే బంగారం ధరలు దిగివచ్చే వీలుందన్న సమాధానాలు వినిపిస్తున్నాయి. ఇప్పుడున్న ధరల్లో 5 నుంచి 7 శాతం మేర తగ్గవచ్చని చెప్తున్నారు. మొత్తానికి మదుపరులు తిరిగి తమ పెట్టుబడులను స్టాక్స్, బాండ్లవైపు మళ్లిస్తేనే గోల్డ్ రష్ తగ్గుతుందని అంటున్నారు. దీంతో ఇప్పట్లో బంగారం కొనుగోళ్ల జోలికి పెద్దగా వెళ్లకపోవడమే లాభదాయకమన్న రీతిలో నిపుణుల స్పందన ఉంటున్నది. అయితే స్వల్ప కాలానికి చూస్తే ధరలు పెరిగే అవకాశాలే ఎక్కువగా ఉన్నందున ఇప్పుడు కొని కొద్ది రోజుల తర్వాత అమ్ముకోవచ్చని కూడా సూచిస్తున్నారు. కానీ మార్కెట్ ట్రెండ్‌కు లోబడి రిస్క్‌ను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ

- మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో..
- రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో మాత్రమే చీరల పంపిణీకి ఏర్పాట్లు

ములుగు, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకొని రాష్ట్రంలోని ఆరు జిల్లాల మహిళా సంఘాల సభ్యులకు బతుకమ్మ చీరలను కానుకగా ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. గత ప్రభుత్వంలో రేషన్ కార్డుల్లో నమోదైన 18 ఏండ్లు నిండిన ప్రతి మహిళకూ బతుకమ్మ చీరలు అందించగా.. ప్రస్తుత ప్రభుత్వం తెలంగాణ ఆడపడుచుల చీరల పంపిణీ పేరుతో నూతన పథకాన్ని రూపొందించింది. రాష్ట్రంలో మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు జిల్లాతోపాటు గిరిజన జిల్లాలైన మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులతోపాటు 18 ఏండ్లు నిండిన గిరిజన మహిళలకు చీరలను పంపిణీ చేసేందుకు ఆయా జిల్లాలకు సరఫరా చేశారు. ఇందులో భాగంగా ములుగు జిల్లాకు 1,77,745 చీరలు చేరా యి. నేటి నుంచి తెలంగాణ ఆడపడుచుల చీరలను మహిళా సంఘాల ద్వారా ఎంపిక చేసిన సభ్యులకు అందించనున్నారు.

అమెరికా పర్యటనకు మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్, అక్టోబర్ 6(నమస్తే తెలంగాణ): పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం దుబాయ్ నుంచి అమెరికా బయలుదేరి వెళ్లారు. ఐఎంతఎక్స్ అమెరికా -2024 పేరిట లాస్ వెగాస్‌లో నిర్వహించనున్న అతి పెద్ద వాణిజ్య ప్రదర్శనలో ఆయన పాల్గొంటారు. సోమవారం వాషింగ్టన్ డీసీ చేరుకొని 8న లాస్ ఏం జెల్స్, 9,10 తేదీల్లో లాస్‌వెగాస్, 11న అట్లాంటాలో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొని 12న భా రత్ చేరుకొంటారు. ప్రపంచ సమావేశాలు, ఈవెంట్‌లు, ప్రోత్సాహక ప్ర యాణాల కోసం నిర్వహించే వాణిజ్య ప్రదర్శనలో అమెరికా, భారత్, కెనడా, మెక్సికో, బ్రెజిల్, దుబాయ్ సహా పలు దేశాలు పాల్గొంటున్నాయి.

‘రాయలసీమ’ కొనసాగడం నిజమే

- అంగీకరించిన ఎంపోఈఎఫ్ జాయింట్ కమిటీ
- ఎట్టకేలకు గ్రీన్‌ట్రిబ్యునల్‌కు నివేదిక
- అయినప్పటికీ దృష్టిసారించని కాంగ్రెస్ సర్కారు
- లేఖలు రాసి చేతులు దులుపుకొంటున్న దుస్థితి

హైదరాబాద్, అక్టోబర్6 (నమస్తే తెలంగాణ): ఎన్జీటీ ఆదేశాలకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం కొనసాగిస్తున్న రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పనులను అడ్డుకోవాల్సిన కేంద్రమే ఉదాసీనంగా వ్యవహరిస్తున్నది. అడుగడుగునా వత్తాసు పలుకుతున్నది. ప్రాజెక్టు పనులు కొనసాగేందుకు పరోక్షంగా మద్దతునిస్తున్నది. అందుకు కేంద్ర సంస్థల వ్యవహారశైలి ఊతమిస్తున్నది. ప్రాజెక్టును మార్చి నెలలో సందర్శించి పనులు కొనసాగుతున్నాయని గుర్తించినా ఆ నివేదికను వారం రోజుల కిందటి వరకు ఎన్జీటీకి సమర్పించలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అదే నివేదికను సమాచారహక్కు చట్టం కింద కోరితే మాత్రం ఐదునెలల ముందుగానే ఇవ్వడం గమనార్హం. వివరాల్లోకి వెళ్లితే.. ఏపీ ప్రభుత్వం పర్యావరణ అనుమతుల్లేకుండానే రాయలసీమ ప్రాజెక్టును చేపట్టిందని నారాయణపేట జిల్లాకు చెందిన ఒకరు ఎన్జీటీని ఆశ్రయించడం, దీనిపై వాస్తవాలను తేల్చేందుకు ఇప్పటికే కేఆర్ఎంబీ ఆధ్వర్యంలో నిపుణుల కమిటీని ఏర్పాటవడం, నివేదికను సమర్పించడం తెలిసిందే. ఆ ప్రాజెక్టు పనుల విషయంలో ఏపీ ప్రభుత్వం చెప్తున్న విషయాలన్నీ అబద్ధమేనని ఆ నివేదిక స్పష్టంచేసింది. దీనిని అనుసరించి పర్యావరణ అనుమతులు పొందేవరకూ రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను చేపట్టవద్దని, కనీసం డీపీఆర్ తయారీ కోసం కూడా ఎలాంటి తవ్వకాలు, పనులను చేపట్టవద్దని ఎన్జీటీ స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. అయినప్పటికీ ఏపీ సర్కారు ఆర్ఎల్ఐఎస్ పనులను కొనసాగించడంతో ఎన్జీటీలో మళ్లీ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. ఈ నేపథ్యంలో ఎన్జీటీ మరోసారి జాయింట్ కమిటీని నియమించింది. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి నివేదికను అందించాలని కేంద్ర పర్యావరణశాఖకు చెందిన సైంటిస్టుతోపాటు, మరో ఇద్దరు సభ్యులను కూడా నియమించింది. ఆ కమిటీ ఈ ఏడాది మార్చి నెలలోనే ప్రాజెక్టును సందర్శించింది. అందుకు సంబంధించిన నివేదికను సైతం జూలైలోనే సిద్ధం చేసింది. కానీ. ఎన్జీటీకి ఇవ్వకుండా తాత్సారం చేస్తూ వచ్చింది. మరోవైపు తెలంగాణకు చెందిన ఒకరు కేంద్ర పర్యావరణశాఖకు ఇదే విషయమై ఆర్టీఐ కింద దరఖాస్తు చేస్తే మాత్రం అందుకు సంబంధించిన నివేదికను ఇచ్చింది. ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయని జాయింట్ కమిటీ రిపోర్టు కూడా స్పష్టం చేయడం గమనార్హం. మొత్తంగా ఏపీ కొనసాగిస్తున్న పనులకు కేంద్రమే పరోక్షంగా మద్దతు ఇస్తున్నదని తేలిపోతున్నది. ఇదిలా ఉంటే, ఏపీ ప్రభుత్వం ఆర్ఎల్ఐఎస్ పనులను కొనసాగిస్తున్నదని గత డిసెంబర్‌లోనే ఆధారాలతో సహా పలువురు బయటపెట్టారు. ఆ వెంటనే హడావుడి చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఆ తరువాత ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రాజెక్టు పనులను అడ్డుకోవాలని కోరుతూ కంటితుడుపుగా కేంద్రానికి, కేఆర్ఎంబీకి లేఖలు రాసి చేతులు దులుపుకున్నది. కానీ ప్రాజెక్టు పనులు నిలిపివేయించేలా ఏనాడూ కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చిన దాఖలాల్లేవు.

రోజుకు 3టీఎంసీలు

- రాయలసీమ ఎత్తిపోతలతో భారీ జలదోపిడీ
- ఏకంగా 12 సొరంగాలతో పంప్‌హౌస్
- కృష్ణానదిలో 18 కిలోమీటర్ల కాలువ
- మొత్తం 111 టీఎంసీల తరలింపే టార్గెట్
- ఆందోళన వ్యక్తం చేస్తున్న జలవనరుల నిపుణులు
- జలదోపిడీపై సీఎం మౌనం వీడాలి: మాజీ ఎమ్మెల్యే బీరం డిమాండ్

మహబూబ్‌నగర్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టుతో ఏపీ ప్రభుత్వం భారీ జలదోపిడీకి సిద్ధమయ్యింది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి మట్టం 885 అడుగులు కాగా.. 854 అడుగుల వద్ద వరకు మాత్రమే నీటిని తీసుకునే అవకాశం ఉన్నది. ఏపీ ప్రభుత్వం ఏకంగా 800 అడుగుల డెడ్ స్టోరేజీ వరకు నీటిని తోడేందుకు రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చేపడుతున్నది. దీనికోసం ఏకంగా 111 టీఎంసీలను తరలించేందుకు 18 కిలోమీటర్లు కృష్ణానదిలో అప్రోచ్ కెనాల్ తవ్వి భారీ ఎత్తున జలదోపిడీకి పాల్పడుతున్నది. ఎన్జీటీ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఎత్తిపోతల నిర్మాణం దాదాపుగా పూర్తి చేశారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం పూర్తిస్థాయిలో ప్రారంభమైతే శ్రీశైలం జలాశయంలో ఎండాకాలంలో డెడ్ స్టోరేజీలో కూడా నీరు కనిపించని పరిస్థితి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇందుకు ఏపీ చేపడుతున్న భారీ కాల్వ నిర్మాణమే సాక్ష్యం అని అంటున్నారు. గ్రావిటీ ద్వారా అప్రోచ్ కెనాల్ తవ్వి 12 సొరంగాల ద్వారా పంప్‌హౌస్‌కు నీటిని తరలించి.. అక్కడి నుంచి రాయలసీమకు తరలిస్తారు.

అటు సస్యశ్యామలం.. ఇటు నీటికి కటకట..

శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులు ఎక్కువ భాగంలో ఉండడంతో ఏపీకి కలిసివచ్చింది. కేవలం కాల్వ తవ్వితే చాలు గ్రావిటీ ద్వారా నీటిని తరలించుకుపోవచ్చు. తెలంగాణ వైపు నీటిని మళ్లించాలంటే ఎత్తిపోతలే శరణ్యం. కృష్ణా ప్రాజెక్టులను పరుగులు పెట్టించాల్సిన కాంగ్రెస్ నేతలు అధికారంలో ఉండి మౌనంగా ఉండటంపై బీఆర్ఎస్ ప్రశ్నిస్తున్నారు.

జలదోపిడీపై సమాధానం చెప్పాలి

ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి ముఖ్యమంత్రి, మంత్రులుగా ఉన్నవారు జలదోపిడీపై మౌనం వీడాలి. బేషజాలకు పోకుండా ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి సాగునీరందించాలి.కేసీఆర్ హయాంలో తెలంగాణలో ప్రతి బీడు పొలానికి సాగునీరు అందించేందుకు ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇచ్చాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కృష్ణా నదిలో తెలంగాణ రావాల్సిన నీటి వాటాను పక్క రాష్ట్రానికి అప్పజెప్పినట్లుంది. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఆపకపోతే దక్షిణ తెలంగాణ ఎడారిగా మారే ప్రమాదం ఉన్నది.

-బీరం హర్షవర్ధన్‌రెడ్డి, కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే

10 నెలల్లో 24వ సారి ఢిల్లీకి

- మళ్లీ హస్తినకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి
- కేంద్రహోం శాఖ సమావేశంతో పాటు కాంగ్రెస్ పెద్దలతో భేటీకోసం పయనం
- మంత్రివర్గ విస్తరణపై చర్చకు అవకాశం
- ఆశావహుల ఎదురుచూపులు ఫలించేనా?

హైదరాబాద్, అక్టోబర్ 6(నమస్తే తెలంగాణ) : సీఎం రేవంత్‌రెడ్డి మళ్లీ ఢిల్లీ బాట పట్టారు. ఆదివారం సాయంత్రం ఢిల్లీ చేరుకున్నారు. ఆయన సీఎం అయిన తర్వాత ఢిల్లీకి వెళ్లడం ఇది 24వ సారి కావడం గమనార్హం. ఈ పర్యటనలో అన్ని రాష్ట్రాల సీఎంలతో కేంద్ర హోంశాఖ నిర్వహించే సమావేశంలో పాల్గొననున్నారు. ఆ తర్వాత పార్టీ పెద్దలను కలిసే అవకాశం ఉన్నది. పేరుకు కేంద్ర హోం శాఖ సమావేశమని, కానీ మంత్రివర్గ విస్తరణపై చర్చించడమే సీఎం ఢిల్లీ పర్యటన ప్రధాన ఎజెండా అని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. మంత్రివర్గ విస్తరణ అంశం ఈసారైనా కొలిక్కివస్తుందో? లేదో?నని సందేహిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి పది నెలలు పూర్తయినా ఇప్పటి వరకు పూర్తిస్థాయి మంత్రివర్గం ఏర్పాటు చేయకపోవడంపై పార్టీలో అసంతృప్తి తారస్థాయికి చేరినట్టు తెలిసింది. మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్న వారు అధిష్ఠానం తీరుపై గుర్రుగా ఉన్నారు. సీఎం రేవంత్ మొన్నటి ఢిల్లీ పర్యటనలో మంత్రివర్గ విస్తరణపై చర్చ జరగ్గా.. హర్యానా ఎన్నికల తర్వాత చూద్దామంటూ అధిష్ఠానం చెప్పినట్టు తెలిసింది. దసరా, హర్యానా ఎన్నికల తర్వాత చర్చిద్దామంటూ పెద్దలు చెప్పడంతో సీఎం ఢిల్లీకి వెళ్లినట్టు సమాచారం. దసరా కానుకగా మంత్రివర్గ విస్తరణ చేస్తే బాగుంటుందనే అభిప్రాయాలు పార్టీలో వ్యక్తమవుతున్నాయి. ఇక సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లడంతో మంత్రి పదవుల ఆశావాహులు, వారిని బలపరుస్తున్న పలువురు మంత్రులు సైతం ఢిల్లీ బాట పట్టినట్టు తెలిసింది.

ఉగ్రవాది కాదు..నేరగాడు కాదు!

- సోషల్ మీడియాలో స్పందిస్తే జైలేనా?
- సీపీ ఆనంద్ సమాధానం చెప్పండి
- బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పోలీసుల వ్యవహారశైలిపై బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ మండిపడ్డారు. ‘అతడు ఉగ్రవాది కాదు.. నేరగాడు అసలే కాదు.. హైడ్రా బుల్డోజర్, మూసీ బాధితుల ఆక్రందనలు, కన్నీటి వేదనను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన వ్యక్తిని జైల్లో వేశారని విమర్శించారు. అతడి ఫొటోను కాంగ్రెస్ ఐటీ సెల్‌కు పోలీస్ విభాగం ఎలా పంపిందని ఆదివారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. ఇది ఆ వ్యక్తి హక్కుల ఉల్లంఘన కాదా? అని ప్రశ్నించారు. దీనిపై హైదరాబాద్ సిటీ కమిషనర్ సీవీ ఆనంద్ సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అతడి ఫొటోతోపాటు ‘హద్దు మీరితే తప్పదు శిక్షలు. ప్రశ్నించేతత్వాన్ని దు ర్వినియోగం చేస్తున్న పోరంబోకులు’ అని కాంగ్రెస్ సోషల్ మీడియా పోస్టు చేయడాన్ని క్రిశాంక్ ఖండించారు.

నూతన కమిటీ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

‘గోపా’ రాష్ట్ర కార్యవర్గ ప్రమాణస్వీకారం

హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రులు

ఖైరతాబాద్, అక్టోబర్ 6: గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా)ను జిల్లా స్థాయిలో అభివృద్ధి చేసి పేద విద్యార్థుల సంక్షేమానికి పాటుపడాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, మాజీ మంత్రులు కోరారు. రాష్ట్ర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లోని నీరా కేఫ్ ఆడిటోరియంలో ఆదివారం జరిగింది. నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండి సాయన్నగౌడ్, జీవీ శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి మొగిలి రఘునాథ్‌గౌడ్‌తోపాటు ఉపాధ్యక్షులు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు డాక్టర్ వీ శ్రీనివాస్‌గౌడ్, దేవేందర్‌గౌడ్, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, బూర నర్సయ్యగౌడ్, విద్యా శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, మాజీ ఎమ్మెల్సీలు రాజలింగంగౌడ్, గంగాధర్‌గౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, మాజీ ఎమ్మెల్యేలు కే సత్యనారాయణగౌడ్, కూన శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా బడ్జెట్ పెంచాలని సర్కారును నిలదీద్దాం

- విద్యకు కేటాయింపుల్లో అట్టడుగున మనమే
- విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విద్యకు బడ్జెట్ పెంపుపై అందరం రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీద్దామని విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. విద్యాపరమైన అంశాలపై మాట్లాడేందుకు తనకేం భయం, మొహమాటం లేదని, ఇంత తెలిశాక భయపడటం దేనికని కుండబద్దలు కొట్టారు. హైదరాబాద్ అబిడ్స్ మెథడిస్ట్ కాలేజీలో ఆదివారం జరిగిన ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు కేవలం 7.4 శాతం నిధులను కేటాయించడంపై ఆయన అసంతృప్తిని వ్యక్తంచేశారు. మ్యానిఫెస్టోలో పెట్టినట్టుగా 15 శాతం నిధులు కేటాయించాల్సిందేనని, బడ్జెట్‌ను పెంచాల్సిందేనని, లేకపోతే భారీ తప్పిదమవుతుందని హెచ్చరించారు. దేశంలో విద్యకు సింగిల్ డిజిట్ శాతం బడ్జెట్ ఇచ్చిన ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని పేర్కొన్నారు. ఇప్పుడు కూడా 100 మంది ఆడపిల్లలు ఒక్క టాయిలెట్ ముందు క్యూకట్టడం నాన్సెన్స్ అని వ్యాఖ్యానించారు. సాక్షాత్తు ప్రభుత్వం నియమించిన విద్యా కమిషన్ చైర్మన్ హోదాలో ఉండి ఇలా వ్యాఖ్యానించడం ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టినట్టయింది.

గ్రంథాలయ సంస్థలకు చైర్మన్ల నియామకం

జీవోలు జారీ చేసిన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పలు జిల్లా గ్రంథాలయ సంస్థలకు ప్రభుత్వం నూతన చైర్మన్లను నియమించింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం వేర్వేరు జీవోలను విడుదల చేశారు.

జిల్లాపేరు	కొత్త చైర్మన్	జిల్లాపేరు	కొత్త చైర్మన్
జోగులాంబ గద్వాల	నీలి శ్రీనివాసులు	సంగారెడ్డి	గొల్ల అంజయ్య
మహబూబ్‌నగర్	మల్లు నర్సింహారెడ్డి	వనపర్తి	జీ గోవర్ధన్
వికారాబాద్	శేరి రాజశేఖర్ రెడ్డి	రంగారెడ్డి	ఏ మధుసూదన్‌రెడ్డి
నారాయణపేట	వరాల విజయ్‌కుమార్	కరీంనగర్	సత్తు మల్లయ్య
కామారెడ్డి	మద్ది చంద్రకాంత్‌రెడ్డి	రాజన్న సిరిసిల్ల	నాగుల సత్యనారాయణగౌడ్
		నిర్మల్	సయ్యద్ అర్జుమంద్ అలీ

నెలాఖరులోగా కొత్త రెవెన్యూ చట్టం

- గ్రామాల్లో రెవెన్యూ అధికారుల నియామకం
- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల సమావేశంలో పాంగులేటి

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): ఈ నెలాఖరులోగా కొత్త రెవెన్యూ చట్టం-24(ఆర్వోఆర్ యాక్ట్)ను అమల్లోకి తేనున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. రెవెన్యూ ఉద్యోగుల జాబ్ చార్టుల రూపకల్పనకు ప్రత్యేక కమిటీ వేస్తామని చెప్పారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ)లో ఆదివారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లతో మంత్రి సమావేశమై మాట్లాడారు. 33 జిల్లాలకు సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లను నియమిస్తామని, ధరణి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని చెప్పారు. ఎన్నికల సమయంలో బదిలీ చేసిన తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లను సొంత స్థానాల్లోకి బదిలీ చేస్తామన్నారు. కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ఆఫీసులు నిర్మిస్తామని చెప్పారు. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్ మాట్లాడుతూ తొమ్మిది నెలల్లో 3.50 లక్షల ధరణి సమస్యలు పరిష్కరించామని తెలిపారు. దసరాలోగా ఎన్నికల తహసీల్దార్లను సొంత స్థానాల్లోకి ట్రాన్స్‌ఫర్ చేస్తామని చెప్పారు. రవీందర్‌రెడ్డి, గౌతమ్‌కుమార్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

5 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్

- దసరా ముందురోజు భూమి పూజ
- డిప్యూటీ సీఎం భట్టి వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): ఈ సంవత్సరం 5వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మించనున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దసరాకు ముందురోజు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తామని పేర్కొన్నారు. తెలంగాణ మానవ వనరులు ప్రపంచంతో పోటీపడేలా విద్యపై దృష్టి పెడతామని చెప్పారు. 20 నుంచి 25 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో స్కూళ్లను నిర్మించి ఇక్కడ 12వ తరగతి వరకు విద్యార్థులకు బోధిస్తామని వెల్లడించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని భట్టి ఆదివారం సచివాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తామని, ఇప్పటివరకు 25 నియోజకవర్గాల నుంచి స్థలాలను సేకరించి పైలట్ ప్రాజెక్టు కింద కార్యక్రమాన్ని ప్రకటిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,023 రెసిడెన్షియల్ పాఠశాలు, ఉండగా ఇందులో 662 అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని తెలిపారు. అన్నివర్గాల విద్యార్థులు కలిసి ఒక చోట ఓ కుటుంబంలా చదువుకొనేలా స్కూళ్ల భవనాలు నిర్మించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

KUMARI DIVIJA PRABHAKAR PRESENTS
MYTHRI MOVIE DISTRIBUTORS LLP
విజయదశమి శుభాకాంక్షలతో
SRI SUMANDHARA PRODUCTIONS PVT. LTD.
ATTITUDE STAR CHANDRA HASS IN & AS
రామ్‌నగర్ బన్నీ
నేడే చూడండి
SUPER HIT..
రాజధాని 70 ఎంఎం ఏ/సి - దిల్‌సుఖ్‌నగర్ 11.30, 2.30, 6.30, 9.30
PVR ఆర్.కె - బంజారాహిల్స్
PVR పెంట్లిమాల్ - పంజాగుట్ట
PVR ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్
PVR నెక్టవ్ మాల్ - కూకట్‌పల్లి
PVR గచ్చిబౌలి - పంజాగుట్ట
PVR పీవీఆర్ - ఎర్రమంజిల్
PVR పీవీఆర్ - మూసారంబాగ్
PVR ప్రెస్టేజ్ ప్లేమ్ - గచ్చిబౌలి
PVR ఐకాన్ - హైటెక్ సిటీ
PVR ATRIUM మాల్ - గచ్చిబౌలి
PVR ఎఏ2 ఎ/సి - మల్లాపూర్
INOX ఐనాక్ష్ - బంజారాహిల్స్
INOX జి.ఎస్.ఎమ్ - మదీనాగూడ
INOX ప్రీజమ్ - గచ్చిబౌలి
INOX పత్వనెక్టివ్ మాల్ - కవాడిగూడ
INOX అశోక ఎ/సి - వై.జంక్షన్
AMR ఎఎంఆర్ - మౌలాలి
MOVIETIME ప్లాటినమ్ - అమీర్‌పేట
MOVIETIME స్కైమాల్ - సనత్‌నగర్
MOVIETIME ప్లాటినమ్ - గచ్చిబౌలి
Cinépolis లులు మాల్ - కూకట్‌పల్లి
Cinépolis CCPL - మల్కాజ్‌గిరి
Cinépolis డి.ఎస్.ఎల్ - ఉప్పల్
Cinépolis మంత్రిమాల్ - అత్తాపూర్
Cinépolis సుధ ఎ/సి - శాలిబండ
మీరజ్ సినిమాస్ - బిలాల్‌నగర్
మీరజ్ సినిమాస్ - బిడిపిఎల్
మీరజ్ సినిమాస్ - చందానగర్
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
లక్ష్మీనరసింహా - మియాపూర్
పీవీ ఎక్స్‌ప్రెస్ - ఉప్పల్
టివోలి - సికింద్రాబాద్
విజయలక్ష్మీ - ఎల్‌బీనగర్
ఏఏఏ ఎ/సి - అమీర్‌పేట
ఏఎంబి ఎ/సి - గచ్చిబౌలి
పీవీఆర్ ప్లానెట్ ఎ/సి - కొంపల్లి
ఎంక్యూబ్ - అత్తాపూర్
లక్ష్మీకళ - మూసాపేట
పీవీఆర్ - ఆర్.సి.పురం
శివగంగ - బిల్‌సుఖ్

యుద్ధం ముగిసేదెన్నడు?

- ఇజ్రాయెల్-హమాస్ మధ్య పోరుకు ఏడాది పూర్తి
- గాజాలో దారుణ పరిస్థితులు.. వేల మంది మృతి
- ఇరాన్, హెజ్బొల్లా జోక్యంతో పెరిగిన ఉద్రిక్తతలు
- రణ రంగంగా పశ్చిమాసియా.. ప్రపంచం ఆందోళన

గతేడాది డిసెంబర్ 8న గాజాపై ఇజ్రాయెల్ దాడి చేసిన దృశ్యం

జెరూసలేం/ గాజా, అక్టోబర్ 6: గత ఏడాది అక్టోబర్ 7న పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్ హమాస్ ఇజ్రాయెల్‌పై దాడి చేయడంతో ప్రారంభమైన హమాస్-ఇజ్రాయెల్ యుద్ధం ఏడాది కాలంగా రావణ కాష్ఠంలా రగులుతూనే ఉంది. పరస్పరం ప్రతీకార దాడులతో కొనసాగుతున్న పోరు సామాన్యులకు తీరని దుఃఖాన్ని మిగులుస్తున్నది. యుద్ధం వల్ల గాజాలో వేలాది మంది మృతి చెందగా.. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. పాలస్తీనా తరపున యుద్ధంలో ఇరాన్, హెజ్బొల్లా జోక్యం చేసుకోవడంతో హమాస్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. పశ్చిమాసియా రణ రంగంగా మారింది. దీనిపై ఐరాసతో పాటు ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. యుద్ధ విరమణకు అవి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఈ యుద్ధం గాజా, పాలస్తీనా, లెబనాన్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపించింది. హమాస్ ఆరోగ్య శాఖ ప్రకారం ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటివరకు 41,700 మంది మరణించారు. యుద్ధం మొదలై ఏడాది పూర్తయిన సందర్భంగా ఇప్పటిదాకా జరిగిన ముఖ్యమైన ఘటనలను, పరిణామాలను ఒకసారి పరిశీలిద్దాం..

హమాస్ దాడితో ఆరంభం

గత ఏడాది అక్టోబర్ 7న హమాస్ ఫైటర్లు ఇజ్రాయెల్‌పై దాడి చేయడంతో 1205 మంది చనిపోయారు. ఇందులో ఎక్కువ మంది సామాన్య పౌరులే. ఈ ఘటనలో హమాస్ 251 మందిని బందీలుగా గాజాకు తీసుకెళ్లింది. ఇందులో ఇప్పటికీ 64 మంది నిర్బంధంలోనే ఉన్నారు. 117 మందిని విడిచిపెట్టారు. 70 మంది మరణించారు. దీంతో హమాస్‌ను అంతమొందిస్తామని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ప్రతిజ్ఞ చేశారు.

గాజాపై భూతల దాడులు

అక్టోబర్ 13న ఉత్తర గాజాలోని ప్రజలు దక్షిణ ప్రాంతం వైపు తరలి వెళ్లాలని ఇజ్రాయెల్ హెచ్చరించింది. అక్టోబర్ 27న భూతల దాడులు ప్రారంభించింది. నవంబర్ 15న గాజాలోని అతిపెద్ద దవాఖాన అల్-షిఫాపై ఇజ్రాయెల్ దాడి చేసింది.

బందీల మార్పిడి

నవంబర్ 24న హమాస్-ఇజ్రాయెల్ మధ్య చర్చలు జరిగాయి. ఒప్పందం ప్రకారం హమాస్ 80 మంది ఇజ్రాయెల్ పౌరుల్ని విడిచి పెట్టగా, తమ దేశ జైళ్లలో ఉన్న 240 పాలస్తీనియన్లను, 25 మంది ఇతర బందీలను ఇజ్రాయెల్ విడుదల చేసింది.

ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు

డమాస్కస్‌లోని తమ రాయబార కార్యాలయంపై జరిగిన దాడికి ప్రతీకారంగా ఏప్రిల్ 13న ఇరాన్ ఇజ్రాయెల్‌పై డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. అయితే వాటిలో చాలావాటిని ఇజ్రాయెల్ సమర్థంగా అడ్డుకొంది.

గాజా దక్షిణ ప్రాంతంపై దాడులు

మే 7న చాలా మంది శరణార్థులు తల దాచుకున్న గాజా దక్షిణ ప్రాంతంలోని రఫా నగరంపై ఇజ్రాయెల్ సైన్యం భూతల దాడులు ప్రారంభించింది. ఈజిప్ట్‌తో సరిహద్దు కలిగి ఉన్న ప్రాంతాన్ని తన అధీనంలోకి తీసుకొని సాయం అందే మార్గాన్ని దిగ్బంధం చేసింది. జూలై 13న హమాస్ సైన్యాధిపతి మొహమ్మద్ డైఫ్‌ను అంతమొందించినట్టు ఇజ్రాయెల్ తెలిపింది.

భయం రేపిన ప్రాంతీయ హింస

ఇరాన్ అండ కలిగిన హౌతీ రెబెల్స్ సాయంతో యెమెన్ టెల్ అవీవ్‌పై చేసిన దాడికి ప్రతిగా జూలై 20న ఇజ్రాయెల్ యెమెన్‌పై దాడి చేసింది. ఇజ్రాయెల్-లెబనాన్ సరిహద్దుల్లో ఇరాన్ మద్దతు కలిగిన హెజ్బొల్లా-ఇజ్రాయెల్ మధ్య దాదాపు ప్రతిరోజూ పరస్పరం కాల్పులు చోటు చేసుకున్నాయి. జూలై 30న బీరుట్‌పై జరిగిన దాడిలో హెజ్బొల్లా టాప్ కమాండర్ ఫాద్ షుక్ర్ మరణించారు. ఆ తర్వాతి రోజే హమాస్ రాజకీయ నాయకుడు ఇస్మాయిల్ హనియహ్ ఇరాన్‌లో జరిగిన ఒక దాడిలో చనిపోయారు. దీనికి ఇజ్రాయెలే కారణమని హమాస్ ఆరోపించింది.

సంధి చర్చలు విఫలం

ఆగస్టు 16న అమెరికా ప్రతిపాదించిన కొత్త సంధిని హమాస్ తిరస్కరించింది. ఆగస్టు 22న ఈజిప్ట్, ఖతార్ చర్చలకు మధ్యవర్తిత్వం వహించినా అవి విఫలమయ్యాయి. ఆగస్టు 25న లెబనాన్‌పై పెద్ద యెత్తున దాడి చేశామని ఇజ్రాయెల్ ప్రకటించగా.. వందలాది డ్రోన్లు, రాకెట్లను ఇజ్రాయెల్‌పై ప్రయోగించామని హమాస్ తెలిపింది.

లెబనాన్‌లో పేజర్ల పేలుళ్ల కలకలం

సెప్టెంబర్ 17, 18న లెబనాన్‌లో వేలాది మంది హెజ్బొల్లా సభ్యుల పేజర్లు, వాకీటాకీలు పేలి కనీసం 39 మంది మృతి చెందగా, మూడు వేల మంది గాయపడ్డారు. దీనికి తామే బాధ్యులమని ఇజ్రాయెల్ ప్రకటించకపోయినా గాజాపై యుద్ధాన్ని విస్తరిస్తామని ప్రకటించింది. లెబనాన్‌పై బాంబు దాడులు కొనసాగించింది. సెప్టెంబర్ 27న దక్షిణ బీరుట్‌పై దాడి చేసి హెజ్బొల్లా అధినేత హసన్ నస్రల్లాను మట్టుపెట్టింది.

ప్రత్యక్షంగా రంగంలోకి ఇరాన్

నస్రల్లా మృతికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ ప్రతిన బూనారు. నస్రల్లా, హనియా మృతికి బదులు తీర్చుకొనేందుకు అక్టోబర్ 1న ఇజ్రాయెల్‌పై ఇరాన్ వందలాది క్షిపణులతో విరుచుకుపడింది. దక్షిణ లెబనాన్‌లో పరిమితంగా భూతల దాడులు చేస్తామని ఇజ్రాయెల్ ప్రకటించిన రోజే ఈ దాడి జరిగింది.

మసీదులో మృతులు, గాయపడినవారి కోసం వెతుకుతున్న స్థానికులు

అగ్నిగుండంలా పశ్చిమాసియా

- దాడులు, ప్రతిదాడులతో దద్దరిల్లుతున్న ప్రాంతం
- గాజాపై ఇజ్రాయెల్ దాడిలో 24 మంది మృతి
- దక్షిణ బీరుట్‌పైనా ఐడీఎఫ్ వైమానిక దాడులు
- ఇజ్రాయెల్‌పై రాకెట్లతో విరుచుకుపడ్డ హమాస్

బీరుట్, అక్టోబర్ 6: పశ్చిమాసియాలో ఉద్రిక్తత మరింత పెరిగింది. అటు ఇజ్రాయెల్, ఇటు హెజ్బొల్లా, హమాస్‌లు ఎవరికి వారు వెనక్కి తగ్గకపోవడంతో దాడులు, ప్రతిదాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఉత్తరగాజాలో ఇజ్రాయెల్ జరిపిన దాడిలో 24 మంది మరణించారు. శనివారం ఇజ్రాయెల్ దళాలు తొలిసారిగా లెబనాన్‌లోని ట్రిపోలి నగరంపై దాడులు జరిపాయి. మరో పక్క ఇజ్రాయెల్‌పై దాడులు జరిపి ఏడాదైన సందర్భంగా గాజా నుంచి హమాస్ ఆదివారం ఇజ్రాయెల్‌పై రాకెట్ దాడులు చేసింది.

హెజ్బొల్లాకు మరోషాక్

హెజ్బొల్లా చీఫ్ హసన్ నస్రల్లా మృతితో గట్టి షాక్‌లో ఉన్న హెజ్బొల్లాకు మరో ఎదురుదెబ్బ తగిలినట్టు తెలిసింది. మరో కరుడుగట్టిన నేత, నస్రల్లా వారసుడు సఫీద్దీన్, ఇరాన్ కమాండర్ ఇస్మాయిల్ కూడా మరణించినట్టు ప్రచారం జరుగుతున్నది. హెజ్బొల్లా చీఫ్ హసన్ నస్రల్లా హత్య తర్వాత ఆయన వారసుడిగా హషేమ్ సఫీద్దీన్ బాధ్యతలు చేపడతారని విస్తృతంగా ప్రచారం జరిగింది. గురువారం దక్షిణ బీరుట్‌లో ఇజ్రాయెల్ జరిపిన మరో దాడిలో సఫీద్దీన్ మృతి చెందినట్టు వార్తలు వస్తున్నాయి.

ఉత్తర గాజాలో 24 మంది మృతి

ఉత్తర గాజాలో ఇజ్రాయెల్ వాయుసేన జరిపిన దాడిలో 24 మంది మృతి చెందారు. ఆదివారం ఒక మసీదు, స్కూల్ లక్ష్యంగా జరిపిన ఈ దాడిలో 24 మంది మృతి చెందగా, 93 మంది గాయపడ్డారు. కాగా, యుద్ధం కారణంగా గాజా స్ట్రిప్‌లో నిరాశ్రయులైన వారు ఇందులో తలదాచుకుంటున్నారని రాయిటర్స్ సంస్థ తెలిపింది.

ఇరాన్ ఖుద్స్ ఫోర్స్ కమాండర్ మృతి?

ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్(ఐఆర్‌జీసీ) ఖుద్స్ ఫోర్స్ కమాండర్ ఇస్మాయిల్ ఘనీ జాడ కొన్ని రోజులుగా తెలియడం లేదు. శుక్రవారం బీరుట్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడి అనంతరం ఆయన కన్పించడం లేదని, బహుశా ఆ దాడిలో ఆయన మరణించి ఉండవచ్చునని కొన్ని టర్కీ, ఇజ్రాయెల్ వార్తా సంస్థలు వెల్లడించాయి. మరోవైపు ఇజ్రాయెల్ దాడిచేయొచ్చన్న భయాల నేపథ్యంలో ఇరాన్ తన గగనతలాన్ని మూసివేసింది.

జాడ లేని హమాస్ చీఫ్

ఇజ్రాయెల్ వరుసగా ఉగ్ర సంస్థల అగ్రనేతలను హతమారుస్తుండటంతో హమాస్ చీఫ్ యాహ్యా సిన్వార్‌కు భయం పట్టుకుంది. దీంతో ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఎవరితోనైనా మాట్లాడితే ఎక్కడ తన ఆచూకీ కనిపెట్టేస్తారో అన్న భయంలో ఆయన ఖతారీ మధ్యవర్తులతో కనీసం ఫోన్‌లో కూడా మాట్లాడటం లేదని ఖతారీ అధికారులను ఉటంకిస్తూ ఎన్12 వార్తా సంస్థ తెలిపింది. ముందు జాగ్రత్త చర్యగా ఇజ్రాయెల్ బందీలను తన ప్రాణాలకు కవచంగా ఉంచుకున్నారని వెల్లడించింది.

పేజర్ల పేలుడు వెనక 9 ఏండ్ల ప్లాన్

న్యూఢిల్లీ: పేజర్లు, వాకీ టాకీలు పేలి హెజ్బొల్లాకు చెందిన 30 మంది మృతిచెందగా, వేలమంది గాయాలపాలైన విషయం తెలిసిందే. ఈ పేలుడు వెనుక ఇజ్రాయెల్ 9 ఏండ్ల ప్రణాళిక ఉన్నదట. వాషింగ్టన్ పోస్ట్ నివేదిక ప్రకారం.. 2015లో ఇజ్రాయెల్‌కు చెందిన సైబ్ ఏజెన్సీ మొస్సాద్ ఈ ఆపరేషన్ చేపట్టింది. 'భవిష్యత్తులో హెజ్బొల్లాతో ఇబ్బందులు తలెత్తితే పేజర్లు, వాకీ టాకీలనే బాంబుగా మార్చే సాంకేతికతను అభివృద్ధి చేశారు. ఇందుకోసం 9 ఏండ్లు శ్రమించారు. ఎక్కువ చార్జింగ్ ఇచ్చే పేజర్లు, వాకీటాకీలను తయారుచేయాలని నిర్ణయించి, లావైన బ్యాటరీలను చేర్చి.. పేలుడు సంభవించే సాంకేతికతతో తయారుచేశారు. అంటే.. అవి రెండు చేతులతో పట్టుకొనేలా ఉంటాయి. ఎందుకంటే.. పేలుడు సంభవిస్తే రెండు చేతులూ పోవాలన్న ఉద్దేశంతోనే. ఇక, అందులోనే మెసేజ్ డీ-ఎన్‌క్రిప్షన్ వ్యవస్థను కూడా చేర్చారు. సర్వేలెన్స్ కూడా ఉండదని నమ్మించి వారి చేతుల్లో పెట్టారు. అయితే, ఈ పేజర్ల ఎంపికలో ఉగ్ర వాదులు చాలా జాగ్రత్తగా వ్యవహరించారు. ఇజ్రాయెల్‌తో సంబంధం లేని దేశాల వద్దే వీటిని కొనుగోలు చేయాలనుకున్నారు. అందుకే తైవాన్‌కు చెందిన అపోలో పేజర్లు ఆర్డర్ పెట్టారు. ఆ కంపెనీ పేజర్లు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందినవి. తైవాన్ కంపెనీకి చెందిన మహిళ మధ్యప్రాచ్య దేశాలకు సేల్స్ రిప్రజెంటేటివ్‌గా పనిచేసింది. ఆ సమయంలోనే హెజ్బొల్లాకు కావాల్సిన పేజర్లు, వాకీటాకీలు సరఫరా చేశారు. కానీ, అది ఇజ్రాయెల్ ఆపరేషన్ అన్న విషయం ఆ మహిళకు కూడా తెలియదు' అని వాషింగ్టన్ పోస్ట్ కథనంలో పేర్కొన్నది.

జానీ మాస్టర్‌కు జాతీయ

అవార్డు నిలిపివేత

న్యూఢిల్లీ: ఇప్పటికే లైంగిక దాడి ఆరోపణలతో అరెస్టయిన ప్రముఖ టాలీవుడ్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. కేంద్రం గతంలో అతనికి ఇచ్చిన జాతీయ అవార్డును నిలిపివేస్తున్నట్టు అవార్డుల కమిటీ ప్రకటించింది. జానీ మాస్టర్‌పై పోక్సో చట్టం కింద వచ్చిన తీవ్ర ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని 2022లో తిరుచిత్రబలం చిత్రానికి అతనికి ప్రదానం చేసిన ఉత్తమ కొరియోగ్రాఫర్ అవార్డును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు జాతీయ అవార్డుల కమిటీ ప్రకటించింది. అలాగే ఈ నెల 8న న్యూఢిల్లీలో జరిగే 70వ జాతీయ చలనచిత్ర అవార్డుల కార్యక్రమం కోసం ఆయనకు పంపిన ఆహ్వానాన్ని కూడా ఉపసంహరించుకుంటున్నట్టు తెలిపింది. కాగా, ఈ అవార్డుల ఫంక్షన్‌కు హాజరవ్వడానికి తనకు బెయిల్ ఇవ్వాలంటూ జానీ మాస్టర్ చేసిన విజ్ఞప్తిని గురువారం సిటీ కోర్టు అంగీకరించి, ఆయనకు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే.

అలాచేస్తే బీజేపీకి ప్రచారం చేస్తా: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లోగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉచిత కరెంటిస్తే బీజేపీ తరపున ఢిల్లీ ఎన్నికల్లో తాను ప్రచారం చేస్తానని ప్రధాని మోదీకి ఆప్ అధినేత కేజ్రీవాల్ సవాల్ విసిరారు. నవంబర్‌లో జార్ఖండ్, మహారాష్ట్రతో పాటు ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించాలని, ఇందుకు ఆప్ సిద్ధంగా ఉందన్నారు. ఆదివారం ఢిల్లీలో జనతా కీ అదాలత్‌లో కేజ్రీవాల్ మాట్లాడుతూ 'డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలంటే రెట్టింపు అవినీతి, రెట్టింపు దోపిడి, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం. మీరు పొరపాటున బీజేపీకి ఓటేస్తే మీకు మా సర్కారు ఉచితంగా అందిస్తున్న విద్యుత్తు, నీళ్లు, మహిళలకు బస్సు ప్రయాణం, వృద్ధులకు తీర్థయాత్రలు, ఆరోగ్యం, విద్య అదృశ్యమైపోతాయి' అని కేజ్రీవాల్ అన్నారు.

దివాలా దిశగా అమెరికా: మస్క్

వాషింగ్టన్: అమెరికాలో రోజురోజుకు పెరుగుతున్న జాతీయ రుణ భారంపై ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఆల్-ఇన్-పాడ్‌కాస్ట్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమెరికా వేగంగా దివాలా దిశగా వెళ్తున్నదని అన్నారు. అమెరికాలో నెలకొన్న ఆర్థిక సవాళ్లపై ఆయన ఆందోళన వ్యక్తం చేస్తూ, రోజురోజుకు జాతీయ రుణం, వడ్డీల చెల్లింపు భారం అధికమవుతున్నదని చెప్పారు. దేశం చేసిన రుణాలపై వడ్డీలే ఈ ఏడాది ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నాయని, దేశంలో వసూలు చేసిన పన్నుల్లో 76% వాటి చెల్లింపులకే సరిపోతున్నదని తెలిపారు. ఇది ఇలాగే కొనసాగితే అమెరికా దివాలా తీస్తుందని చెప్పారు.

దసరా తర్వాత సిద్ధరామయ్య రాజీనామా!

కర్ణాటక బీజేపీ చీఫ్ బీవై విజయేంద్ర వ్యాఖ్యలు

మైసూరు: 'ముడా' స్కామ్‌లో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఎం సిద్ధరామయ్యపై కర్ణాటక బీజేపీ చీఫ్ బీవై విజయేంద్ర సంచలన వ్యాఖ్యలు చేశారు. దసరా తర్వాత సిద్ధరామయ్య తన సీఎం పదవికి రాజీనామా చేయవచ్చునని అన్నారు. ఆదివారం మైసూరులో విలేకరులతో మాట్లాడుతూ, 'రోజూ మీడియా ముందుకు వచ్చి తానే సీఎం అని సిద్ధరామయ్య చెప్పుకునే పరిస్థితి ఉంది. దసరా తర్వాత ఏ క్షణమైనా సీఎం పదవికి ఆయన రాజీనామా చేయొచ్చు! అని అన్నారు.

మహిళ కడుపులో 2 కిలోల వెంట్రుకలు

సర్జరీ చేసి తొలగించిన వైద్యులు

లక్నో : తీవ్రమైన కడుపునొప్పితో దవాఖానకు వచ్చిన ఓ మహిళ(21)కు వైద్యులు వివిధ రకాల పరీక్షలు నిర్వహించగా.. ఆమె పొత్తి కడుపులో 2 కిలోల వెంట్రుకలు ఉన్నట్టు గుర్తించారు. సర్జరీ చేసి ఆ వెంట్రుకల్ని తొలగించారు. ఈ ఘటన గత నెల 26న ఉత్తరప్రదేశ్‌లో బరేలీ జిల్లా దవాఖానలో చోటుచేసుకుంది. బాధిత మహిళకు వెంట్రుకలు తినే అలవాటుందని, ఇదొక మానసిక రుగ్మతగా వైద్యులు పేర్కొన్నారు.

శబరిమల ప్రసాదంలో క్రిమి సంహారకాలు

తిరువనంతపురం: తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందన్న వివాదం ఇటీవల తీవ్ర సంచలనం సృష్టించగా, ఇప్పుడు మరో ప్రసాదంపై వివాదం రేగింది. శబరిమల ప్రసాదం అరవణలో కల్తీ జరిగిందని, మోతాదుకు మించి క్రిమిసంహారకాలు కలిశాయన్న విషయం బయటకు వచ్చింది. దీంతో ఈ అరవణను ఎరువుగా మార్చనున్నారు. శబరిమల అయ్యప్ప దేవాలయంలోని 6.65 లక్షల కంటైనర్లలో ఈ ప్రసాదం గత ఏడాదిగా వాడకుండా ఉంది. ప్రసాదం తయారీలో ఉపయోగించిన యాలకుల్లో ఆమోదించదగ్గ స్థాయి కన్నా ఎక్కువగా క్రిమిసంహారకాలు కలిసినట్టు వచ్చిన ఆరోపణల వల్లే వీటి వాడకాన్ని నిలిపివేశారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఉండటానికి టీడీబీ దానిని శాస్త్రీయ విధానంలో పారబోసేందుకు టెండర్లను ఆహ్వానించింది. ఈ టెండర్‌ను ఇండియన్ సెంట్రిప్యుజ్ ఇంజనీరింగ్ సొల్యూషన్స్ పొందిందని, వారు కలుషితమైన ప్రసాదాన్ని ఎరువుగా మారుస్తారని టీడీబీ చైర్మన్ ప్రశాంత్ తెలిపారు.

చెన్నై మెరీనా బీచ్‌లో ఎయిర్ షోకు భారీగా తరలివచ్చిన సందర్శకులు

చెన్నై ఎయిర్ షోలో విషాదం.. ఐదుగురు సందర్శకుల మృతి

దవాఖానపాలైన వందల మంది.. అస్తవ్యస్త ఏర్పాట్లపై విమర్శలు

చెన్నై, అక్టోబర్ 6: చెన్నైలో జరిగిన ఎయిర్ షోలో విషాదం చోటు చేసుకుంది. ప్రదర్శన చూడటానికి వచ్చిన పౌరుల్లో ఐదుగురు మరణించగా, 230 మంది దవాఖాన పాలయ్యారు. భారత వైమానిక దళం 92వ వార్షిక దినోత్సవ ఉత్సవాలను పురస్కరించుకుని చెన్నై మెరీనా బీచ్‌లో నిర్వహించిన ఈ ప్రదర్శనకు 15 లక్షల మంది హాజరయ్యారు. అయితే తీవ్ర ఎండ వేడికి తోడు, లక్షలాది మంది హాజరు కావడంతో పలువురు డీహైడ్రేషన్‌కు గురయ్యారు. ఈ ఎయిర్ షో ద్వారా లిమ్కా రికార్డు నెలకొల్పుతామని ప్రకటించిన నిర్వాహకులు దానికి తగిన ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారు. పోలీసుల వైఫల్యం వల్ల నగరంలో ఎక్కడికక్కడ ట్రాఫిక్‌జామ్‌లు ఏర్పడ్డాయి. కార్యక్రమం ముగిసిన తర్వాత అక్కడి నుంచి వెళ్లే క్రమంలో తీవ్ర గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రయాణికులతో రైల్వే స్టేషన్ కిక్కిరిసిపోయింది. చాలా మంది వృద్ధులు, మధ్య వయస్కులు ప్రదర్శన ప్రారంభం కాకముందే స్పృహతప్పి పడిపోవడం కన్పించింది. దీనికి తోడు మంచినీటిని అమ్మేవారిని అక్కడి నుంచి తొలగించడంతో ప్రజలు దాహంతో అల్లాడారు. తీవ్ర ఎండకు తాళలేక పలువురు రోడ్డు పక్కన కూలబడిపోవడం కన్పించింది. స్థానిక నివాసితులు వచ్చి వీరికి మంచినీరు అందించడంతో తేరుకున్నారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని చేపట్టిన నిర్వాహకులు కనీస ఏర్పాట్లు, అవసరాలను విస్మరించారని పలువురు మండిపడ్డారు.

వీడియో కాల్స్ ద్వారా అరెస్టులు జరగవు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న ఐ4సీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 6: దేశంలో 'డిజిటల్ అరెస్టు'లకు సంబంధించిన నేరాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలకు ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) శనివారం ఓ అడ్వైజరీని జారీ చేసింది. సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కస్టమ్స్, పోలీస్ అధికారులు లేదా జడ్జీలు వీడియో కాల్స్ ద్వారా ఎవరినీ అరెస్టు చేయరని ఆ అడ్వైజరీలో స్పష్టం చేసింది. డిజిటల్ అరెస్టులను కుంభకోణం (స్కామ్)గా పేర్కొన్నది. ఇంటర్నెట్‌తోపాటు వాట్సాప్, స్కైప్ లాంటి సోషల్ మీడియా వేదికలు, వాటి లోగోలను ఉపయోగించడం ద్వారా జరిగే ఇలాంటి నేరాల బారిన పడొద్దని ప్రజలకు సూచించింది. డిజిటల్ అరెస్టులకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, అందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపింది.

కెనడాలో వెయిటర్ ఉద్యోగాల కోసం వేల మంది భారతీయుల క్యూ

న్యూఢిల్లీ: మెరిసేదంతా బంగారం కాదని మరోమారు రుజువైంది. విదేశాలకు వెళ్తున్న మన వాళ్లంతా సుఖపడిపోతున్నారని, రాజభోగాలు అనుభవిస్తున్నారని అనుకుంటే అంతకంటే మూర్ఖత్వం మరోటి ఉండదని తాజాగా రుజువైంది. కెనడాలోని బ్రాంప్టన్‌లో ఉన్న తందూరి ఫ్లేమ్ రెస్టారెంట్‌లో వెయిటర్, సర్వర్ ఉద్యోగాలకు 3 వేల మంది భారతీయ విద్యార్థులు క్యూ కట్టడం అక్కడి దారుణ పరిస్థితులను కండ్లకు కడుతున్నది. కిలోమీటరు పొడవున్న లైనులో ఉద్యోగార్థులు నిలబడి ఉన్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. 'మేఘ్ అప్‌డేట్స్' ఎక్స్ ఖాతాలో షేర్ చేసిన ఈ వీడియో.. కెనడాలో చదువు, ఉద్యోగాలు కోరుకునే యువతకు ఈ వీడియో కనువిప్పు కలిగిస్తుందన్న చర్చ మొదలైంది. కొత్తగా ప్రారంభించబోయే రెస్టారెంట్ వెయిటర్, సర్వెంట్ జాబ్స్‌కు వేసిన అడ్వర్టైజ్‌మెంట్‌కు వచ్చిన రెస్పాన్స్ ఇదని అందులో పేర్కొన్నారు. ఎన్నో కలలతో కెనడాకు వెళ్లే భారతీయ విద్యార్థులు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరాన్ని ఈ వీడియో నొక్కి చెప్తున్నది. మాంద్యం తరుముకొస్తున్న వేళ విదేశాలకు వెళ్లకపోవడమే బెటరని కొందరు సలహా ఇస్తున్నారు.

భోపాల్‌లో 1800 కోట్ల డ్రగ్స్ స్వాధీనం

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో రూ.1800 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుబడింది. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, గుజరాత్ ఏటీఎస్ సంయుక్త ఆపరేషన్ నిర్వహించి ఈ మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నాయి. భోపాల్ సమీపంలోని ఓ పరిశ్రమపై నిర్వహించిన దాడిలో ఈ భారీ డ్రగ్ రాకెట్‌ను గుర్తించారు. ఈ ఫ్యాక్టరీలో మెఫెడ్రోన్ డ్రగ్ తయారు చేస్తున్నట్టు గుర్తించారు. అక్రమంగా డ్రగ్స్ తయారీకి సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. దేశ రాజధానిలో వారం క్రితం సుమారు రూ.5 వేల కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకొన్న విషయం తెలిసిందే. ఇంతలోనే భోపాల్‌లోనూ భారీగా డ్రగ్స్ పట్టుబడటం గమనార్హం.

12 రకాల క్యాన్సర్లను గుర్తించే రక్త పరీక్ష

బ్రిటన్‌లో అందుబాటులోకి

లండన్, అక్టోబర్ 6: ఎన్నో రకాల ఆరోగ్య సమస్యల్ని గుర్తించటంలో 'రక్త పరీక్ష' చాలా కీలకం. 12 రకాల సాధారణ క్యాన్సర్లను కూడా ముందుగా పసిగట్టే 'గేమ్ ఛేంజింగ్' అనదగ్గ రక్త పరీక్ష బ్రిటన్‌లో అందుబాటులోకి రాబోతున్నది. క్యాన్సర్ లక్షణాలు రోగిలో బయటపడక ముందే ఈ రక్త పరీక్ష వ్యాధిని బయటపెడుతుందని తెలిసింది. తద్వారా కొన్ని లక్షలాది మంది క్యాన్సర్ రోగులకు ప్రాణాపాయం తప్పుతుందని, స్కానింగ్‌లు, టెస్టుల కోసం కొన్ని నెలలపాటు రోగుల సమయం వృథా కాకుండా చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. బ్రిటన్ ఆరోగ్య మంత్రి వెస్ స్ట్రీరింగ్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిధులతో దేశవ్యాప్తంగా 'సార్వత్రిక' రక్త పరీక్షలను ఈ ఐదేండ్లపాటు అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు తాజాగా ప్రకటించారు. ఈ పథకం కోసం 2.5 మిలియన్ పౌండ్ల (సుమారుగా రూ.27.56 కోట్లు) నిధులను బ్రిటన్ ప్రభుత్వం కేటాయించింది. సార్వత్రిక రక్త పరీక్ష పథకం అమలులో స్టార్టప్ కంపెనీ 'ఎక్స్‌జెనెరా' ప్రభుత్వానికి సాయం చేయనున్నది. ఊపిరితిత్తులు క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, మూత్రాశయ క్యాన్సర్.. ఇలా 12 రకాల సాధారణ క్యాన్సర్లను గుర్తించే రక్త పరీక్షకు సంబంధించి ఒక రోగికి 120 పౌండ్లు (రూ.13 వేలు) ఖర్చు అవుతుందట.

మైక్రో ప్లాస్టిక్ ముప్పు లేని పీవీసీ

న్యూయార్క్ : పర్యావరణానికి, మనుషుల ఆరోగ్యానికి ప్రమాదంగా మారుతున్న మైక్రో ప్లాస్టిక్ ముప్పు లేని కొత్త పాలివినైల్ క్లోరైడ్(పీవీసీ)ని అమెరికాలోని ఓహియో స్టేట్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. స్వచ్ఛమైన పీవీసీ వేడిని తట్టుకోలేదు. అందుకే తయారీదారులు పలు రసాయనాలను ఉపయోగించి పీవీసీతో ఉత్పత్తులను తయారుచేస్తారు. ఈ రసాయనాలు కొంతకాలానికి బయటకు వచ్చేస్తాయి. ఫలితంగా పీవీసీ నుంచి మైక్రోప్లాస్టిక్‌లు పర్యావరణంలోకి విడుదలవుతాయి. ఈ సమస్యకు పరిష్కారంగా శాస్త్రవేత్తలు పీవీసీ ఉత్పత్తుల తయారీకి కొత్త రసాయన ఫార్ములాను తయారుచేశారు.

అంటార్కిటికాలో పరుచుకుంటున్న పచ్చదనం

- తగ్గుతున్న మంచు విస్తీర్ణం
- పెరుగుతున్న వృక్షజాలం
- యూకే పరిశోధకుల వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 6: అంటార్కిటికా అంటే మంచుతో కప్పి ఉండే కొండలతో నిండి ఉండే తెల్లటి ప్రాంతం మనకు గుర్తుకు వస్తుంది. అయితే అలాంటి అంటార్కిటికా నాటకీయంగా హరితవనంగా మారుతున్నదని, గత మూడు దశాబ్దాలతో పోలిస్తే ఇటీవల కొన్ని ఏండ్లుగా 30 శాతం అక్కడ పచ్చదనం పర